జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం




రంగారెడ్డి | శుక్రవారం 28 మార్చి 2025 | సంపుటి : 15 | సంచిక : 203 | వెల: రూ.5 | పేజీలు: 08 | RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పూర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

## 2027 డిసెంబర్ నాటికి
# పోలవరం పూర్తి




- ఇప్పటికి రూ.829 కోట్లు నేరుగా నిర్వాసితుల ఖాతాలో వేసిన ఘనత తమ ప్రభుత్వానిదని
- పోలవరంలో నీళ్లు వదిలే ముందే, 2027 నవంబర్ నాటికి పునరావాసం పూర్తి చేస్తాం
- రాజకీయ వివక్షతో పోలవరం.. ప్రాజెక్టుకు తీవ్ర నష్టం
- ఇప్పటికి 73 శాతం పనులు పూర్తి
- గత పాలకుల అహంభావంతో ప్రాజెక్టుకు శాపం
- సీఎం చంద్రబాబు

**ప్రజాజ్యోతి అమరావతి**

2027 డిసెంబర్ నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తిచేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు. ఇప్పటికి రూ.829 కోట్లు నేరుగా నిర్వాసితుల ఖాతాలో వేసిన ఘనత తమ ప్రభుత్వానిదని చంద్రబాబు అన్నారు. పోలవరంలో నీళు వదిలే ముందే, 2027 నవంబర్ నాటికి పునరావాసం పూర్తి చేస్తామని కూడా సీఎం చంద్రబాబు తేల్చిచెప్పారు. పోలవరం ప్రాజక్టులో భూములు కోల్పోయిన బాధితులకు పునరావాసాలు ఇచ్చిన తర్వాతే ప్రాజెక్టుకు నీటిని విడుదల చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. దళారులు, మోసగాళ్లకు అవకాశం లేకుండా చేస్తామన్నారు. మన ఎన్డీయే ప్రభుత్వం వచ్చిందని, సకాలంలో ప్రాజెక్టు పూర్తి చేసుకుందామని అన్నారు. దళారులు, మోసగాళ్లకు అవకాశం లేకుండా చర్యలు తీసుకుంటామని నిర్మాణంలో ఆలస్యం వల్ల హైడల్ ప్రాజెక్టు వ్యయం భారీగా పెరిగిందని చంద్రబాబు చెప్పారు. వైఎస్ జగన్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పోలవరం నిర్వాసితులకు రూ.10 లక్షల పరిహారం ఇస్తానన్న విషయాన్ని చంద్రబాబు గుర్తు చేశారు. అధికారంలోకి - మిగతా3లో



## వైసీపీ హయాంలో
# బడా స్కాం

- మంత్రి కొల్లు రవీంద్ర వార్నింగ్
- గత జగన్ ప్రభుత్వంలో కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలను హరించారు
- ఆరు నెలల్లో నాటుసారాను పూర్తిగా నిర్మూలించాలన్న ఉద్దేశంతో నవోదయం 2.0 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం
- మే 1వ తేదీ నాటికి రాష్ట్రాన్ని నాటుసారా రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం

**ప్రజాజ్యోతి కృష్ణా**

నాటుసారా రహిత రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దేందుకు 2016లో తొలిసారిగా నవోదయం కార్యక్రమాన్ని ప్రారంభించామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా కృష్ణాజిల్లా కలెక్టరేట్‌లో సంబంధిత శాఖాధికారులతో ఇవాళ(గురువారం) మంత్రి కొల్లు రవీంద్ర - మిగతా3లో

## పిఠాపురం అభివృద్ధిలో
# మరో ముందడుగు



- పిఠాపురం నియోజకవర్గంలో అభివృద్ధి పనులు నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలి
- క్షేత్ర స్థాయిలో పురోగతిని పరిశీలించాలి
- నియోజకవర్గం అభివృద్ధికి వివిధ పథకాల ద్వారా నిధులు సమకూరుస్తున్నామని స్పష్టం

**ప్రజాజ్యోతి అమరావతి**

పిఠాపురం అభివృద్ధిపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఇందులో భాగంగానే కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. పిఠాపురం నియోజకవర్గంలో ఉప ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు పర్యటించారు. పిఠాపురం అభివృద్ధి పనులపై ఇవాళ(గురువారం) అధికారులతో పవన్ కల్యాణ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు. పిఠాపురం నియోజకవర్గంలో అభివృద్ధి పనులు నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి వారం సమీక్ష చేపట్టాలి... క్షేత్ర స్థాయిలో - మిగతా3లో



## భారత సాయాన్ని గుర్తుచేసిన మోదీ..

- బంగ్లా తాత్కాలిక అధినేతకు ప్రధాని మోదీ లేఖ..
- యూనస్ మహమ్మద్ బంగ్లాదేశ్ లో అధికారం చేపట్టిన నాటి నుంచి ఆ దేశంలో హిందువులపై హింస
- ఆగస్టు 2024 నుంచి ఫిబ్రవరి 2025 మధ్య బంగ్లాదేశ్‌లో మైనారిటీలుగా ఉన్న హిందువులపై 2,374 కి పైగా హింసాత్మక దాడులు
- మన ద్వైపాక్షిక భాగస్వామ్యానికి పునాది వేసిన మన ఉమ్మడి చరిత్ర, త్యాగాలకు ఈ రోజు నిదర్శనంగా నిలుస్తుంది
- బంగ్లాదేశ్ విముక్తి యుద్ధం స్ఫూర్తి మన సంబంధానికి మార్గదర్శక కాంతిలా కొనసాగుతోంది

## బీసీ హాస్టల్ విద్యార్థి
# దుర్మరణం బాధాకరం

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- వార్డెన్ సస్పెన్షన్ కు ఆదేశం
- విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడుకోండి
- తల్లిదండ్రుల కంట కన్నీరు రానీయొద్దు : మంత్రి సవిత



**ప్రజాజ్యోతి అమరావతి**

గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు బీసీ హాస్టల్ విద్యార్థి కిశోర్ చెరువులో పడి దుర్మరణం పాలవ్వడంపై రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విద్యార్థి మృతిపై విచారకరమని ఆవేదన వ్యక్తంచేస్తూ, విద్యార్థులపై పర్యవేక్షణ లేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన హాస్టల్ వార్డెన్ ను తక్షణమే సస్పెండ్ చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. పల్నాడు జిల్లా వెందుర్తి మండలం గంగలకుంట గ్రామానికి చెందిన - మిగతా3లో



## వరల్డ్ నెంబర్ వన్ కుబేరుడిగా మళ్లీ ఎలాన్ మస్క్

- ఎలాన్ మస్క్ నికర సంపద విలువ రూ.35 లక్షల కోట్లు
- టెస్లా షేర్ల పెరుగుదలే ప్రధాన కారణం
- ట్రంప్ మళ్లీ పగ్గాలు చేపట్టాక అమెరికన్ బిలియనీర్ల సంపద వృద్ధి
- మస్క్ నికర విలువ 82% పెరిగి మొత్తం సంపద 420 బిలియన్ డాలర్లకు చేరుకుందని ఒక నివేదిక

# ముస్లిం మైనార్టీలకు అండగా ఉంటా

- ఇఫ్తార్ విందులో సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు
- పేదలతో తానుండాలనేదే తన జీవితాశం
- నూటికి నూరు శాతం పేదల్నిపైకి తీసుకొచ్చేందుకే పీ4ను మార్చి 30వ తేదీ నుంచి చేపడుతున్నాం
- పేదరికంలో ఉన్న ప్రతీ ముస్లిం కుటుంబాన్ని ఆర్థికంగాపైకి తీసుకొస్తాం
- మత సామరస్యాన్ని కాపాడుతూ.. ముస్లిం మైనార్టీలను అన్ని విధాలాపైకి తీసుకొస్తాం



**ప్రజాజ్యోతి విజయవాడ**

తెలుగుదేశం పార్టీ మొదటి నుంచి మైనార్టీలకు అండగా ఉందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. వారి సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నామని ఆయన తెలిపారు. గురువారం సాయంత్రం విజయవాడలో ముస్లిం సోదరులకు ప్రభుత్వం ఇఫ్తార్ విందు ఇచ్చింది. ఈ కార్యక్రమం లో సీఎం చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పేదలతో తానుండాలనేదే తన జీవితాశమయని ఆయన పేర్కొన్నారు. నూటికి నూరు శాతం పేదల్నిపైకి తీసుకొచ్చేందుకే పీ4ను మార్చి 30వ తేదీ నుంచి చేపడుతున్నామని ఆయన వివరించారు. పేదరికంలో ఉన్న ప్రతీ ముస్లిం కుటుంబాన్ని ఆర్థికంగాపైకి తీసుకొస్తామన్నారు. అలాగే వక్ఫ్ బోర్డు ఆస్తులని కాపాడతామని ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు సీఎం చంద్రబాబు భరోసా ఇచ్చారు. మత సామరస్యాన్ని - మిగతా3లో



## రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ త్వరలోనే మరణిస్తాడు

- ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్స్కీ సంచలన వ్యాఖ్యలు
- ఆయన మరణంతో రష్యా- ఉక్రెయిన్ యుద్ధం కూడా ముగుస్తుంది
- పుతిన్ తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారంటూ గతకొంత కాలంగా ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే.
- యుద్ధం ఆపేందుకు రష్యాపై ఒత్తిడి తీసుకురావాలని ప్రపంచ దేశాలకు విజ్ఞప్తి

## భార్య అలా బెదిరించినా సరే

# విడాకులు తీసుకోవచ్చు!



**ముంబై:** విడాకులు తీసుకోవడానికి సంబంధిత చట్టాలు.. అందులోని సెక్షన్లు కారణాలేంటన్నదానిపై స్పష్టత ఇచ్చాయి. అయితే సందర్భం దొరికినప్పుడల్లా ఆ సెక్షన్ల విస్తృత పరిధిపై తమ తీర్పులు.. ఆదేశాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తుంటాయి న్యాయస్థానాలు. ఈ క్రమంలోనే తాజాగా విడాకులకు సంబంధించిన బాంబే హైకోర్టు ఓ సంచలన తీర్పు వెల్లడించింది.

జీవిత భాగస్వామి ఇద్దరిలో ఎవరైనా సరే బలవన్మరణానికి పాల్పడతానని బెదిరించినా.. లేదంటే అలాంటి ప్రయత్నం చేసినా.. అది హింస కిందకే వస్తుందని, హిందూ వివాహ చట్టం, 1955 లోని సెక్షన్ 13(1) ప్రకారం విడాకులు మంజూరు చేయొచ్చని బాంబే హైకోర్టు తీర్పు వెల్లడించింది. తన భార్య ఆత్మహత్య చేసుకుంటానం టోందని.. తనను,తన కుటుంబాన్ని జైలుకు పంపిస్తానని బెదిరిస్తోందని ఓ వ్యక్తి కోర్టును ఆశ్రయించాడు. ఇక ఆమెతో కలిసి కాపురం చేయలేనని.. తనకు విడాకులు మంజూరు చేయాలని ఫ్యామిలీ కోర్టును కోరాడు. అక్కడి అతనికి ఊరట దక్కగా.. ఆ తీర్పును సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయిం చింది. ఆమె కేవలం తాను చనిపోయి భర్త కుటుంబాన్ని జైలుకు పంపిస్తానని మాత్రమే బెదిరించడం లేదు.. బలవన్మరణానికి పాల్పడతానని చెబుతోంది కూడా. జీవిత భాగస్వాముల్లో ఎవరైనా ఇలాంటి చర్యలకు పాల్పడితే అది అవతలి వాళ్లను హింసించడమే అవుతుంది. కాబట్టి విడాకులు మంజూరు చేయొచ్చు అని బాంబే హైకోర్టు ఔరంగాబాద్ బెంచ్ న్యాయమూర్తి ఆర్ఎం జోషి తీర్పు వెల్లడించారు. మహారాష్ట్రకు చెందిన సదరు వ్యక్తికి 2009లో వివాహం జరిగింది. ఆ జంటకు ఓ పాప. అయితే భార్య తరఫు బంధువుల రాకతో తమ కాపురం కుప్పకూలిందని విడాకుల పిటిషన్‌లో పేర్కొన్నాడతను. గర్భంతో ఉన్న భార్య తనను వీడి వెళ్లిపోయిందని.. అప్పటి నుంచి తిరిగి రాలేదు. అయితే కొంతకాలం తర్వాత తప్పుడు కేసులతో ఆమె అతన్ని బెదిరించసాగింది. ఈ క్రమంలోనే సూసైడ్ చేసుకుని.. ఆ నేరాన్ని భర్త కుటుంబంపై నెట్టేస్తానని బెదిరించింది. ఇందుకు సంబంధించిన సాక్ష్యాలు, ఆధారాలను కోర్టుకు సమర్పించిన భర్త చివరకు ఫ్యామిలీ కోర్టు నుంచి కిందటి నెలలో విడాకులు పొందగలిగాడు. భార్య ఆ తీర్పును సవాల్ చేయగా.. బాంబే హైకోర్టు తాజాగా ఆ తీర్పును సమర్థించింది.

# భారత సాయాన్ని గుర్తుచేసిన మోదీ..




షేక్ హసీనా ప్రభుత్వాన్ని పడగొట్టి తాత్కాలిక ప్రభుత్వాధినేతగా యూనస్ మహమ్మద్ బంగ్లాదేశ్ లో అధికారం చేపట్టిన నాటి నుంచి ఆ దేశంలో హిందువులపై హింస చర్చనీయాంశంగా మారింది. విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారిక నివేదికల ప్రకారం, ఆగస్టు 2024 నుంచి ఫిబ్రవరి 2025 మధ్య బంగ్లాదేశ్‌లో మైనారిటీలుగా ఉన్న హిందువులపై 2,374 కి పైగా హింసాత్మక దాడులు జరిగాయంటేనే పరిస్థితి తీవ్రత ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ కారణంగానే చిరకాల మిత్రులైన భారత్, బంగ్లాల మధ్య దూరం పెరుగుతూ వస్తోంది. ఇలాంటి సమయంలో స్నేహ హస్తం అందించేందుకు ఇండియా ఎల్లప్పుడూ సిద్ధమనే సంకేతం పంపిస్తూ బంగ్లాదేశ్ 53వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత ప్రధాని బంగ్లా తాత్కాలిక అధినేతకు లేఖ రాశారు. అందులో ఏముందంటే..

**భారత సాయాన్ని గుర్తుచేసిన మోదీ..**

బంగ్లాదేశ్ 53వ జాతీయ దినోత్సవం జరుపుకున్న సందర్భంగా గురువారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వాధినేత ముహమ్మద్ యూనస్‌కు లేఖ ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. ప్రధానంగా 1971 బంగ్లాదేశ్ విముక్తి యుద్ధం అవిచ్ఛిన్న స్ఫూర్తిని భారతదేశం-బంగ్లాదేశ్ సంబంధాలకు పునాదిగా అభివర్ణించారు. ఆ దేశ స్థాపనలో భారతదేశం పాత్రను బంగ్లాదేశ్‌కు గుర్తు చేశారు. బంగ్లాదేశ్ లో షేక్ ముజిబురాహ్మాన్ వారసత్వాన్ని తుడిచిపెట్టడానికి ప్రయత్నాలు జరుగుతున్న సమయంలో లేఖలో విముక్తి యుద్ధం గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇంకా ఆ లేఖలో ఏముందంటే, "బంగ్లాదేశ్ జాతీయ దినోత్సవం సందర్భంగా మీకు, బంగ్లాదేశ్ ప్రజలకు నా అభినందనలు తెలియజేస్తున్నాను. మన ద్వైపాక్షిక భాగస్వామ్యానికి పునాది వేసిన మన ఉమ్మడి చరిత్ర, త్యాగాలకు ఈ రోజు నిదర్శనంగా నిలుస్తుంది. బంగ్లాదేశ్ విముక్తి యుద్ధం స్ఫూర్తి మన సంబంధానికి మార్గదర్శక కాంతిలా కొనసాగుతోంది. ఇది బహుళ విధాలుగా వృద్ధి చెంది మన ప్రజలకు స్పష్టమైన ప్రయోజనాలను కలిగించింది. శాంతి, స్థిరత్వం, శ్రేయస్సు కోసం ఉమ్మడి ప్రయోజనాలు, ఆందోళనలు పరస్పరం భాగస్వామ్యంతో ముందుకు తీసుకెళ్లేందుకు మేం కట్టుబడి ఉన్నాం" అని రాశారు.

**ఇండియాతో మైత్రికి బంగ్లా తహతహ..**

షేక్ హసీనా బంగ్లాదేశ్ అధ్యక్ష పదవికి రాజీనామా చేసినప్పటి నుంచి ఆ దేశంలో హిందూ మైనార్టీలపై దాడులు పెరిగాయి. ఈ దాడులను భారత్ ఎప్పటికప్పుడు వ్యతిరేకిస్తూ ఆందోళనలు వ్యక్తంచేస్తుండటంతో ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు పలుచబడ్డాయి. అయినప్పటికీ భారత్- బంగ్లా మైత్రిని నిలబెట్టుకునేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉన్నాయి. ఇందులో భాగంగానే బంగ్లాదేశ్ విదేశాంగశాఖ సలహాదారు ఏప్రిల్ 3-4 మధ్య థాయ్‌లాండ్‌లో జరగనున్న ఏడు దేశాల 'బే ఆఫ్ బెంగాల్ ఇనీషియేటివ్ ఫర్ మల్టీ సెక్టోరల్ టెక్నికల్ అండ్ ఎకనామిక్ కోఆపరేషన్' (బిమ్‌స్టెక్) సమావేశంలో మోదీతో యూనస్ ద్వైపాక్షిక భేటీ ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

# 'నేను పెళ్లి చేసుకోలేదు.. బతికిపోయా'

## మీరట్ ఘటనపై బాగేశ్వర్ బాబా




**లక్నో:** 'థ్యాంక్ గాడ్. నేను పెళ్లి చేసుకోలేదు. లేదంటే'.. ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో మర్చంట్ నేవీ అధికారి సౌరభ్ రాజ్‌పుత్ హత్య కేసుపై బాగేశ్వర్ బాబాగా ప్రచారంలో ఉన్న ధీరేంద్ర కృష్ణ శాస్త్రి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రేమించి పెళ్లాడిన భర్త సౌరభ్ రాజ్‌పుత్‌ను ప్రియుడు సాహిల్ సాయంతో కట్టుకున్న భార్య ముస్కాన్ దారుణంగా హత్య చేసి,ముక్కలు చేసిన ఘటన సంచలనం సృష్టించింది. తమ వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే నెపంతో ప్రియుడితో కలిసి భర్త అడ్డు తొలగించుకుంది. అనంతరం, ప్రియుడి సాయంతో ముస్కాన్ తన భర్త సౌరభ్ రాజ్ మృతదేహాన్ని 15 ముక్కలుగా నరికి శరీర భాగాన్ని బులుగు రంగు ప్లాస్టిక్ డ్రమ్ములో దాచి పెట్టి పైన సిమెంటుతో కప్పిపెట్టారు. దారుణం వెలుగులోకి రావడంతో పోలీసులు నిందితుల్ని కటకటాల్లోకి నెట్టారు. ఈ నేపథ్యంలో సౌరభ్ రాజ్ ఘటనపై ఓ కార్యక్రమంలో పాల్గొన్న ధీరేంద్ర కృష్ణ శాస్త్రి స్పందించారు. ప్రియుడి సాయంతో భర్తను హతమార్చిన ఘటనను ఉదహరించారు. 'ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. తల్లి దండ్రులు వారి పిల్లల్ని సరిగ్గా పెంచలేదు. వారి పెంపకంలో లోపాలు కనిపిస్తున్నాయి. అందుకే తల్లిదండ్రులు వారి పిల్లలకు విలువల్ని నేర్పించాలి. ఇందుకోసం శ్రీరామ చరిత్మానస్ బోధనలను పాటించాలని సూచించారు. 'ప్రస్తుతం మనదేశంలో బ్లూ డ్రమ్ బాగా పాపులరైంది. చాలా మంది భర్తలు షాక్‌లో ఉన్నారు. థ్యాంక్ గాడ్.నేను పెళ్లి చేసుకోలేదు' అని నవ్వుతూ ప్రతిస్పందించారు. మీరట్ ఘటన దురదృష్టకరం. క్షీణిస్తున్న కుటుంబ వ్యవస్థ, పాశ్చాత్య సంస్కృతి, వివాహిత స్త్రీ, పురుషుల వ్యవహారాలు కుటుంబాలను నాశనం చేస్తున్నాయి. అందుకే ఉన్నతవంతమైన కుటుంబాన్ని నిర్మించేందుకు ప్రతి భారతీయుడు శ్రీరామచరిత్మానస్‌ను ఆచరించాలని కోరారు.

## మూడు మార్గాల్లో ఆర్ఆర్‌టీఎస్ సేవలు



**చెన్నై:** రాష్ట్ర బడ్జెట్‌లో ప్రకటించిన విధంగా, గంటకు 160 కి.మీ హైస్పీడ్‌తో పరుగులు తీసే రీజనల్ రాపిడ్ ట్రాన్సిట్ (ఆర్ఆర్‌టీఎస్) మార్గాల అభివృద్ధికి సాధ్యాసాధ్యాలపై నివేదిక సిద్ధం చేసేందుకు చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) టెండర్లు ఆహ్వానించింది. రాష్ట్ర శాసనసభ సమావేశాల్లో ఈ నెల 14న ఆర్థిక మంత్రి తంగం తెన్నరసు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో.. విస్తృతమైన పట్టణీకరణ పరిగణలోకి తీసుకొని అతి వేగంతో కూడిన రైలు రవాణా అభివృద్ధి చేసేలా సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేయనున్నట్లు ప్రకటించారు. ఆ ప్రకారం, చెన్నై-దిండివనం-విల్లుపురం, చెన్నై-కాంచీపురం-వేలూరు కోయంబత్తూర్-తిరుప్పూర్-ఈరోడ్-సేలం తదితర మూడు మార్గాల్లో సీఎంఆర్ఎల్ సర్వే చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో, ఆర్ఆర్‌టీఎస్ రైలు రవాణా సేవల సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసి నివేదిక అందించే సంస్థ ఎంపికకు సీఎంఆర్ఎల్ టెండర్లు ఆహ్వానించింది. చెన్నై-చెంగల్పట్టు మీదుగా దిండివనం వరకు 160 కి.మీ వేగంతో ఆర్ఆర్‌టీఎస్ రైలు నడిపేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. అలాగే, చెన్నై-కాంచీపురం మార్గంగా వేలూరుకు 160 కి.మీ వేగంతో, కోవై నుంచి తిరుప్పూర్, ఈరోడ్ మీదుగా సేలంకు హైస్పీడ్ రైళ్లు నడుపనున్నారు. కాగా, గంటకు అధికంగా 160 కి.మీ వేగంతో వెళ్లేలా ఆర్ఆర్‌టీఎస్ రవాణా ఢిల్లీ-మీరట్ మధ్య అందుబాటులో ఉంది.

## యూట్యూబర్స్, రీల్స్ చేసే వారికి షాకింగ్ న్యూస్.. అక్కడికి నో ఎంట్రీ..




ప్రపంచంలో ఎక్కడా దొరకని సోషల్ మీడియా సరుకు మన భారతదేశంలోనే దొరుకుతుంది. పూసలు అమ్ముకునే వారిని, బిచ్చగత్తెను కూడా సెలెబ్రిటీని చేసే సత్తా మన సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లకు ఉంది. ఓ సెల్‌ఫోన్ చేతిలో పట్టుకుని.. ఎక్కడ పడితే అక్కడ.. ఎవర్ని పడితే వారిని వీడియోలు తీసేస్తూ ఇన్‌ఫ్లుయెన్సర్లు రచ్చ చేస్తూ ఉన్నారు. వ్యూస్, లైకుల కోసం ఆఖరికి గుళ్లను కూడా వదలటం లేదు. వీడియోలు తీసే నెపంతో పవిత్ర స్థలాల్లో కూడా పిచ్చి పిచ్చి పనులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రాలు కేధార్‌నాథ్-బద్రీనాథ్ సంచలన నిర్ణయం తీసుకున్నాయి. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లకు గుడి ప్రాంగంణంలోకి అనుమతి నిషేధించాయి. మరికొన్ని రోజుల్లో చార్ ధామ్ యాత్ర మొదలవుతుంది. ఏప్రిల్ 3 అక్షయ తృతీయ సందర్భంగా గంగోత్రి, యమునోత్రి గుడి తలుపులు తెరుకుంటాయి. అప్పటినుంచి చార్ ధామ్ యాత్ర మొదలవుతుంది. మే 2వ తేదీన కేధార్‌నాథ్ గుడి తలుపులు తెరుచుకుంటాయి. అనంతరం మే 4వ తేదీన బద్రీనాథ్ గుడి తలుపులు తెరుచుకుంటాయి. ఈ నేపథ్యంలోనే పూర్తి స్థాయి చార్ ధామ్ యాత్ర మొదలవుతుంది. యాత్రకు వచ్చే సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల విషయంలో కేధార్‌నాథ్-బద్రీనాథ్ పండ సమాజ్ కఠినంగా వ్యవహరించాలని భావిస్తోంది. గుడి ప్రాంగణంలోకి వారికి అనుమతి నిషేధించింది. ఎవరైనా గుడి ప్రాంగణంలో వీడియోలు తీస్తూ కనిపిస్తే.. దర్శనం అవ్వకుండానే వెనక్కు పంపేస్తామని స్పష్టం చేసింది. ఏప్రిల్ 30 నుంచి సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లపై నిషేధం ఉంటుంది. ఈ కొత్త రూలుకు సంబంధించి కేధార్‌నాథ్-బద్రీనాథ్ పండ సమాజ్ ప్రభుత్వంతో చర్చించింది. ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించింది. ఇక, యాత్ర సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండానికి అన్ని ఏర్పాట్లు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. యాత్ర జరిగే మొత్తం 10 కిలోమీటర్ల పరిధిలో పోలీస్ పహారా ఉండనుంది. పోలీసులు బైకులపై తిరుగుతూ భక్తుల యోగక్షేమాలు తెలుసుకుంటారు. అవసరమైన వారికి సాయం చేస్తారు. చార్ ధామ్ యాత్ర కోసం కేవలం ఆరు రోజుల్లో 9 లక్షల మంది భక్తులు ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు.

## రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ త్వరలోనే మరణిస్తాడు



**న్యూ ఢిల్లీ :** ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ షాకింగ్ కామెంట్స్ చేశారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ త్వరలోనే మరణిస్తాడంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన మరణంతో రష్యా- ఉక్రెయిన్ యుద్ధం కూడా ముగుస్తుందంటూ వ్యాఖ్యానించారు. పారిస్‌లో బుధవారం ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్‌తో సమావేశం అనంతరం జెలెన్‌స్కీ మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. 'అతను (పుతిన్‌ను ఉద్దేశిస్తూ) త్వరలో చనిపోతాడు. ఇది నిజం. ఆయన మరణంతో రెండు దేశాల మధ్య యుద్ధం ముగుస్తుంది' అని విలేకరులతో జెలెన్‌స్కీ అన్నారు. పుతిన్ తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారంటూ గతకొంత కాలంగా ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ ప్రచారం నేపథ్యంలో జెలెన్ స్కీ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.మరోవైపు ఇరుదేశాల మధ్య శాంతి నెలకొనడం రష్యాకు ఇష్టం లేదని జెలెన్‌స్కీ ఈ సందర్భంగా ఆరోపించారు. యుద్ధం ఆపేందుకు రష్యాపై ఒత్తిడి తీసుకురావాలని ప్రపంచ దేశాలకు ఆయన విజ్ఞప్తి చేశారు. కాగా, అమెరికా ప్రతిపాదించిన పాక్షిక కాల్పుల విరమణకు ఉక్రెయిన్ ఇప్పటికే ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఈ విషయంలో రష్యాను ఒప్పించేందుకు అమెరికా ప్రయత్నిస్తోంది. అమెరికా ప్రతినిధులు సౌదీ అరేబియా వేదికగా రష్యాతో చర్చలు జరుపుతున్నారు.

## వరల్డ్ నెంబర్ వన్ కుబేరుడిగా మళ్లీ ఎలాన్ మస్క్



ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడిగా ఎలాన్ మస్క్ తిరిగి తన స్థానాన్ని కైవసం చేసుకున్నారు. టెస్లా స్టాక్ విలువ పెరగడంతో ఎలాన్ మస్క్ సంపద 82 శాతం వృద్ధి చెంది 420 బిలియన్ డాలర్లకు (రూ.35 లక్షల కోట్లకు) చేరుకుంది. హురూన్ రిచ్ లిస్ట్ ప్రకారం టెస్లా అధినేత ఎలాన్ మస్క్ ఐదేళ్లలో నాలుగోసారి ప్రపంచ కుబేరుల జాబితాలో అగ్రస్థానాన్ని దక్కించుకున్నారు. టెస్లా, స్పేస్ఎక్స్ అధిపతిగా ఉన్న 53 ఏళ్ల మస్క్ నికర విలువ 82% పెరిగి మొత్తం సంపద 420 బిలియన్ డాలర్లకు చేరుకుందని ఒక నివేదికలో పేర్కొంది. టెస్లా షేర్ ధర పెరగడం వల్లనే ఇది సాధ్యమైంది. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నికైన తర్వాత అమెరికా బిలియనీర్ల సంపద పెరగడంలో ఆశ్చర్యమేమీ లేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ట్రంప్ హయాంలో మార్కెట్ పుంజుకోవడంతో మస్క్ సంపద భారీగా పెరిగింది. దీని ద్వారా చాలామంది అమెరికన్ టెక్నాలజీ దిగ్గజాలు లాభపడ్డారు. వీరిలో పీటర్ థీల్ వంటి సహచరులు కూడా ఉన్నారు. థీల్ ఆర్థిక హోల్డింగ్స్ 67% పెరిగి 14 బిలియన్ డాలర్లకు చేరగా, మస్క్ 400 బిలియన్ డాలర్లకు పైగా వ్యక్తిగత సంపదను కలిగి ఉన్న వ్యక్తిగా రికార్డు సృష్టించారు. ట్రంప్ ఎన్నికల విజయంతో పెట్టుబడిదారుల నమ్మకం పెరగడంతో టెస్లా షేర్ విలువ పెరిగిందని హురూన్ నివేదిక పేర్కొంది. ఇటీవల ఎలాన్ మస్క్ సంపదలో హెచ్చుతగ్గులు చోటు చేసుకున్నాయి. 2025 జనవరి 15, తర్వాత అతని నికర విలువ దాదాపు 100 బిలియన్ డాలర్లు తగ్గింది. టెస్లా మార్కెట్ విలువ 700 బిలియన్ డాలర్లు తగ్గడంతో ఈ నష్టం వాటిల్లింది. చైనా ఎలక్ట్రిక్ వాహన తయారీదారుల నుంచి పెరుగుతున్న పోటీ, మస్క్ రాజకీయ ప్రకటనలపై వినియోగదారుల నుంచి వ్యతిరేకత రావడంతో పెట్టుబడిదారులు ఆందోళన చెందారు. అయినప్పటికీ, మస్క్ ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడిగా తన స్థానాన్ని నిలబెట్టుకున్నారు. ఇటీవల కాలంలో ఇతర అమెరికన్ బిలియనీర్లు కూడా భారీగా సంపదను కూడగట్టుకున్నారు. ఫేస్‌బుక్ వ్యవస్థాపకుడు మార్క్ జుకర్‌బర్గ్, అమెజాన్ అధినేత జెఫ్ బెజోస్, ఎన్విడియా సీఈఓ జెన్సెన్ హువాంగ్ కూడా ఒక్కొక్కరు 80 బిలియన్ డాలర్ల కంటే ఎక్కువ సంపదను కూడగట్టుకున్నారు.

# వైసీపీ హయాంలో బడా స్కాం

-మొదటిపేజీ తరువాయి

సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మీడియాతో మాట్లాడుతూ.. ఆరు నెలల్లో నాటుసారాను పూర్తిగా నిర్మూలించాలన్న ఉద్దేశంతో నవోదయం 2.0 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. మే 1వ తేదీ నాటికి రాష్ట్రాన్ని నాటుసారా రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. గత జగన్ ప్రభుత్వంలో కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలను హరించారని మంత్రి కొల్లు రవీంద్ర ఆరోపించారు. గత వైసీపీ ప్రభుత్వంలో అవినీతిమయమైన ఎక్సైజ్ శాఖను ప్రక్షాళన చేస్తున్నామని చెప్పారు. మద్యం కుంభకోణంలో పాత్రధారులు, సూత్రధారులను గుర్తించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏపీలో మద్యం కుంభకోణం అతి పెద్ద స్కాం అన్నారు. ఢిల్లీలో కన్నా ఏపీలోనే మద్యం స్కాం ఎక్కువ అని టీడీపీ ఎంపీ శ్రీ కృష్ణదేవరాయలు పార్లమెంటులో చెప్పారని మంత్రి కొల్లు రవీంద్ర గుర్తుచేశారు. జగనే కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డిని నడిపించారని విజయసాయి రెడ్డి చెప్పారని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మద్యం తయారీ నుంచి అమ్మకం వరకు అన్నింటిలో అవినీతి జరిగిందని ఆరోపించారు. జగన్ తన ఆదాయం పెంచుకుని... రాష్ట్ర ఆదాయం తగ్గించారని



మండిపడ్డారు. నాసిరకం మద్యం ద్వారా ప్రజల ప్రాణాలతో ఆడుకున్నారని విమర్శించారు. అసలు మద్యం అమ్మకాలు, వచ్చిన ఆదాయంపై విచారణ జరుగుతుందని చెప్పారు. సిట్ వేసిన సాయంత్రమే ఫైళ్లను తగులపెట్టారన్నారు. అన్నీ విచారణ పూర్తి అయ్యాక తప్పకుండా చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. బియ్యం కేసు ఇంకా మూయలేదు... తమపై అనవసరంగా మాట్లాడే వైసీపీ నేతలు నోరు అదుపులో పెట్టుకుంటే మంచిదని మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు.

# మైనింగ్ అక్రమాలపై 76 పేజీల నివేదిక

**కర్నూలు :** వైసీపీ హయంలో ఆంధ్రప్రదేశ్ డిజిటల్ కార్పొరేషన్‌లో భారీగా అక్రమాలు జరిగినట్టు విజిలెన్స్ శాఖ విచారణలో గుర్తించారు. దర్యాప్తు నివేదిక ప్రభుత్వానికి చేరింది. అక్రమాలకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవ దంతో పాటు చట్టపరమైన చర్యలకు ఉపక్రమించాలని విజిలెన్స్ సిఫార్సు చేసింది.వైసీపీ ప్రభుత్వ హయంలో ఏపీ డిజిటల్ కార్పొరేషన్‌లో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ నివేదిక ప్రభుత్వానికి చేరింది. నాటి వీసీ ఎండీ వాసుదేవరెడ్డితో పాటు అక్రమాలకు బాధ్యులైన ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వానికి నష్టం కలిగించిన వారిపై న్యాయపరమైన చర్యలతో పాటు క్రమశిక్షణ చర్యలకు కమిషన్ సిఫార్సు చేసింది.ఏపీ డిజిటల్ కార్పొరేషన్‌లో లేని ఉద్యోగులకు జీతాల చెల్లింపు మొదలుకుని ప్రతి వ్యవహారంలో అక్రమాలు జరిగినట్టు విజిలెన్స్ గుర్తించింది. ఫలితంగా నాలుగేళ్లలో దాదాపు రూ.171 కోట్ల రుపాయల దుర్వినియోగం అయ్యాయని వాటిలో రూ.139 కోట్ల రుపాయలు ఇప్పటికే చెల్లింపులు జరిపినట్టు నివేదికలో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై సీఐడీ, ఏసీబీతో దర్యాప్తు జరపాలని విజిలెన్స్ నివేదిక పేర్కొంది.ఏపీ డిజిటల్ కార్పొరేషన్‌లో కోట్లాది రుపాయల దుర్వినియోగమైనట్టు తేలడంతో ఏపీ డిజిటల్ కార్పొరేషన్ వీసీ ఎండీగా వ్యవహరించిన చిన్న వాసుదేవరెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా విజిలెన్స్ సిఫార్సు చేసింది.వీడియో కంటెంట్ తయారీ పేరుతో భారీగా డబ్బు దుర్వినియోగం చేశారని ఇందుకు బాధ్యులైన ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ సిఫార్సు చేసింది. డేటా మోటిఫ్ డిజిటల్ మీడియా, జిపిఆర్ పబ్లికేషన్స్, డెక్కన్ మీడియా, సాయి నందిని టెక్నో క్రియేషన్స్, షాలోక్ ఎంటర్‌టైన్‌మెంట్స్, అవిసా మీడియా ప్రైవేట్ లిమిటెడ్, శ్రీ సాయి అడ్వర్‌టైజింగ్, ఆర్ఆర్ మీడియా అడ్వర్‌టైజింగ్, త్రీ అటమ్ లీవ్స్ సంస్థలు మోస పూరితంగా ప్రభుత్వానికి నష్టం వాటిల్లేలా చేశారని విజిలెన్స్ నివేదిక ఆరోపించింది.డెక్కన్ మీడియా, త్రీ అటమ్ లీవ్స్ స్టోరీ టెల్లింగ్ సంస్థలు జిఎస్టీ ఎగవేతలకు పాల్పడ్డారని, నగదు చెల్లింపుల్లో జరిగిన అక్రమాలను సరి చేయాలని విజిలెన్స్ నివేదికలో సిఫార్సు చేశారు. ఏపీడీసీ కార్యకలాపాలపై పూర్తి స్థాయిలో సీఐడీ, ఏసీబీ దర్యాప్తు జరపాలని విజిలెన్స్ నివేదిక అభిప్రాయపడింది.ఏపీడీసీలో జరిగిన అక్రమాలకు అప్పటి వీసీ ఎండీ చిన్న వాసుదేవరెడ్డి బాధ్యుడని విజిలెన్స్ నివేదిక పేర్కొంది. ఐ డ్రీమ్ వ్యవస్థాపకుడైన చిన వాసుదేవరెడ్డి ఐపాక్, ఐ డ్రీమ్ ఉద్యోగులను ఏపీడీసీలో ఉద్యోగులుగా చూపినట్టు విజిలెన్స్ నివేదిక పేర్కొంది. అనుభవం, అర్హతలు లేని వారిని ఉద్యోగులుగా నియమించడంలో వాసుదేవ రెడ్డి కీలకంగా వ్యవహరించారని విజిలెన్స్ ఆరోపించింది. లేని సంస్థలకు చెల్లింపులు జరపడం ద్వారా రూ. 37.20కోట్లను ఖర్చు చేసి ప్రభుత్వానికి నష్టం కలిగించారని పేర్కొంది. డేటా మోటిఫ్, జిపిఆర్ పబ్లికేషన్స్, డెక్కన్ మీడియా, సాయి నందిని క్రియేషన్స్, త్రీ ఆటమ్ లీవ్స్, అవిసా మీడియా, సాయి అడ్వర్టైజింగ్, షాలోక్ ఎంటర్‌టైన్‌మెంట?, ఆర్ఆర్ మీడియా సంస్థలకు లబ్ది చేకూర్చినట్టు పేర్కొన్నారు.ఏపీడీసీలో అక్రమాలను చూసి చూడనట్టు వదిలేసినందుకు, అర్హత లేని వారిని ఉద్యోగాల్లో నియమించినందుకు.. సెలక్షన్ కమిటీలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులపై లీగల్ యాక్షన్‌తో పాటు క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేశారు.వీరిలో ఐ అండ్ పీఆర్ కమిషనర్ విజయ్‌కుమార్ రెడ్డి, ఏపీఎస్ఎఫ్ఎల్ సభ్యుడు ఐఆర్ఏఎస్ అధికారి మధుసూదన్ రెడ్డి, కె.హేమచంద్రారెడ్డి, పి.ప్రతాప్, ఐ అండ్ పీఆర్ సీఈ ఓ.మధుసూదన, చీఫ్ డిజిటల్ డైరెక్టర్ బ్రహ్మానంద పాత్ర, ఏపీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ ఉద్యోగి మోతీలాల్ నాయక్, బి.నాగేశ్వరరావు. రాధాకృష్ణ, రామసుబ్బయ్య, జి.వి రామకృష్ణా రావు, ఏవీసుబ్బారెడ్డి, భూమిరెడ్డి శ్రీ వర్ధన్ రెడ్డి, పాలేశ్వరరావు, గంగవరపు సుధీర్ కుమార్, దీపిక పొన్నకంటి, శశికృష్ణ పొన్నకంటి, తాడుక అరవింద్, చెన్ను మౌనిక, నాగ భూషన్ రెడ్డి, త్రీ అటామ్ లీవ్స్ సంస్థలపై న్యాయపరమైన చర్యలకు సిఫార్సు చేశారు.

**76 పేజీల నివేదిక?**

డిజిటల్ కార్పోరేషన్ పేరుతో రూ.171.9 కోట్లను ఖర్చు చేయగా వాటిలో రూ.139.28కోట్లను విడుదల చేశారు. ఏపీడీసీలో జరిగిన అక్రమాలపై 76 పేజీల నివేదికను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ ప్రభుత్వానికి అందచేసింది. యాత్ర 2 సినిమాలో నటించిన మళయాళ నటుడు మమ్ముట్టికి కూడా రూ.50లక్షల రుపాయలు ఏపీడీసీ నుంచి చెల్లింపులు జరిపినట్టు విజిలెన్స్ నివేదికలో పేర్కొన్నారు. వీడియో కంటెంట్ తయారీ పేరుతో భారీగా నిధులను మళ్ళించారు. తాత్కలిక ఉద్యోగులుగా చేరిన వారిలో కొందరికి అనూహ్య ప్రయోజనాలు చేకూర్చినట్టు నివేదిక పేర్కొంది. న్యాయమూర్తులను దూషించిన కేసులో సీబీఐ అరెస్ట్ చేసిన నిందితులకు కూడా ఏపీడీసీలో ఉద్యోగులుగా కొనసాగినట్టు విజిలెన్స్ గుర్తించింది.

# కాకాణికి బిగిస్తున్న ఉచ్చు

**నెల్లూరు :** మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వరుసగా కేసుల్లో ఇరుక్కుంటున్నారు.. నెల్లూరు జిల్లా వైసీపీలో అంతో ఇంతో యాక్టివ్‌గా ఉన్న కాకాణి చుట్టూ ఉచ్చు బిగుస్తుండటం పార్టీ శ్రేణుల్లో కలకలం రేపుతోంది.. తాజాగా క్వార్ట్జ్ ఖనిజం కొల్లగొట్టిన కేసులో మాజీ మంత్రిపై కేసు నమోదు చేశారు. మరోవైపు ఒంగోలు పార్లమెంట్ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి సంతకాలను ఫోర్జరీ చేసిన కేసులో ప్రభుత్వం సిట్‌ను నియమించింది. ఎంపీ సంతకాల ఫోర్జరీ కేసులో సైతం కాకాణిని నిందితుడిగా చేర్చే సూచనలు కనిపిస్తున్నాయి. సర్వేపల్లి రిజర్వాయర్‌లో గ్రావెల్ కుంభకోణం వెనుక కూడా కాకాణి హస్తం ఉన్నట్లు అప్పట్లో పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. ఈ పరిణామాలతో కాకాణికి కష్టకాలం తప్పదంటున్నారు.మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అరెస్టుకు రంగం సిద్ధమైనట్లు జరుగుతున్న ప్రచారం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపుతోంది . ఇప్పటివరకు జిల్లాలో ఇద్దరూ మాజీ మంత్రులు కాకాణి, సోమిరెడ్డిల మధ్య కొనసాగుతున్న మాటల యుద్ధం పోలీసుల రికార్డులకు ఎక్కింది. ఓ మైన్ ని కొల్లగొట్టి అక్రమంగా 250 కోట్ల రూపాయలకు పైగా దోచేసినట్లు మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆరోపణలు మేరకు మైనింగ్, పోలీసు అధికారులు రంగంలోకి దిగారు. ఇప్పటికే ఈ అభియోగంపై కేసులు కూడా నమోదు చేశారు. మాజీమంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ఈ కేసులో నాలుగో నిందితుడిగా చేర్చారు. ఈ నేపథ్యంలో కాకాణి గోవర్ధన్ రెడ్డి అరెస్టు త్వరలోనే ఉంటుందని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.వైసీపీ ప్రభుత్వ హయాంలో సైదాపురం మండలం పరిధిలో ఉన్న మైన్లలో భారీగా తవ్వకాలు జరిగాయి. ఆ క్రమంలోనే పొదలకూరు మండలంలోని రుస్తుం మైన్స్‌లో అక్రమంగా క్వార్ట్జ్ ఖనిజం కొల్లగొట్టినట్లు కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు. అక్కడ కోట్ల రూపాయల విలువైన ఖనిజ సంపద రాష్ట్ర సరిహద్దులు దాటింది. ఇతర దేశాల్లో ఆ ఖనిజానికి డిమాండ్ బాగా ఉండటంతో ధర కూడా బాగానే పలికిందంట. దాంతో మైనింగ్ నిర్వహించిన వారు కోట్లకు పడగలెత్తారు.అదంతా అక్రమమని గతంలోనే మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి రాష్ట్ర మైనింగ్ శాఖతో పాటు కేంద్ర మైనింగ్ శాఖలకు కూడా ఫిర్యాదు చేశారు. 250 కోట్ల విలువైన ఖనిజ సంపాదన దోచుకున్నారని ఆ ఫిర్యాదులో ఆరోపించారు. అప్పట్లో ప్రభుత్వం వైసీపీది ఉండడంతో కాకాని గోవర్ధన్ రెడ్డి పై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. వైసిపి ప్రభుత్వంలో ఇదే రుస్తుం మైన్స్ వద్ద సోమిరెడ్డి చంద్రమోహన్రెడ్డి క్వార్ట్జ్ ఖనిజం అక్రమంగా తరలిపోతుందని మూడురోజులపాటు సత్యాగ్రహ దీక్ష కూడా చేశారు. మైనింగ్ లోడ్లతో రవాణాకు సిద్ధంగా ఉన్న 40 లారీలను టీడీపీ కార్యకర్తలు అడ్డుకున్నారు. అప్పట్లో అది పెద్ద కలకలమే రేపింది.వైసీపీ ప్రభుత్వంలో న్యాయం జరగదని భావించిన సోమిరెడ్డి కేంద్ర మైనింగ్ శాఖకు ఫిర్యాదు చేశారు. కేంద్రం ఆదేశాలకు తోడు రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఈ కేసుకు ప్రాణం వచ్చింది. ఇటీవల ఇదే అంశాన్ని ఆయన అసెంబ్లీలో కూడా ప్రస్తావించారు. తనపై హిజ్రాలతో దాడి చేపించారని చెప్పుకొచ్చారు. ఆ క్రమంలో తాజాగా ఈ మైన్స్ నుంచి కోట్ల రూపాయలు కొల్లగొట్టి దోచుకున్నారంటూ మైన్స్ అధికారులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు.అప్పటి వరకు ఆ క్వారీ వైపు కన్నెత్తి కూడా చూడని మైనింగ్ శాఖ అధికారులు అక్కడికి వెళ్లి దోచుకుపోయిన క్వార్ట్జ్ విలువ రూ.250 కోట్లకు పైగా ఉంటుందని లెక్కలు కట్టారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో మొదట ముగ్గురిపై కేసు కట్టారు. కాకాణి ప్రధాన అనుచరులు ముగ్గురి పేర్లతో తొలుత ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అయితే ఈ ముగ్గురు పోలీసులు తమ వద్దకు రాకముందే హైకోర్టును ఆశ్రయించి ముందస్తు బెయిల్ తెచ్చుకున్నారు. తాజాగా మరో ఏడుగురిని ఈ కేసులో చేర్చారు.ప్రస్తుతం ఈ అంశం నెల్లూరు జిల్లాలో హాట్ టాపిక్ గా మారింది. రాష్ట్రవ్యాప్తంగా వరుసగా వైసీపీ నేతలు అరెస్ట్ అవుతున్న నేపథ్యంలో కాకాణి అరెస్టు ఖాయమన్న ప్రచారం జోరుగా సాగుతోంది. కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించడంతో కాకాణి ముందు వరుసలో ఉంటున్నారు. అందుకే కూటమి ప్రభుత్వం ఆయనపైన దృష్టి పెట్టిందంటున్నారు. మరోవైపు ఈ కేసు పై కాకాని గోవర్ధన్ రెడ్డి స్పందిస్తూ.. కేసుల నమోదు కొత్త విషయం ఏమి కాదని.. కేసులు పెట్టి బెదిరిస్తే భయపడే ప్రసక్తే లేదంటుండటం విశేషం.ఈ అంశంపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని కాకాణి స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుత పరిణామాలను గమనిస్తే మాజీ మంత్రి కాకాణి చుట్టూ ఉచ్చు బిగుస్తున్నట్లు స్పష్టమైన సంకేతాలు కనిపిస్తున్నాయి. మరోవైపు ఒంగోలు పార్లమెంట్ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి సంతకాలను ఫోర్జరీ చేసిన కేసులో ప్రభుత్వం సిట్‌ను నియమించింది. ఎంపీ సంతకాల ఫోర్జరీ కేసులో సైతం కాకాణిని నిందితుడిగా చేర్చే సూచనలు కనిపిస్తున్నాయి.

## బీసీ హాస్టల్ విద్యార్థి దుర్మరణం బాధాకరం

-మొదటిపేజీ తరువాయి

బి.కిశోర్ గుంటూరుకు చెందిన వట్టి చెరుకూరు బీసీ హాస్టల్ లో తొమ్మిదో తరగతి చదువుతున్నాడన్నారు. ప్రమాదవశాత్తు గురువారం ఉదయం చెరువులో పడి కిశోర్ దుర్మరణం పాలవ్వడం బాధాకరమన్నారు. దుర్ఘటన జరిగిన వెంటనే మృతుడి తల్లిదండ్రులకు సమాచారమందించామన్నారు. హాస్టల్ విద్యార్థుల కదలికలపై దృష్టి పెట్టకుండా నిర్లక్ష్యం వహించిన వార్డెన్ శారదా రాణిని సస్పెండ్ చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. చేతికందికొచ్చిన కొడుకు మృతి చెందడం బాధాకరమని, మృతుడి తల్లిదండ్రుల కడుపుకోత వర్ణాతీతమని ఆవేదన వ్యక్తంచేశారు. విద్యార్థి తల్లిదండ్రులకు మంత్రి సవిత తన ప్రగాఢ సానుభూతి వ్యక్తంచేశారు. దుర్ఘటనకు గల కారణాలపై విచారణకు ఆదేశించామన్నారు.

విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడుకోండి...

హాస్టల్ విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడుకోవాలని వార్డెన్లకు, ఇతర సిబ్బందికి మంత్రి సవిత స్పష్టంచేశారు. ప్రభుత్వంపైనా, అధికారులపైనా నమ్మకంతో తమ పిల్లలను హాస్టళ్లలో చేర్చుతున్నారన్నారు. తల్లిదండ్రులు కంటనీరు పెట్టకుండా, గర్వపడేలా విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత హాస్టల్ సిబ్బందిపై ఉందన్నారు. వట్టిచెరుకూరు వంటి ఘటనలు చోటుచేసుకోడం క్షమించరాని నేరమన్నారు. మరోసారి ఇటువంటి ఘటనలు పునరావృతం కానివ్వొద్దని స్పష్టంచేశారు. హాస్టల్ నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆ ప్రకటనలో మంత్రి సవిత స్పష్టంచేశారు.

## 2027 డిసెంబర్ నాటికి పోలవరం పూర్తి



-మొదటిపేజీ తరువాయి

వచ్చాక వైసీపీ ప్రభుత్వం పైసా కూడా విదల్చలేదని చంద్రబాబు ఎద్దేవా చేశారు. పోలవరం ప్రాజెక్టు సందర్శనలో భాగంగా నిర్వాసితులతో బాబు ముఖాముఖి నిర్వహించారు. వారి సమస్యలను సీఎం అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు పై విధంగా వ్యాఖ్యలు చేశారు. అంతకుముందు ఏరియల్ వ్యూ ద్వారా ప్రాజెక్టు ప్రాంతాన్ని చంద్రబాబు పరిశీలించారు. జూన్ 2 దాటితే రెండు రాష్ట్రాలు బిల్లును ఆమోదిం చాలి. ఆ ఏడు మండలాలను ఏపీకి ఇవ్వడం ప్రాజెక్టుకు దోహదమైంది. ప్రాజెక్టును పూర్తి చేయగలమనే ధీమాతో ముందుకెళ్లాం. పోలవరం ప్రాజెక్టును 73 శాతం పూర్తి చేశాం. పోలవరంపై 82 సార్లు వర్చువల్‌గా సమీక్షించాను. ప్రాజెక్టు ఆలస్యమవుతుందని పట్టిసీమ నిర్మాణం చేపట్టాం. ఎడమ ప్రధాన కాలువ పనులు కూడా వేగవంతం చేశాం. వైకాపా హయాంలో జరిగిన తప్పు.. చరిత్ర క్షమించరాని నేరం. జాతీయ ప్రాజెక్టు, ప్రజల ఆస్తిని నాశనం చేసే హక్కు ఎవరికీ లేదు. గతంలో డయాఫ్రమ్ వాల్ దెబ్బతిన్న సంగతి కూడా ఎవరికీ తెలియదు. కాఫర్‌డ్యామ్ సకాలంలో పని చేసి ఉంటే ఇంత నష్టం జరిగేది కాదు. ఊహించని నష్టం జరిగింది. ఐదేళ్లు ఏమీ చేయలేని పరిస్థితి. పీపీఏ అథారిటీ, కేంద్ర ప్రభుత్వం ముందే చెప్పినా అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదు. ఒకసారి

ఓట్లేసినందుకు రాష్ట్రానికి జీవనాడి లాంటి ప్రాజెక్టు దెబ్బతినే పరిస్థితి తీసుకొచ్చారు. పోలవరం విషయంలో నిపుణుల కమిటీ పరిశీలించింది. దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్ మళ్లీ నిర్మించాలని నిర్ణయించాం. రాజకీయ కక్షలతో రివర్స్ టెండర్ల పేరుతో ప్రాజెక్టుపై కక్ష తీర్చుకున్నారు. డయాఫ్రమ్‌వాల్‌జి నిర్మాణానికి రూ.990 కోట్లు ఖర్చవుతోంది. 2020లో పూర్తి కావాల్సిన ప్రాజెక్టు 2027 డిసెంబర్‌కు పూర్తయ్యే పరిస్థితి ఏర్పడింది" అని చంద్రబాబు అన్నారు. ఈ ఉదయం పోలవరం ప్రాజెక్టు వద్దకు చేరుకున్న ముఖ్యమంత్రికి మంత్రులు, జిల్లా నేతలు, అధికారులు ఘన స్వాగతం పలికారు.

## ముస్లిం మైనార్టీలకు అండగా ఉంటా

-మొదటిపేజీ తరువాయి



కాపాడుతూ.. ముస్లిం మైనార్టీలను అన్ని విధాలాపైకి తీసుకొస్తామని తెలిపారు. ముస్లిం మైనార్టీలతో తెలుగుదేశం పార్టీకి మొదటి నుంచీ అనుబంధం ఉందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకొన్నారు. సమైఖ్య ఆంధ్రలోనైనా..

నవ్యాంధ్రలోనైనా ముస్లింలకు న్యాయం చేసింది తెలుగుదేశం పార్టీ మాత్రమేనని గుర్తు చేశారు. ఉర్దూని రెండో భాషగా గుర్తించటంతో పాటు వక్ఫ్ బోర్డు ఆస్తుల్ని కాపాడుతూ వచ్చామని సీఎం చంద్రబాబు నాయుడు వివరించారు. అలాగే హైదరాబాద్, కర్నూల్‌లో ఉర్దూ విశ్వవిద్యాలయాలు తీసుకొచ్చామన్నారు. ఇక హైదరాబాద్, కర్నూల్, విజయవాడల్లో హజ్ హౌస్ నిర్మాణాలు చేపట్టామని తెలిపారు. రంజాన్ పండగ సందర్భంగా తోఫా ఇవ్వటంతో పాటు ఇమామ్‌లు, మౌజమ్‌లను ఆదుకుంది తెలుగుదేశం పార్టీనేనని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో గతంలో కంటే ఈ సారి రూ. 1,300 కోట్లు అదనంగా మైనార్టీలకు కేటాయించామన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ప్రతీ పేదవాడినిపైకి తీసుకొచ్చే కార్యక్రమమే పీ4 అని ఆయన అభివర్ణించారు.

రంజాన్ మాసంలో ఈ రోజు మీ అందరికి కలవడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఈ సందర్భంగా అందరికి సీఎం చంద్రబాబు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. గత 40 ఏళ్లుగా తాను సైతం రంజాన్ మాసంలో భాగస్వామ్యం అవుతున్నానన్నారు. క్రమ శిక్షణ, దాతృత్వంతోపాటు ధార్మికచింతన కూడికే రంజాన్ మాసమని ఆయన పేర్కొన్నారు.

ఉదయం నుంచి ఖురాన్ చదవడం.. ఇతరులకు సహాయం చేయడం వంటి మంచి పనులు చేస్తున్నారంటూ ముస్లిం సోదరులపై ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రశంసల జల్లు కురిపించారు. పాజిటీవ్ ఆలోచనలతో.. అందరూ బాగుండాలని పని చేస్తున్నారని తెలిపారు. ఖురాన్ నేర్పించిన మంచి గుణం.. డబ్బులున్నవాళ్లు పేదలకు సాయం చేయడమన్నారు. ఈ ఇఫ్తార్ విందులో మైనార్టీ శాఖ మంత్రి ఎన్.ఎండీ ఫరూక్ పాల్గొన్నారు. అంతకుముందు ముస్లిం సోదరులతో కలిసి సీఎం చంద్రబాబు నమాజ్ చేశారు.

## పిఠాపురం అభివృద్ధిలో మరో ముందడుగు

-మొదటిపేజీ తరువాయి

పురోగతిని పరిశీలించాలని అన్నారు. మౌలిక వసతుల కల్పన విషయంలో చురుగ్గా వ్యవహరించాలని ఆదేశించారు. నియోజకవర్గం అభివృద్ధికి వివిధ పథకాల ద్వారా నిధులు సమకూరుస్తున్నామని స్పష్టం చేశారు. వాటిని సద్వినియోగం చేసి ప్రజలకు మేలు చేసే బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందని అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. శాంతిభద్రతల అంశంపై సంబంధిత విభాగం ఉన్నతాధికారులు, రాష్ట్ర డీజీపీ దృష్టికి తీసుకువెళ్తామని పవన్ కల్యాణ్ తెలిపారు.

## సంపాదకీయం

# ఇంతకూ ఆ కరెన్సీ ఎక్కడ?

దేశంలో అవినీతి సర్వాంతర్యామి అని, ఏ వ్యవస్థా అందుకు అతీతం కాదని గ్రహించినవారిని సైతం దిగ్భ్రాంతిపరిచేలా ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో జరిగిన అగ్ని ప్రమాదం ఉదంతం రకరకాల మలుపులు తిరుగుతోంది. ఆ ఘటనలో భారీ మొత్తంలో కాలిన కరెన్సీ నోట్ల కట్టలున్న సంచులు బయటపడ్డాయని గుప్పుమంది. సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో సైతం అందుకు సంబంధించిన వీడియో ఉంది. కానీ నోట్ల కట్టల సంగతి అబద్ధమని, కుట్రపూరితమని అంటున్నారు న్యాయమూర్తి. పైగా తానుంటున్న నివాసానికి విడిగా, అందరూ వచ్చిపోగలిగేలా ఉండే ఆ స్టోర్ రూమ్‌కు తాళం కూడా ఉండదని, అలాంటిచోట అంత డబ్బు ఎవరైనా దాస్తారా అన్నది ఆయన ప్రశ్న. కానీ, సామాన్యుల్లో తలెత్తుతున్న ప్రశ్నలు ఇంకా చాలా ఉన్నాయి. ఆయ నొక్కరే కాదు... బాధ్యతాయుత స్థానాల్లోవున్న చాలామంది సంజాయిషీ ఇవ్వకతప్పని ప్రశ్నలవి. ఈ నెల 14 అర్ధరాత్రి అగ్నిప్రమాదం జరిగితే 21వ తేదీన మీడియా బయటపెట్టేవరకూ అధికారికంగా ఎందుకు వెల్లడించలేదు? న్యాయవ్యవస్థ, పోలీస్, అగ్నిమాపక విభాగాలు మౌనంగా ఎందుకు ఉండిపోయాయి? న్యాయమూర్తిపై అంతర్గత విచారణ నిర్వహిస్తున్నామని ఈ ఉదంతం వెల్లడైన వెంటనే సుప్రీంకోర్టు తెలిపింది. కానీ ఆయన విధులకు దూరంగా వుంటారని ఆ మర్నాడు ప్రకటించింది. బదిలీ చేశామని తాజాగా చెబుతోంది. మంచిదే. కానీ ఘటన తర్వాత వారంపాటు ఆయన విధులు ఎలా నిర్వర్తించగలిగారు? స్టోర్‌రూమ్‌కు తాళం లేదని జస్టిస్ వర్మ చెబుతున్నారు. ఘటన సంగతి తెలిశాక తానిచ్చిన ఆదేశాలతో అక్కడికెళ్లిన హైకోర్టు రిజిస్ట్రార్ సైతం ఆ మాటే అన్నారని ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీకే ఉపాధ్యాయ అంటున్నారు. మరి తాళంవున్న గదిలోనే మంటలు రేగాయని పోలీసులు ఎలా చెబుతున్నారు? అసలు అగ్నిమాపక విభాగం తనకున్న నిబంధనల మేరకు నిర్వహించాల్సిన పంచనామా పూర్తిచేసిందా? అక్కడ గుర్తించదగిన లేదా సగం కాలిన సరుకు గురించిన వివరాలు నమోదు చేసిందా? ఇద్దరు సాక్షులతో ఆ పంచ నామాపై సంతకం చేయించిందా? మంటలు ఆర్పిన సందర్భంలో తమకు నోట్ల కట్టలున్న సంచు లేమీ కనబడలేదని ఢిల్లీ అగ్నిమాపక విభాగం చీఫ్ అతుల్ గార్గ్ శనివారం చెప్పారు. అలాంటి ప్రకటనేమీ తానీయలేదని ఆ మర్నాడు ఖండించారు. మళ్లీ గొంతు సవరించుకుని కరెన్సీ నోట్లు దొరకలేదని ఇప్పుడంటున్నారు. సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో పెట్టిన వీడియోలో కాలిపోయిన, సగంకాలిన నోట్లు స్పష్టంగా కనబడుతున్నాయి. కానీ ఆశ్చర్యకరంగా ఇప్పుడా నోట్లు మాయమ య్యాయి. పోలీస్ కమిషనర్ సైతం తన ప్రెస్‌నోట్‌లో పనికిరాని స్టేషనరీ సామాను కాలిపోయిందని తెలియజేశారు తప్ప కరెన్సీ నోట్ల సంగతి ప్రస్తావించలేదు. 14వ తేదీ రాత్రి జరిగిన ప్రమాదంలో కాలిబూడిదైన సామానంతా ఆ మర్నాడు ఉదయం అక్కడి నుంచి తొలగించారు. ఈ పనంతా చేసిందెవరన్న ప్రశ్నకు సమాధానం లేదు. న్యాయమూర్తితోపాటు అగ్నిమాపక విభాగం, పోలీసులు కరెన్సీ లేదని చెబుతుండగా, ఆ నివాసానికి సమీపంలోనే పారిశుద్ధ్య సిబ్బందికి ఒకటి రెండు కాలిన నోట్లు కంటబడ్డాయి. అంటే... ఇందులో నిగూఢంగా ఏదో జరుగుతున్నట్టే కదా! ఈ ఉదంతంలో పారదర్శకంగా వ్యవహరించటానికి సర్వోన్నత న్యాయస్థానం ప్రయత్నించటం అసాధారణమైంది, అభినందించదగ్గది కూడా. మంటల్లో బుగ్గి అయిన కరెన్సీ నోట్ల వీడియోనూ, ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఇచ్చిన ప్రాథమిక నివేదికనూ తన వెబ్ సైట్‌లో ఉంచింది. గతంలో న్యాయమూర్తులపై అవినీతి ఆరోపణలు వచ్చిన సందర్భాలున్నా ఎన్నడూ ఇలా జరగ లేదు. అంతేగాక పంజాబ్, హరియాణా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శీల్ నాగూ, హిమా చల్ హైకోర్టు చీఫ్ జస్టిస్ సంధావాలియా, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనూ శివరామ న్‌లతో ఈ వ్యవహారంపై విచారణకు సుప్రీంకోర్టు ఒక కమిటీని కూడా ఏర్పాటుచేసింది. అయితే అంతమాత్రాన అంతా సక్రమంగా సాగుతోందని భావించనక్కరలేదు. కాలిబుగ్గయిన కరెన్సీ నోట్ల సంచులు మాయమవటం, ఎవరూ నోట్ల సంగతి ధ్రువీకరించకపోవటం సందేహాలకు తావిస్తోంది. రాజ్యానికి సంబంధించిన మూడు ప్రధాన అంగాల్లో ఒక్క న్యాయవ్యవస్థకు మాత్రమే ఆ మూడింటి పరిధులనూ నిర్ణయించగల గొప్ప అధికారాన్ని రాజ్యాంగం ఇచ్చింది. కానీ ఆ బరువు బాధ్యతలకు తగ్గట్టుగా న్యాయవ్యవస్థ జవాబుదారీతనంతో ఉంటున్నదా? గత అనుభవాలు గమనిస్తే లేదన్న సమాధానమే వస్తుంది. కొలీజియం వ్యవస్థను మార్చాలని నిశ్చయించుకుని ఎన్డీయే సర్కారు బిల్లు తెచ్చినప్పుడు పార్లమెంటులో అనేకులు న్యాయవ్యవస్థ తీరుతెన్నులపై తీవ్ర విమర్శలు చేశారు. ఒకరిద్దరు న్యాయమూర్తులపై అభిశంసన వరకూ వెళ్లింది. కానీ విధాన సంబంధమైన సంక్లిష్టత వల్ల అవి వీగిపోయాయి. కొందరు రాజీనామా చేశారు. మరికొందరిపై చేసిన దర్యాప్తు అతీగతీ లేదు. న్యాయాన్యాయాలను విశ్లేషించి తీర్పులివ్వాల్సిన స్థానంలో ఉన్నందువల్ల న్యాయమూర్తులకు పటిష్ఠమైన రక్షణ కవచం ఉండాల్సిందే. దురుద్దేశంతో, కుయుక్తులతో వారిపై నీలాపనిందలు వేసే ధోరణులను అడ్డుకోవాల్సిందే. కానీ అది అవినీతి మకిలి అంటినవారికి ఆలంబన కారాదు. ఈ రెండింటి మధ్యా సమతౌల్యం సాధించటానికి ఇంతవరకూ ఎలాంటి ప్రయత్నమూ జరగకపోవటమే సమస్యకు మూలం. ఇప్పుడున్న కొలీజియం బదులు మరొకటి వస్తే అంతా మారిపోతుందనుకోవటానికి లేదు. స్వయంప్రక్షాళనకు నడుంబిగించి జవాబుదారీతనం పెంపొందించే పకడ్బందీ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయనంతవరకూ ఈ పరిస్థితి మారదు.

# తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి

తెలంగాణా ప్రాంతంలో నైజాం నిరంకుశ పాలనలో, తెలుగు వారి అణచివేతను వ్యతిరేకిస్తూ సురవరం ప్రతాపరెడ్డి ప్రజల్ని చైతన్యవంతుల్ని చేసేందుకు, తెలుగు భాషా సంస్కృతుల వికాసానికి, నలేని కృషి చేశారు. నాడు నిజాం పలనలో ఉర్దూ రాజభాషగా చెలామణి అవుతుండేది. తెలుగు పాఠశాలలు, పాఠకులు చాలా తక్కువగా ఉండేవారు. తెలుగు వారు కూడా తెలుగు మాట్లాడితే అవహేళనకు గురయ్యేవారు. తెలంగీ-బేడంగీ: నిజాం రాజ్యంలో మహబూబ్ అలీఖాను వరకు ఫారసీ రాజకీయ భాషగా ఉండేది. ఆరవ నిజాం ఉర్దూను రాజకీయ భాష చేశారు. మొగలులు ఏర్పరచిన భారతీయ భాష ఉర్దూ. మొగల్ సైన్యంలో అనేక ప్రాంతాల వారు ఉండేవారు. వారికి సంధాన భాషగా ఏర్పడింది. ఉర్దూభాష "ఉర్దూ"కు అర్థం "సైన్యం" ఉర్దూ సైన్యంకోసం ఏర్పడిన భాష. అయినా దాని సౌలభ్యంతో అది ప్రజల భాష అయింది. ఉర్దూ సుమారు ఉత్తర భారతంలో మాట్లాడే భాష. కొంత ఫారసీ కలిసి ఉంటుంది. ఉర్దూకు లిపి లేదు. ఫారసీ లిపిని స్వీకరించారు. అది ఎడమ నుండి కుడికి సాగుతుంది. చివరి నిజాం మీర్ ఉస్మానలీ ఖాన్ ఉర్దూ భాషను మతానికి అంటకట్టి, ఆ మతపు ఆయుధంలో ఒక జాతి సంస్కృతిని సాంతం అవమానించడానికి, కాలరాయడానికి, సమాప్త చేయడానికి ప్రయత్నించాడు. ఒక జాతి వేష భాషలను అణగదొక్క డానికి కంకణం కట్టుకున్న కర్కోటకుడు, చరిత్రలో ఉసామన్ తప్ప మరొకడు కనిపించడు. నాడు ప్రజల ఉద్యమం నిజాం నవాబు నియంతృత్వానికి, నిరంకుశత్వానికి, రాక్షసత్వానికి వ్యతిరేకంగానే కానీ, ఏ మతానికి, ఏ భాషకు వ్యతిరేకంగా కాదు. మర్ ఉస్మానలీఖాను 1911లో గద్దె ఎక్కాడు. అప్పటి నుంచీ ఒక పథకం ప్రకారం తెలుగును తుడిచి పెట్టడానికి ఉర్దూ బావుటాను కరవాలంగా ఉపయోగించాడు. అంతకు ముందు ఉండిన ప్రభుత్వాలు సైతం తెలుగును గుర్తించలేదు. ప్రోత్సహించలేదు. కాని ఒక పథకం ప్రకారం తుడిచి పెట్టడానికి ప్రయత్నించలేదు. ఉస్మాన్ రాజకీయ చతురుడు. అతడు తన భద్రత కోసం ఒక భాషను, ఒక మతాన్ని పోషించాడు. 1918లో ఉస్మాన్, ఉస్మానియా యూనివర్సిటిని ప్రారంభించాడు. ఉస్మానియాలో ఉర్దూ బోధనా భాషను చేశాడు. ఇది ఉర్దూ ఉద్ధరణ కోసం కాక తెలుగును ఇతర దేశీయ భాషలను రూపు మాపటానికి పన్నిన కుట్ర. ఈ కుట్రను బయలుపరిచి, జాతీయోద్యమ నాయకులకు వాస్తవ విషయం తెలియపరచ గల ప్రజా ఉద్యమం నిజాం రాజ్యంలో లేదు. అందు వలన రవీంద్ర కవీంద్రుడు ఉస్మాన్ విశ్వ విద్యాలయ స్థాపనలో ప్రశంసిస్తూ నిజాంకు లేఖ వ్రాశారు. మహాత్ముని వంటివారు ప్రశంసించుకున్న స్వంత కారణాల వల్ల నిరసించలేకపోయారు. నిజాం తన ప్రజలను నమ్మలేదు. అన్ని విషయాలను ఉర్దూలోనికి అనువదించడానికి లక్నో నుంచి విద్వాంసులను కవులను వందల కుటుంబాలను రప్పించాడు. హైదరాబాదులో లక్నో ముస్లిముల వీధులు వెలిశాయి. అతి కొద్ది కాలంలోనే మెడిసిన్, ఇంజనీరింగ్ సహితంగా సబ్జెక్టులు అన్నీ ఉర్దూలో అనువాదం కావడం పాఠ్య పుస్తకాలు సిద్ధం కావడం వల్ల బోధన ప్రారంభం చేయగలిగారు. ఉస్మానియాలో నామ మాత్రంగా తెలుగు శాఖను ఏర్పాటు చేశారు. దానికి తొలి ఆచార్యులు, ఏ దేశమేగినా ఎందుకాలిడినా, గేయ రచయిత, ప్రఖ్యాత భావకవి రాయప్రోలు సుబ్బారావు నిజాం కొలువులో రాయప్రోలు వారు షేర్వాణీ ధరించి కొలువుకు వెళ్ళేవారు. తెలుగును ధ్వంసం చేయ పూనుకున్న నిజాం కొలువులో దేశభక్తి గేయ కవి రాయప్రోలు! ఇది వింతయే కాని ఇది వాస్తవం. రాయప్రోలు నిజాంను ప్రశంసిస్తూ రచించిన జాడలు లేవు. బ్రిటీషాంధ్రం నుంచి నిజాం కొలువులో చేరిన కురుగంటి సీతారామయ్య "ఆదర్శ ప్రభువు" అనే గ్రంథం రచించి, ప్రభువు వారి మన్ననలు పొందారు. ఈ పుస్తకాన్ని



రాయప్రోలు పీఠిక వ్రాశారు. ఇటువంటి గ్రంథాల ప్రచురణకు ఆంధ్ర సాహిత్య పరిషత్తును స్థాపించారు. ఈ పుస్తకం తెనాలిలో అచ్చయింది. ఆ రోజుల్లో తెలుగు వారి తరపున నిజాంను పొగడడానికి రప్పించిన ముగ్గురికి రా.కా.సి. అని పేరు పెట్టారు. స్థానిక తెలుగు, రాయప్రోలు, కాసింఖాను సీతారామ భట్టాచార్య, శ్రీరంగం శ్రీనివాసరావు గారు కూడా కొంతకాలం నిజాం కొలువు చేశారని చెప్పుకుంటారు. ఉస్మానియాలో తెలుగు శాఖ ఉన్న మాట నిజాం ఆనాటి నిజాం ప్రశంసలకే కాని తెలుగును ప్రోత్సహించడానికి కాదని ప్రజలకు తెలుసు. అదీగాక తెలుగు శాఖలో చేరే వారిపై ప్రభుత్వ దృష్టి ఉండేది.

"తెలంగీ-బేఢంగీ", "తెలుగు వికారభాష" అనే నినాదం ప్రభుత్వ ప్రోత్సాహంతో ప్రచారంలోకి వచ్చింది. అందువల్ల విద్యార్థులు తెలుగులో చేరడానికి జంకేవారు. అదీగాక బి.ఏ. వరకు ఉర్దూలో మాత్రం చదివిన వారికి తెలుగు ఎలా వంటపడుతుంది? తెలుగు ప్రభుత్వం గుర్తించని భాష. అందులోని డిగ్రీ పొంది ప్రయోజనం శూన్యం. ఇన్ని అవరోధాలను అధిరోహించి వరంగల్ ఇండ్ల మడికొండకు చెందిన పల్లా దుర్గయ్య సాత్వికులు, విద్వత్ కవి. మను చరిత్రను పరిశోధించి డాక్టరేట్‌ను పొందారు. "గంగిరెద్దు" వంటి ఖండకావ్యాలు రచించారు. ఉస్మానియా నుంచి తెలుగు ప్రొఫెసర్‌గా పదవీ విరమణ చేసి దివంగతులైనారు. నిజాంలో రాజభాష ఉర్దూ. ఇక్కడి శాసనాలు ఉర్దూ. ఆఫీసుల్లో వ్యవహార భాష ఉర్దూ. కోర్టు భాష ఉర్దూ. జరీదా అనగా గెజిటెడ్ భాష ఉర్దూ. నాణేల మీద భాష ఉర్దూ. దుకాణాలు, వగైరా బోర్డులన్నీ ఉర్దూ. నిజాం శాంతం ఉర్దూమయం. ఎవరైనా తెలుగు మాట్లాడినట్లు వినిపిస్తే "తెలంగీ-బేఢంగీ" అని వెక్కిరింపు. నాటి స్థితికి దవళ శ్రీనివాసరావు గారి ఆవేదన జీవన యానం 61వ పేజీలో డాక్టర్ దాశరథి రంగాచార్య నిజాం పాఠశాల విద్యలో ఉర్దూను బోధనా భాష చేశాడు. ఉర్దూ మాతృభాష అయిన ఒక మతస్తులను ప్రోత్సహిస్తున్నట్లు నటించాడు. ఉన్నత విద్యలో ఉర్దూ ప్రధాన భాష చేశాడు. తెలుగు మూడో తరగతిలో మొదలవుతుంది. 7వ తరగతి వరకు సాగుతుంది. 8వ తరగతి నుంచి తెలుగు ఆప్షనల్ (ఐశ్చికృం) చాలా ఎక్కువ మంది తెలుగు తీసుకునే వారు. ఎందుకంటే మెట్రిక్ తరువాత తెలుగు ఉండదు. నిజాం రాజ్యంలో చదువు వచ్చిన వారి సంఖ్య వెయ్యికి 82మంది. అందులో ముసల్మానుల్లో 59, హిందువుల్లో 23. నిజాంలోని విద్యా విధానమే విద్యకు వ్యతిరేకం. పాఠశాలలు, కళాశాలలు అన్నీ సర్కారువే. అవి ఏర్పరచడానికి ప్రమాణాలు ప్రతీ సూబీకు ఒక ఇంటర్మీడియెట్ కాలేజీ, రాజ్యంలో నాలుగు అంటే రాజ్యం మొత్తంలో నాలుగే ఇంటర్ కాలేజీలు. ప్రతి జిల్లాకు ఒక పౌఖాన్వా అంటే హైస్కూల్, ప్రతి తాలూకాకు వస్తాన్వా, తహతన్వా అంటే మిడిల్ స్కూల్, గ్రామ ప్రాముఖ్యతను బటిట తహతన్వా అంటే వీధి బడులను ఫర్మాను ద్వారా నిషేదించడు. అందువల్ల పంతుల్లు తమ ఇల్లలోనే తెలుగు చదువు చెప్పే వారు. ఇది విద్యా విషయకంగా రాజకీయ పరిస్థితి. ఇలాంటి సందర్భాలలో తెలుగు భాష ప్రచారానికి గాను, తెలంగాణ ప్రాంతాల్లో పాఠశాలల ఏర్పాటుకు ప్రజలను జాగృతం చేయడానికి వీలుగా సురవరం గోల్కొండ పత్రికను స్థాపించారు. గోల్కొండ పత్రిక స్థాపనలో రాజబహదూర్ వెంకటరామారెడ్డి సహాయం సురవరం తీసుకున్నారు. గోల్కొండ పత్రికలో తన సంపాదకీయాలు, ప్రత్యేక వ్యాసాలు రాసి తెలుగు భాషా అభిమానులైన తెలుగు వారందరినీ చైతన్య వంతులను చేయడానికి పూనుకున్నారు. ఆయన నైజాం నిరంకుశ పాలనను విమర్శిస్తూ నిర్భయంగా ఎన్నో వ్యాసాలు రాశారు. ఆనాటి జమీందార్లు, దేశముఖ్‌లు ప్రజలను ఎలా పీడిస్తున్నారు తదితర విషయాలు గోల్కొండ పత్రికలో నిక్కచ్చిగా వ్యాసాలు రాశారు. నైజాం ప్రభుత్వ నిరంకుశ, ప్రజా వ్యతిరేక ఉద్యమాలను ఎదుర్కోవడానికి గోల్కొండ పత్రికను ఒక ఆయుధంలా సురవరం ఉపయోగించారు. అంతేకాదు ప్రతీ గ్రామంలో గ్రంథాలయాల ఏర్పాటు ద్వారా ప్రజలను మరింత చైతన్య వంతులను చేయవచ్చని భావించి, ప్రతి గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటుకై గ్రంథాలయోధ్యమానికి శ్రీకారం చుట్టారు. గ్రంథాలయాలు, పాఠశాలల ఏర్పాటులో నైజం ప్రభుత్వం నుండి ఎన్నో అవరోధాలు, అడ్డంకులు ఎదుర్కోవాల్సి వచ్చిన లెక్క చేయక గ్రంథాలయాల ఏర్పాటును ఒక ఉద్యమంగా ఆయనను కొనసాగించారు. గ్రంథాలయాల ఏర్పాటుతో ప్రజా విప్లవం ఊపందుకోగలదన్న భావంతో నైజాం సర్కార్ కొత్తగా గ్రంథాలయాల ఏర్పాటును నిషేదించింది. అంతే కాదు తెలుగు వారు సభలు, సమావేశాల ఏర్పాటు కూడా ముందుగా అనుమతి లేకుండా చేపట్టరాదని ఉత్తర్వులు జారీ చేసింది. 1942 మే 26న తెలంగాణ ప్రాంతంలో ఆంధ్ర మహాసభల వ్యాప్తికి గ్రంథాలయ మహాసభలు ఆలంపూర్, సూర్యపేట, జనగాం తదితర ప్రాంతాల్లో సురవరం ఘనంగా ఏర్పాటు చేశారు. గ్రంథాలయోధ్యమంపై ఆయన పుస్తక రచన కూడా చేశారు. తెలంగాణ రచయితల సంఘం లక్ష్మణరాయ పరిశోధన మండలి వంటి పలు సంస్థలు స్థాపించడంలో ఆయన పాత్ర ముఖ్యమైనది. బ్రిటీష్ ఆంధ్రులు నిజాం ఆంధ్రులను తమ సోదరులని కాని, తమతో సములని కాని గుర్తించలేదు. బ్రిటీష్ ఆంధ్ర నాయకులెవరు తెలంగాణ ప్రజలను పట్టించుకోలేదు. "తెలంగాణాలో కూడా కవులున్నారా?" అని ప్రశ్నించినాడు ఒక కవి శేఖరుడు. సువరం దానిని చాలెంజ్‌గా తీసుకున్నారు. 354మంది తెలంగాణ కవుల కవితలను కూర్చి గోల్కొండ కవుల సంచిక ప్రచురించారు. నైజాం పాలనలో అనగారి పోయిన తెలుగు వారి ఘనత, గొప్పతనాన్ని చాటిచెప్పిన బహుముఖ ప్రజ్ఞాశాలి, సాహితీవేత్త, గోల్కొండ పత్రిక సంపాదకుడు సురవరం. హైదరాబాద్ రాష్ట్రం ఏర్పాటు అనంతరం, రాష్ట్ర శాసన సభలో సభ్యుడిగా ఐదు సంవత్సరాలు పనిచేశారు. సురవరం ప్రతాపరెడ్డి ఆ మహనీయుని అడుగు జాడలలో నడుచుకుంటూ ఆయన ఆశ యాలను అమలు చేయడానికి పునరంకితం కావడమే ఆయనకు అందించే ఘనమైన నివాళి. (తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి 125వ జయంతి (మార్చి 28) ఉత్సవాల సందర్భంగా)

కొలనుపాక కుమారస్వామి
సెల్:9963720669, వరంగల్.

# ఎగుమతుల నేలచూపులు

ప్రధానిగా దేశ పగ్గాలు చేపట్టిన తర్వాత కొన్నాళ్ల పాటు 'మేకిన్ ఇండియా' అంటూ మో దీ పదేపదే వల్లె వేశారు. దిగుమతులు తగ్గించుకొని స్వదేశీ సరుకుల తయారీని పెంచడం ఈ నినా దం లేదా పథక పరమోద్దేశం. తద్వారా దిగుమతులు తగ్గించి ఎగుమతులను పెంచడం లక్ష్యంగా దీన్ని తెరమీదికి తీసుకువచ్చారు. పారిశ్రామికతకు ప్రతీకల్లాంటి పండ్ల చక్రాలతో కూడి న సింహం బొమ్మ దీనికి చిహ్నంగా వాడుకున్నారు. అంటే, ఇండియా ప్రపంచంలో మృగరాజులా రెచ్చిపోతుందనుకోవాలన్న మాట. కా నీ, ఇప్పుడు ఆ సింహం పెద్దగా ఎక్కడా కనిపించడం లేదు. ఇక ఎగుమతుల్లో భారత్ పైపైకి దూసుకుపోవడం మాట దేవుడెరుగు, నానాటికీ తీసికట్టు అవుతుండటం మనం ఇప్పుడు చూస్తున్నాం. ప్రపంచ ఎగుమతుల్లో స్వాతం త్ర్యం వచ్చేనాటికి మన దేశం వాటా 2.2 శాతమైతే ఇప్పుడది 1.6 శాతానికి పడిపోయింది. ఇది యాభై ఏండ్ల కనిష్ఠం కావడం అనేది మో దీ ప్రభుత్వ పనితీరుకు అద్దం పడుతున్నది. స్థూలంగా చూస్తే ఇదివరకటి మన్మోహన్‌సింగ్ ప్రభుత్వ హయాంలో ఎగుమతుల్లో సాధించిన వృద్ధి ఎంతో నయంగా ఉండటం గమనార్హం. మేకిన్ ఇండియా ఊరించినట్టుగా ఇండియా ప్రపంచంలో తనదైన ప్రత్యేక మార్కెట్‌ను కల్పించుకోవడంలో ఘోరంగా విఫలం కావడమే అందుకు కారణం. పెట్టుబడుల గమ్యం గా తన స్థానాన్ని కూడా భారత్ నిలబెట్టుకోలేకపోయింది. విదేశీ పెట్టుబడులు అడ్డూ అదు పూ అనేది లేకుండా ఎగిరిపోతుం డటంతో డాలర్‌ను తట్టుకోలేక రూపాయి రోజురోజుకూ చిక్కిశల్యమై పోతున్నది. రూపాయికి పూర్వవైభవం తెస్తానని ప్రధాని మోదీ ఘనంగా ప్రకటించారు. కానీ, ఇప్పుడది చరిత్రలో ఎన్నడూ దిగజారనంత లోతులకు పడిపోతున్నది. ఉత్పాదకతతో అనుసంధానించిన ప్రోత్సాహకాల పథకం (పీఎల్ఐ) కేంద్ర ప్రభుత్వ పారిశ్రామికరంగ వైఫల్యాలకు మరో ఉదాహరణగా నిలుస్తుంది. ఉత్పాదకతను జీడీపీలో 25 శాతం పెంచేందుకు 2020-21లో ఆడంబరంగా ప్రారంభిం చిన పథకం సాధించింది శూన్యం. జీడీపీలో ఉత్పాదకత వృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా 15-17 శాతంగా ఉండిపోయింది. ఈ పథకానికి కేటాయించిన నిధుల్లో 8 శాతం మాత్రమే వినియోగించుకోవడం కేంద్రం చేతగానితనం తప్ప మరొకటి కాదు. దీంతో ప్రభుత్వం ఈ పథకాన్ని గుట్టుచప్పుడు కాకుండా అటకెక్కిస్తున్న సూచనలు కనిపిస్తున్నా



యి. అదే చైనా, వియెత్నాంలు జీడీపీలో ఉత్పాదకత వృద్ధి వరుసగా 26 శాతం, 24 శాతం సాధించినట్టు ప్రపంచ బ్యాంకు లెక్కలు తెలియజేస్తున్నాయి. ఇలా వరుస వైఫల్యాల నేపథ్యంలో మోదీ ప్రభుత్వం ఉత్పాదకతను పెంచుకునేందుకు చేస్తున్న అరకొర ప్రయత్నాలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రూపంలో గండం వచ్చిపడింది. పోటా పోటీ టారిఫ్‌లతో ప్రపంచ వాణిజ్య యుద్ధానికి అమెరికా శంఖం పూరించడంతో ఇండియా పరిస్థితి మరింత బలహీనపడింది. ట్రంప్ బెదిరింపులకు తలొగ్గి మోదీ అమెరికా ఉత్పత్తులపై సుంకాలు తగ్గించుకునేందుకు కసరత్తు చేస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఇదే జరిగితే భారత ఎగుమతులపై మరింతగా ప్రభావం పడుతుంది. ఇలా ఉత్పాదన, ఎగుమతుల్లో భారత్ ఘోర వైఫల్యాలను చవిచూస్తుంటే మోదీ సర్కారు మాత్రం 'మేకిన్ ఇండియా' విజయవంతమైనట్టు మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నది. విపక్షాల విమర్శలకు ఎగవేత తరహాలో సమాధానాలిస్తున్నది. వాస్తవ పరిస్థితి మాత్రం మరోలా ఉన్నది. ప్రభుత్వం ఇప్పటికైనా మేలుకొని దిద్దుబాటు చర్యలు చేపట్టకపోతే పారిశ్రామిక ప్రగతి, తద్వారా ఎగుమతుల వృద్ధి తీవ్రంగా దెబ్బతింటాయని చెప్పక తప్పదు.

# గ్రామాల్లో పల్లె నిద్ర చేసి ప్రజలతో మమేకమవుతున్న పోలీసులు






**విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్.**

**విజయనగరం జిల్లా, ప్రజా జ్యోతి న్యూస్, స్టాఫ్ రిపోర్టర్ రాము:** జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్ ఆదేశాలతో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన పోలీసు అధికారులు. గ్రామస్థులతో మమేకమవుతూ వారి సమస్యలను విని, క్షేత్ర స్థాయిలో పరిష్కరిస్తున్న పోలీసు అధికారులు. ప్రజలకు సైబరు నేరాలు, మహిళల భద్రత, శక్తి యాప్, రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తున్న అధికారులు జిల్లాలో వివిధ గ్రామాలను సంబంధిత పోలీసు అధికారులు సందర్శించి, క్షేత్ర స్థాయిలో ప్రజలతో మమేకమవుతూ, వివిధ నేరాల నియంత్రణ పట్ల అవగాహన కల్పిస్తూ, గ్రామాల్లో పల్లె నిద్ర చేసి, వారి సమస్యలను పరిష్కరిస్తూ ప్రజలకు మరింత చేరువ అవుతున్నట్లుగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మార్చి 27న తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ - క్షేత్ర స్థాయిలో ప్రజల సమస్యలను, శాంతిభద్రతల సమస్యలను గుర్తిస్తూ, వాటి పరిష్కారానికి సత్వరం చర్యలు చేపట్టేందుకు సంబంధిత పోలీసు అధికారులు, అడాప్షన్ కానిస్టేబుళ్ళు వారి పరిధిలోని గ్రామాల్లో నెలలో రెండు సార్లు పల్లె నిద్ర చేయాలని ఆదేశించామన్నారు. ఇందులో భాగంగా పార్టీలకు అతీతంగా గ్రామస్థులతో మమేకం కావాలని, గ్రామ సమస్యలు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే సమస్యల గురించి వారితో చర్చించి, గ్రామాల్లో ఎటువంటి వివాదాలు, అల్లర్లు జరగక్కుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. క్షేత్ర స్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించి, ప్రజలకు పోలీసు వ్యవస్థ పట్ల నమ్మకాన్ని పెంచాలన్నారు. గ్రామాల్లోకి వచ్చే కొత్త వ్యక్తులు, హిస్టరీ షీట్లు కలిగిన వ్యక్తుల నడవడికపై నిఘా పెట్టాలని, వారు జీవనం ఏవిధంగా సాగిస్తున్నది తెలుసుకోవాలన్నారు. గ్రామస్థాయిలో ఏ సమస్య ఉన్నా వెంటేనే పోలీసులకు, అడాప్షన్ కానిస్టేబుళ్ళకు తెలిసే విధంగా సమాచార వ్యవస్థను నెలకొల్పాలని అధికారులకు, అడాప్షన్ కానిస్టేబుళ్ళకు జిల్లా ఎస్పీ దిశా నిర్ధేశం చేసారు. గ్రామాల్లోని బాలికల పాఠశాలలు, హాస్టల్స్లో భద్రతను సంబంధిత పోలీసు అధికారులు పర్యవేక్షిస్తున్నారని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.

అదే విధంగా గ్రామస్థులతో మమేకమయ్యే సమయాల్లో వారికి ప్రస్తుతం ఏ తరహా నేరాలు జరుగుతున్నాయో వివరించి, వారిని అప్రమత్తం చేయాలన్నారు. ఏదైనా నేరానికి గురైనపుడు ఏవిధంగా వ్యవహరించాలి, పోలీసుల సహాయం ఏవిధంగా పొందాలన్న విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సైబరు మోసాలు జరుగుతున్న తీరును, నేరం జరిగినపుడు 1930కు ఫిర్యాదు చేయాలని, మహిళల రక్షణ, రహదారి భద్రత పట్ల అవగాహన కల్పించాలన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం, విక్రయం, అక్రమ రవాణకు పాల్పడడం వలన చట్ట ప్రకారం తీసుకొనే చర్యలను, అనర్ధాలను 'సంకల్పం' ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు వివరించి, గంజాయి, మత్తు, మాదకద్రవ్యాల గురించిన సమాచారంను డయల్ 112/100, 1972 అందించాలని కోరుతున్నారు. మహిళల రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన శక్తి మొబైల్ యాప్ గురించి అవగాహన కల్పించి, ఆపద సమయంలో ఎస్.ఓ.ఎస్. బటన్ ప్రెస్ చేయడం వలన పోలీసుల సహాయం సులువుగా ఏవిధంగా పొందవచ్చునో గ్రామస్థులకు పోలీసు అధికారులు, సిబ్బంది వివరిస్తున్నారని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. గత రెండు మాసాల్లో జిల్లాలో 10మంది సిఐలు, 30మంది ఎస్ఐలు 72 గ్రామాల్లో ఇప్పటి వరకు పల్లెనిద్ర చేసి, గ్రామస్థులతో మమేకం కావడం వలన మంచి ఫలితాలు వస్తున్నాయని, ప్రజల్లో పోలీసుశాఖ పట్ల నమ్మకం, విశ్వాసం పెరుగుతున్నదని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.

# ఉపాధ్యాయుల అక్రమ సస్పెన్షన్లు రద్దు చేయాలి





క్రిమినల్ కేసులను ఉపసంహరించుకోవాలి
విద్యార్థుల డిబార్ ను రద్దు చేసి వారికి న్యాయం చేయాలి
డిఈఓ ను సస్పెండ్ చేసి ఆయనపై విచారణ చేపట్టాలి
జిల్లా కలెక్టర్ వద్ద ఉపాధ్యాయుల ఐక్య వేదిక సభ్యుల ధర్నా
శీర్షాసనంతో నిరసన తెలిపిన ప్రధాన ఉపాధ్యాయులు
వావిలపల్లి వెంకట సత్యన్నారాయణ

**శ్రీకాకుళం , ప్రజా జ్యోతి న్యూస్ :** ఇటీవల పదవ తరగతి ఇంగ్లిష్ పరీక్షలో కుప్పిలి మోడల్ స్కూల్ పరీక్షా కేంద్రంలో మాస్ కాపీయింగ్ జరుగుతుందన్న తప్పుడు అభిప్రాయంతో సస్పెండ్ చేసిన 14 మంది ఉపాధ్యాయుల సస్పెన్షన్లను వెంటనే రద్దు చేయాలని జిల్లా ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక సభ్యుల డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం నాడు శ్రీకాకుళం జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు.అక్రమ సస్పెన్షన్లన్ రద్దు చేసి , వారిపై పెట్టిన క్రిమినల్ కేసులను ఉపసంహరించుకోవాలని, విద్యార్థుల డిబార్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పొందూరు మండలం మజ్జిలపేట ప్రాథమిక ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు వావిలపల్లి వెంకట సత్యన్నారాయణ అరగంట సేపు శీర్షాసనం వేసి నిరసన తెలిపారు. అనంతరం ఉపాధ్యాయ సంఘాల కాజ్య వేదిక సభ్యులు మాట్లాడుతూ డి.ఈ. ఓ తిరుమల చైతన్య తీరు ఉపాధ్యాయుల , విద్యార్థుల మనోభావాలను దెబ్బతీసేలా ఉందన్నారు. తప్పుడు అభిప్రాయంతో కుప్పిలి పరీక్షా కేంద్రం పై డి.ఈ.ఓ తన టీమ్ తో దాడి చేసి 391 విద్యార్థులలో 5 మంది విద్యార్థులను పట్టుకున్నారని , దీనిని మాస్ కాపీయింగ్ గా రాష్ట్ర విద్యాశాఖ అధికారులను నమ్మించి 14 మంది ఉపాధ్యాయులను అన్యాయంగా సస్పెన్షన్ కు గురి చేయడం దారుణమని అన్నారు. దీంతో మిగతా విద్యార్థులు , తెలివైన విద్యార్థులు పరీక్షా కేంద్రాల వద్ద ఏ క్షణం ఎం జరుగుతుందో అనే భయంతో ప్రశాంతంగా పరీక్షలు రాయలేకపోతున్నారని తెలిపారు. ఆయన పైశాచికత్వాన్ని సంతృప్తి చేసుకోవడానికి 2 కిలోమీటర్ల దూరంలో గల కుప్పిలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో తన టీమ్ తో దాడి చేయించి , విద్యార్థులకు తోడుగా వచ్చిన ఆంగ్ల ఉపాధ్యాయుడు వద్ద గల రాత ప్రతిని పట్టుకుని తిరుమల చైతన్య దానిని ఒక కర్మాగారంగా భావించడం హేయమైన చర్య అని విమర్శించారు. పాఠశాల విధులకు వచ్చిన ప్రధాన ఉపాధ్యాయురాలు , ఇద్దరు ఉపాధ్యాయులు అక్కడ జరుగుతున్న అక్రమాన్ని నిరోధించడంలో వైఫల్యం చెందారని సస్పెండ్ చేయడం , ట్రిపుల్ ఐటీ సీట్ల కోసం డబ్బులు వసూలు చేయడం అని తప్పుడు ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. మీడియా ముందు ఒక్కో విద్యార్థి వద్ద 30 నుండి 40 వేలు వసూలు చేసినట్లు పోలిసులకు పిర్యాదు చేసి ఇప్పుడు ఆధారాల కోసం బుడగట్ల పాలెం , కొయ్యాం ప్రధాన ఉపాధ్యాయుల ను తన పాఠశాలకు పిలిచి, ఒక్కోపాఠశాల నుండి గుమాస్తా కి రూ. 10 వేలు ఇచ్చినట్లు రాత పూర్వకంగా స్టేట్మెంట్ ఇవ్వమనడం లో ఆయన ఆరోపణలు నిరాధారమైనవని బుజువైందన్నారు. ఎన్నో అవినీతి అక్రమాలకు తిరుమల చైతన్య పాల్పడినట్లు పలు వార్తల్లో కథనాలు వెలువడ్డాయని, ఆయన అక్రమాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయని ఆరోపించారు. 2023 లో ఉపాధ్యాయుల బదిలీలలో అక్రమ ఎన్ టైన్మెంట్స్ పాయింట్స్ పైన ,మెడికల్ ప్రిఫరెన్షియల్ కేటగిరిలో అన్యాయం జరిగినా ఉపాధ్యాయుల అప్పీల్స్ పరిష్కారంలో ,ఆన్లైన్ కౌన్సెలింగ్ జరపకుండా అక్రమంగా 7 గురు ఉపాధ్యాయులు మాన్యువల్ కౌన్సెలింగ్ జరిపి బ్లాక్డ్ ఖాళీలలో వారికి ఉత్తర్వులు జారీ చేయడం వంటి వాటిపై విచారణ చేపట్టాలని కోరారు. వీటితో పాటు 2024 లో భోధన , బోధనేతర నియామకాల్లో ఎస్.సి, ఎస్.టి రోస్టర్ విధానాన్ని ఉల్లగించండం తో పాటు పలు అంశాలపై తిరుమల చైతన్య పాల్పడిన అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులను కోరారు. డి.ఈ. ఓ చైతన్య ను ఎఫ్. ఏ.సి భాద్యతలను తొలగించాలని డిమాండ్ చేశారు. ఆయన పై చర్యలు తీసుకునేంత వరకు ఆందోళనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## అగ్ని ప్రమాదంలో మహిళ మృతి.

**పోడూరు, మార్చి 27,ప్రజాజ్యోతి న్యూస్.** పశ్చిమగోదావరి జిల్లా పోడూరు మండలంలోని గుమ్మలూరు గ్రామ పంచాయితీ పరిధిలో పెదపేట లో నివాసం ఉంటున్న ఒంటరి మహిళా వర్ధనపు సరోజినీ(70) బుధవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో పూర్తిగా కాలిపోయి ప్రమాదంలో మృతి చెందింది.అర్. ఐ కందుల రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం గుమ్మలూరు పెదపేట పరిధిలో ఒంటరిగా నివాసం ఉంటున్న వర్ధనపు సరోజినీ (70) కట్టెల పొయ్యి మీద వంట చేసుకుని పొయ్యి ఆర్పకుండా నిద్రిస్తున్న సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరిగి తాటాకు ఇల్లు అంటుకుంది.ఆమె అనారోగ్య రీత్యా లేవలేని పరిస్థితిలో ఉంది ఒక్కసారి గా మంటల్లో చిక్కిపోయి పూర్తిగాకాలిపోయింది.ఇంట్లో ఒక్క ఆమె ఉండడంతో చుట్టూ పక్కల వారు వచ్చి అంటుకున్న మంటలు అదుపు చేసే ప్రయత్నం చేశారు.ఎంతకూ మంటలు అరకపోవడంతో పాలకొల్లు అగ్ని మాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు.పోడూరు



ఎస్సై సిబ్బందితో వచ్చి కేసు నమోదు చేశారు.అనంతరం సవ పంచనామా చేసి మృతదేహాన్ని బందువులు కి అప్పగించారు.ఘటన స్థలాన్ని తహసీల్దార్ మౌలానా పాజిల్ పరిశీలించారు.ఆయన తో విఆర్వో కే.శ్రీనివాసరావు ఉన్నారు.

## ప్రకృతి వ్యవసాయంతో వాతావరణ పరిరక్షణ...



**గంట్యాడ, ప్రజాజ్యోతి న్యూస్, స్టాఫ్ రిపోర్టర్ రాము:** గంట్యాడ. ప్రకృతి వ్యవసాయంతో వాతావరణ పరిరక్షణ జరుగుతోందని యూనిట్ ఇంచార్జ్ కొప్పాక లక్ష్మి అన్నారు. మండలంలోని సిరిపురం గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై గురువారం గ్రామసభ నిర్వహించారు. ముందుగా గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితులను మెరుగుపరచడానికి, భవిష్యత్తును పరిరక్షించడానికి ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంబించాలన్నా రు. ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారానే వాతావరణంలో వస్తున్న మార్పులను అధిగమించి మంచి వాతావరణాన్ని పొందగలమని అన్నారు. రైతులు నవధాన్యాలు సాగు చేయాలని దీని ద్వారా భూమిలో సేంద్రియ కర్బనం పెరిగి పంటకి అవసరమైన పోషకాలను ఎటువంటి ఎరువులు లేకుండా పొందగలమని ఆమె తెలిపారు. ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్, విఎఎ, వివో ఏ వసాది యూనిట్ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రామయ్యమ్మ, సునీత, లక్ష్మి, గ్రామ పెద్దలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ గారి ఐడియాలజీ గ్రామస్థాయిలో తీసుకెళ్లాలని

భారతీయ భీమ్ సేన వ్యవస్థాపకులు జై భీమ్ రామాంజనేయులు
రాష్ట్ర అధ్యక్షులు పామిడి సాకే ఓబులేసు కలిసి సంఘ నిర్మాణం కోసం



**ప్రజా జ్యోతి రిపోర్టర్ సుబ్బు పామిడి** కడప జిల్లా పొద్దుటూరు నియోజవర్గం నందు స్థానిక రాజు గారిని కలిసి సంగం సిద్ధాంతాలు పూలే అంబేద్కర్ గారి ఐడియాలజీ గ్రామస్థాయిలో తీసుకెళ్లాలని అంబేద్కర్ గారు కలలు కన్న రాజ్యం కోసం ప్రతి ఒక్కరు త్యాగం చేయాలని మరి ముఖ్యంగా యువత రాజకీయాల్లోకి రావాలని మన హక్కుల కోసం మనమే పోరాడాలని. ఎవరి బానిస సంకెళ్లు వారే దించుకోవాలని ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలు నేటికీ బానిసత్వంలో ముగిపోతున్నారని బహుజనలంతా ఏకతాటిగా కలిసి మన హక్కుల్ని సాధించుకొని సమ సమాజాన్ని నిర్మించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పొద్దుటూరు యువ నాయకులు పొద్దుటూరు రాజుగారు. రాచేపల్లి సాంబ. కల్లూరు రామాంజనేయులు. కలమడి మల్లికార్జున. లక్ష్మన్న ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులందరూ త్వరితగతిన ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

వ్యవసాయాధికారి రుచిత



**తూర్పుగోదావరి జిల్లా, తాళ్లపూడి మండలం, మార్చి27, ప్రజా జ్యోతి న్యూస్** తాళ్ళపూడి మండలం లోని సొంత భూములు కలిగిన రైతులంతా తమ భూములు కలిగిన గ్రామాలలోని రైతు సేవా కేంద్రాలలో ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్ నందు తమ ఆధార్, పొలం పాస్ బుక్, ఆధార్ కు లింక్ అయిన ఫోన్ నెంబరు గల ఫోన్ నెంబర్ లాంటి వివరాలు మార్చి 31 వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవలెనని వ్యవసాయ అధికారాణి రుచిత తెలిపారు. మండలంలో మొత్తం 6163 మంది పీఎం కిసాన్ పోర్టల్ నందు ఎన్రోల్ అవ్వగా 27:3: 2025 నాటికి 4625 (75%) మంది ఫార్మర్ రిజిస్ట్రీ నందు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారాన్నారు. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాలలో క్యాంపు మోడ్ లో ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్ నందు రిజిస్ట్రేషన్ చేయటం జరుగుతోంది కాబట్టి ఇప్పటి వరకు రిజిస్ట్రేషన్ చేయించుకోని రైతులంతా త్వరితగతిన రైతు సేవా కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేయించుకోవలసిందిగా రైతులకు విజ్ఞప్తి చేశారు

## డ్రై డే కార్యక్రమంలో భాగంగా వాటర్ ట్యాంకులను శుభ్రపరచిన అధికారులు



**తూర్పుగోదావరి జిల్లా, తాళ్లపూడి మండలం, మార్చి27, ప్రజా జ్యోతి న్యూస్** తాళ్లపూడి మండల కేంద్రంగా డ్రై -డే ప్రోగ్రామ్ ను తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి అదేశాల మేరకు మండల పరిధిలో ఉన్న అన్ని గ్రామాలలోని 26ఓవర్ హెడ్ ట్యాంక్స్ ను 16 చిన్న ట్యాంక్స్ ను శుభ్రపరచిన తరువాత ట్యాంక్ లలో నీటిని నింపి ప్రజలకి విడుదల చేయడం జరిగిందని మండల నీటి పారుదల శాఖ .సూర్జన్ తెలిపారు

# ఒకే దేశం ఒకే ఎన్నికను వెంటనే అమలు చేయాలని పార్లమెంటు ముట్టడి






**గుంతకల్లు మార్చి 27 (ప్రజా జ్యోతి):**
రాజ్యాంగ మద్దతు బృందం నాయకత్వంలో ఒక దేశం ఒక ఎన్నికను వెంటనే అమలు పరచాలని గురువారం ఢిల్లీలోని పార్లమెంట్ ముట్టడించడం జరిగినది. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా భారతీయ జనతా యువ మోర్చ (బీజేవైఎం) అంతపురం జిల్లా అధ్యక్షులు మంజుల వెంకటేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంజుల వెంకటేష్ మాట్లాడుతూ రాజ్యాంగ మద్దతు బృందం నాయకత్వంలో మొత్తం దేశం 'ఒక దేశం, ఒక ఎన్నిక'కు మద్దతుగా నిలచిందని, ఈ ఎన్నికల సంస్కరణ నేటి దేశానికి అవసరం మాత్రమే కాదు, ఈ కాలంలోని అతిపెద్ద డిమాండ్ అని, ఇప్పటివరకు రాజ్యాంగం మద్దతు బృందం మరియు యువత ఈ చొరవకు మద్దతు కోరుతూ 250 మందికి పైగా పార్లమెంటు సభ్యులను కలిశాము మరియు ఈ గొప్ప తీర్మానంలో వివిధ రాష్ట్రాల మంత్రులు మరియు శాసనసభ్యులను కూడా నిమగ్నం చేసాము. ంఈ ప్రయత్నంలో భాగంగా దేశవ్యాప్తంగా యువ స్వచ్ఛంద సేవకులు సంతకం ప్రచారం నిర్వహించారు. దీని లో లక్షలాది మంది పౌరులు ఈ కీలకమైన సంస్కరణకు అనుకూలంగా సంతకం చేశారు. ఈ ప్రచారం ప్రతి పౌరుడికి మరియు సమాజం లోని ప్రతి వర్గానికి వివిధ మార్గాల్లో చేరేలా చూసుకోవ డానికి, మేము వివిధ రాష్ట్రాల లో సంభాషణ సమావేశాలు, చర్చలు మరియు ప్రజా అవగాహన ప్రచారాలను నిర్వహించాము. దీని ద్వారా దేశ ప్రజలు ఎన్నికల ప్రక్రియలో 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' యొక్క అవసరం మరియు ప్రయోజనాలు ప్రభుత్వ కార్యకలాపాలపై తరచుగా జరిగే మోడల్ ప్రవర్తనా నియమావళి ప్రభావం, ప్రస్తుతం, దేశవ్యాప్తంగా వేర్వేరు సమయాల్లో ఎన్నికలు జరుగుతున్నందున, మోడల్ ప్రవర్తనా నియమావళి పదేపదే విధించబడుతుంది, దీని వలన అభివృద్ధి కార్యకలాపాలు నిలిచిపోతాయి. ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం ఈ అడ్డంకిని తొలగిస్తుంది. మరియు సజావుగా విధాన అమలుకు వీలు కల్పిస్తుంది. తరచుగా ఎన్నికలు ప్రభుత్వ ఖజానాపై గణనీయమైన ఆర్థిక భారాన్ని మోపుతాయ ని అందరికీ తెలుసు దేశవ్యా ప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం వల్ల ఖర్చులు తగ్గడమే కాకుండా పరిపాల నా మరియు భద్రతా సవాళ్లు కూడా తగ్గుతాయని, నిరంత రాయ విధాన నిర్ణయం పునరావృత ఎన్నికల ప్రక్రియ తరచుగా విధాన నిర్ణయం తీసుకోవడంలో అడ్డంకులను సృష్టిస్తుంది. దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు జరిగితే, ప్రభుత్వాలు అంతరాయం లేకుండా ఎక్కువ కాలం సమర్థవంతంగా పనిచేయగ లవు, అవినీతిపై నియంత్రణ మరియు నమూనా ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలు, పునరావృత ఎన్నికలు రాజకీయ పార్టీలపై అనవసరమైన ఒత్తిడిని కలిగిస్తాయి, అవినీతి సంఘటనలు పెరుగుతాయి మరియు ప్రణాళిక ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలు. ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించడం వల్ల ఈ సమస్యలపై మెరుగైన నియంత్రణ మరియు నియంత్రణకు సహాయపడు తుంది. దేశం యొక్క సజావు గా పాలన మరియు అభివృద్ధి ని నిర్ధారించడానికి 'ఒక దేశం, ఒక ఎన్నిక'ను వీలైనంత త్వరగా అమలు చేయాలని రాజ్యాంగ మద్దతు బృందం కోరుతుందన్నారు.

## ప్రవీణ్ మరణంపై సమగ్ర విచారణ చేయాలి.

**పోదూరు /ఆచంట, మార్చి27, ప్రజాజ్యోతి న్యూస్.** దైవజనులు పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతిపై ప్రభుత్వం చిత్తశుద్ధితో నిజాయితీగా విచారణ జరిపించాలనినేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ రాష్ట్ర కోఆర్డినేటర్, రెవరెండ్ జి. తిమోతి రాజు, రాష్ట్ర సెక్రటరీ రెవరెండ్ బొడ్డు డేవిడ్ రాజు డిమాండ్ చేశారు. పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలం ఆచంటలో క్రీస్తు ప్రార్థనా మందిరంలో గురువారం ఆచంటమండల పాస్టర్అసోసియేషన్ కార్యవర్గ సభ్యులతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలువురుదైవజనులుఅంతర్జాతీయ దైవజనులు పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి పట్ల తీవ్రదిగ్భ్రాంతినివ్యక్తపరిచారు. ఫెలోషిప్ ఫౌండర్తిమోతి రాజు మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్పగడాల మరణంయాక్సిడెంట్ ద్వారాజరిగిందా లేదా హత్యచేశారా అనేది అనుమానాస్పదంగాఉన్నదన్నారు. ప్రభుత్వంఈవిషయమైప్రత్యేకశ్రద్ధతీసుకొనిదర్యాప్తుచేసిసమగ్రవిచారణతో పక్షపాతం లేకుండా న్యాయము చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కన్వీనర్ బి. డేవిడ్ రాజు మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్పగడాల మీదవిపరీతమైన ద్వేషం పెంచుకున్న క్రైస్తవేతరులు ఈ చర్యకు పాల్పడి ఉంటారన్న అనుమానం తమకు ఉందని అన్నారు. గతంలో సోషల్ మీడియా వేదికగా చంపుతామని బెదిరిస్తూ ఎన్నో మెసేజీలు పంపటం అందరికీ తెలిసిందేనని అన్నారు. ఈ సందర్భముగా పాస్టర్ ప్రవీణ్ పగడాల కుటుంబ సభ్యులకు ప్రగాఢ



సానుభూతితెలియపరుస్తూ ఆచంట మండలం పాస్టర్ అసోసియేషన్ సభ్యులు కొద్దిసేపు మౌనం పాటించి ప్రార్థనలు చేశారు. ఈ సమావేశంలో పిడబ్ల్యుఏ కమిటీ సభ్యులు, పి. శేఖర్ బాబు, అధ్యక్షులు ఐ డేవిడ్ రాజు, కె. సువర్ణ రాజు, సెక్రటరీపి. యేసురత్నం, గారు, ఎన్. తిమోతి, జాయింట్ సెక్రటరీ ఎన్ సన్నీ బాబు, ఈ.సి.మెంబరస్డేవిడ్తదితరులుపాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి

**పోదూరు /పెనుగొండ, మార్చి 27, ప్రజాజ్యోతి న్యూస్.** గ్రామపంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని ఏపీ గ్రామ పంచాయితీ ఉద్యోగులు, కార్మికుల సంఘం ఆధ్వర్యంలో గురువారం పంచాయతీ కార్యదర్శి రత్నాకర్కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రామపంచాయతీ గౌరవ అధ్యక్షులు ఆంజనేయులు మాట్లాడుతూ ఏళ్ల తరబడి కార్మికులు పనిచేస్తున్నా ప్రభుత్వం టెండర్ పేరుతో కార్మికులకు సర్వీస్ లేకుండా చేస్తుందని విమర్శించారు. ఐదు సంవత్సరాలు నుండి 30 సంవత్సరాలు పైబడి పనిచేస్తున్న కార్మికుల సర్వీసును క్రమబద్ధీకరించి కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ప్రభుత్వాలు ముఖంచాటేస్తున్నాయన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కూడా మీరు చేసే పని ఎవరు చేయలేరని పొగుడుతూనే గ్రామపంచాయతీ కార్మికుల పట్ల నిర్లక్ష్య ధోరణి కొనసాగుతుందన్నారు. పంచాయతీ కార్మికులకు కనీస వేతనం అమలు చేసేలాచర్యలుతీసుకోవాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ పథకాల సంక్షేమం అమలు చేయాలని డిమాండ్ చేశారు. టెండర్ విధానం రద్దు చేయడం ద్వారా కార్మికుల హక్కులను



కాపాడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికులు, సిఐటియు నాయకులు ఎస్ వెంకటేశ్వరరావు, షేక్ పాదుషా, మాదాసు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పాస్టర్ పగడాల ప్రవీణ్ కుమార్ కు ఘన నివాళి..

**బాపట్ల, మార్చ్ 27 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** బాపట్ల జిల్లా దళిత బహుజన సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో పాస్టర్ పగడాల ప్రవీణ్ కుమార్ దారుణ హత్యకు నిరసనగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రవీణ్ పగడాలకు నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో అంటరానితన నిర్మూలన పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ చార్వాక, బహుజన సమాజ్ పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షులు కాగిత కోటేశ్వరరావు, మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి శీలం రోజన్ బాబు, పాస్టర్ల ఫెలోషిప్ సభ్యులు గుడిపాటి మోజెస్, బీఎస్పీ బాపట్ల నియోజకవర్గ కన్వీనర్ గుదేరాజారావు, సీనియర్ దళిత నాయకులు కొరగంటి శ్యాము, సీనియర్ ఫోటోగ్రాఫర్ దాసి నాగేశ్వరరావు, పాస్టర్ కాగిత రవికుమార్, సాల్వేషన్ ఆర్మీ మేజర్



సత్యానందం, పాస్టర్ ఇమ్మానుయేలు, దగ్గు మల్లి వారి పాలెం ఏబీ ఎం చర్చి పాస్టర్ చిన్నయ్య సూరి, సలగల సురేష్, సీనియర్ మైక్ సౌండ్ సర్వీసెస్ ఇశ్రాయేలు, బడుగు కిషోర్, సలగల బెసులయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎలమంచిలి ఎంపీపీ ఎన్నిక నేటికి వాయిదా



**పాలకొల్లు. ప్రజా జ్యోతి. ( కొట్టి రామం) మార్చి 27.** పశ్చిమగోదావరి జిల్లాలోని యలమంచిలి మండలం లో మండల పరిషత్ అధ్యక్ష పదవికి గురువారం జరుగవలసిన ఎన్నికలు ఈనెల 28 శుక్రవారంకి వాయిదా వేసినట్లు ఎన్నికల ప్రొసీడింగ్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఎంపీపీ ఎన్నిక జరగవలసియుండగా ఎంపీటీసీలు హాజరయ్యారు. ఎంపీపీ ఎన్నికకు ఓటు వేసే విషయంలో తమకు ఫోన్ కాల్ చేసి బెదిరిస్తున్నారని కొందరు ఎంపీటీసీలు ఎంపీపి ఎన్నికల అధికారి ఫిర్యాదు చేయడంతో ఎంపీపీ ఎన్నికవాయిదా వేసినట్లు ఆయన తెలిపారు. ఎంపీపీ ఎన్నిక సందర్భంగా మండల పరిషత్ కార్యాలయం వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. మీటింగ్ సమయానికి మండల పరిషత్ కార్యాలయంలోకి ఎంపీటీసీలను గుర్తింపు పత్రాలు చూపిన తర్వాత పోలీసులు అనుమతించి లోపలికి పంపారు. ఈ సందర్భంగా టిడిపి జనసేన వైసిపి నియోజకవర్గ నాయకులు మండల పరిషత్ ప్రాంగణానికి రావటానికి ప్రయత్నించగా వారిని పోలీసులు దూరంలోనే నిలిపించారు. 2021 లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో యలమంచిలి మండల పరిషత్లో వైసీపీ 13 టిడిపి 3 జనసేన 1 ఎంపీటీసీ స్థానాలలో విజయం సాధించగా ఎంపీపీ పదవిని వైసీపీ కైవసం చేసుకుంది. యలమంచిలి- ఎంపీటీసీ రావూరి వెంకటరమణ ఏనుగు వాని లంక ఎంపీటీసీ వినుకొండ ధనలక్ష్మి కలిసి చెరో రెండున్నర ఏళ్ళు ఎంపీపీ పదవి పంచుకోవడానికి ఒప్పందం చేసుకున్నారు. తొలుత ఎంపీపీ పదవి చేపట్టిన రావూరి వెంకటరమణ ఒప్పందం ప్రకారం గత ఏడాది మార్చి లో రాజీనామా చేశారు. తరువాత సాధారణ ఎన్నికలు రావటం వంటి కారణాలతో ఎంపీపీ ఎన్నిక ఎంపీపీ ఎన్నిక జరగలేదు. గురువారం జరుగవలసి ఉండగా శుక్రవారంకి వాయిదా పడింది.

## కార్పెంటర్స్ వృత్తి ఘనీయమైనది

**గృహ నిర్మాణంలో వారి పాత్ర కీలకం**

**ఘనంగా కార్పెంటఎస్ దినోత్సవం**


**టిడిపి మండల మహిళా అధ్యక్షురాలు అనకాపల్లి విజయలక్ష్మి**



**పొందూరు , ప్రజా జ్యోతి న్యూస్:** ప్రాథమిక అవసరాలైన గృహాలు , వ్యవసాయ పనిముట్లు తదితర వస్తువుల నిర్మాణాల్లో కార్పెంటర్ల పాత్ర గణ్యనీయమైనదని టిడిపి మండల మహిళా అధ్యక్షురాలు , మాజీ సర్పంచ్ అనకాపల్లి విజయలక్ష్మి అన్నారు. పొందూరు మండల కేంద్రంలో కంచి కామాక్షి సేవా సంఘం ఆధ్వర్యంలో కార్పెంటర్స్ దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశ్వ బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా అధ్యక్షులు , కంచి కామాక్షి ఆలయ కమిటీ ఛైర్మన్ సింహాద్రి ధనుంజయ రావు ,టిడిపి మండల మహిళా అధ్యక్షురాలు అనకాపల్లి విజయలక్ష్మి ,లేబర్ ఆఫీసర్ కొండల రావు , అసిస్టెంట్ శ్రీనివాస రావు ,కంచి కామాక్షి సేవా సంఘం అధ్యక్షులు కాకినాడ రాజారావు ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. కంచి కామాక్షి కమ్యూనిటీ హాల్ లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీనియర్ సభ్యులు 16 మందిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సింహాద్రి ధనుంజయ రావు, కాకినాడ రాజారావు మాట్లాడుతూ ఇంటి నిర్మాణంలో కార్పెంటర్ల పాత్ర అత్యంత కీలకమన్నారు. కొత్త పరికరాలు, ఆధునిక విజ్ఞానం ద్వారా వృత్తిని మరింత మెరుగుపరుచుకోవాలని తెలిపారు. విశ్వ బ్రాహ్మనులకు ఎన్ని కష్టాలు వచ్చిన అందరూ ఏకతాటిపై నిలబడి సంఘం తరపున వారి సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అరసవిల్లి వెంకటరావు , కోశాధికారి చిప్పాడ నాగేశ్వరరావు , గౌరవ సలహాదారులు గిడిజాల తవుడు, గరుగురాజా చారి ,వర్కింగ్ ప్రెసిడెంట్ సింహాద్రి ఈశ్వరరావు (చంటి) , గౌరవ పెద్దలు,కంచి కామాక్షి విశ్వ బ్రాహ్మణ సేవా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## పొందూరు మండల వైకాపా నూతన అధ్యక్షునిగా కొంచాడ రమణమూర్తి

**శుభాకాంక్షలు తెలిపిన జెడ్పీటీసీ లో లు గు కాంతారావు , జిల్లా అధికార ప్రతినిధి చింతాడ సత్యప్రసాద్**



**పొందూరు , ప్రజా జ్యోతి న్యూస్ :** వైఎస్సార్సీపీ పొందూరు మండల నూతన అధ్యక్షునిగా కొంచాడ రమణమూర్తి ని నియమిస్తూ పార్టీ అధిష్ఠానం ఉత్తర్వులు జారీ చేసింది. కొంచాడ రమణమూర్తి పొందూరు మండలం రాపాక గ్రామానికి చెందిన వ్యక్తి. ఆయన గతంలో వైఎస్సార్సీపీ మండల పార్టీ అధ్యక్షునిగా పార్టీ కోసం విశేషమైన సేవలు అందించారు. వీటితో పాటు పి. ఎ.సి.ఎస్ మాజీ అధ్యక్షునిగా సేవలు అందజేశారు. ఈ సందర్భంగా మరలా పార్టీ అధిష్ఠానం ఆయనకు మండల పార్టీ అధ్యక్షునిగా నియమించడం పట్ల ఆయన వైసిపి పార్టీ అధినేత , మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి, జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, జిల్లా పార్లమెంట్ పరిశీలకులు తమ్మినేని సీతారాం, ఆమదాలవలస నియోజకవర్గం సమన్వయ కర్త చింతాడ రవికుమార్ కు కృతజ్ఞతలు తెలిపారు. వీరితో పాటు పార్టీ కార్యదర్శి కిల్లి వెంకట సత్యన్నారాయణ, ఉత్తరాంధ్ర ఇంచార్జి కురసాల కన్నబాబు కు ధన్యవాదాలు తెలిపారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు , నాయకులు , కార్యకర్తలు అందరి సహాయ సహకారాలు తీసుకుని గ్రామస్థాయి నుండి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా రమణమూర్తి తెలియజేశారు. ఈయన నియామకం పట్ల జెడ్పీటీసీ లో లుగు కాంతారావు , జిల్లా అధికార ప్రతినిధి చింతాడ సత్యప్రసాద్ , పట్టణ పార్టీ అధ్యక్షులు గాడు నాగరాజు , పైడి నాగభూషణం , తమ్మినేని మురళీ కృష్ణ ,గుడ్ల మోహన్ మండల వైఎస్సార్సీపీ నాయకులు , కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

# జిల్లా అభివృద్ధి సామర్థ్య పెంపు ప్రతిపాదనలకు సిఎం ఆమోదం

**జిల్లా కలెక్టర్ ప్రశాంతి..**

**కలెక్టర్ల కాన్ఫరెన్స్ నేపథ్యంలో విజన్ డాక్యుమెంట్ ను వివరించిన కలక్టర్..**

**కలెక్టర్ ప్రతిపాదించిన అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి సానుకూల స్పందన..**



**రాజమహేంద్రవరం, మార్చి 27 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు రెండు రోజులు పాటు నిర్వహించిన జిల్లా కలెక్టర్ల సమావేశంలో తూర్పుగోదావరి జిల్లా తరపున నివేదించిన పలు ప్రతిపాదనలను ఆమోదించినట్లు జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి వెల్లడించారు. కలెక్టర్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.మౌలిక సదుపాయాలు , సేవా రంగం, పర్యటక అనుబంధ రంగాలు , జాతీయ రహదారులు, నర్సరీ రైతులకి ఉపాధిహామీ పని దినాలు కల్పన , తదితర అంశాలకు చెందిన ప్రతిపాదన లపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. జిల్లా సమగ్ర ప్రగతి ప్రధాన నేపథ్యంలో, జివిఏపి ఆధారిత ప్రగతి పై కలెక్టర్ ప్రజెంటేషన్ ఇచ్చారు. శాశ్వత పరిష్కారం దిశగా ఎర్రకాలువ ఆధునీకరణ, తొర్రిగడ్డ పథకం, ఉపాధిహామీ పథకం కింద 200 నుంచి 400 మంది చిన్న , సన్నకార రైతులకి ఉపాధిహామీ పని దినాలు , కడియం నర్సరీలలో కాఫీ గార్డెన్స్ , కడియం సన్న చిన్నకారు రైతుల కు ఉపాధి హామీ పథకం అమలు, బొబ్బర్లంక – ధవళేశ్వరం రహదారి రెండు లైన్ల రహదారి గా అభివృద్ధి , రైల్వే శాఖ ఆధీనంలో ఉన్న భూమి అప్పగింత విషయమై ఉత్తర ప్రత్యుత్తరాలు – హేవలక్ వంతెన పర్యటక కేంద్రం గా, కడియం నర్సరీలలో పర్యాటక అభివృద్ధి , భూసేకరణ కి చెందిన 94 98 కోట్ల బకాయిలు విడుదల,వైట్ ఫీల్డ్ పేపర్ మిల్లు భూములను సెజ్ కి కేటాయింపు, పెండింగ్ లో ఉన్న వితంతు పింఛన్ల జారీ , కొవ్వూరు సి హెచ్ సి నీ 50 నుంచి 150 బెడ్స్ ఆసుపత్రి గా అప్ గ్రేషన్ ,గోదావరీ పుష్కరాలు నేపథ్యం ప్రత్యేక అధికారుల నియామకం తదితర 11 ప్రతిపాదనలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆమోదించినట్లు కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.ఎర్రకాలువ పనులకు సంబంధించి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని 295 కోట్ల 30 లక్షల అంచనాతో గోపాలపురం, నిడదవోలు, తాడేపల్లిగూడెం నియోజకవర్గాల్లో 20,250 క్యూసెక్కుల డిజైన్ డిశ్చార్జి కోసం ఎర్రకాలవ నది కుడికాలువ మరియు ఎడమ ఒడ్డు మరియు నిర్మాణాల కోసం 0 కి మీ నుండి 33.390 కిలోమీటర్ వరకు శాశ్వత పునరుద్ధరణ కోసం ప్రతిపాదనలు రూపొందించినట్లు తెలిపారు. ఎర్రకలవ నది డిజైన్ డిశ్చార్జి ఖరారు కోసం నిపుణుల కమిటీ ఏర్పాటు చేసి వేచి ఉన్న నేపథ్యంలో మరింత ముంపునకు గురికాకుండా నివారణ చర్యలను తీసుకోవాలని కోరినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ క్రమంలో సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి దీనిపై ఇరిగేషన్ అధికారులతో సమావేశం నిర్వహించి, తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కి ముఖ్యమంత్రి సూచించినట్లు కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా జిల్లా నుంచి ప్రతిపాదించిన అన్ని అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు కలెక్టర్ తెలిపారు.

## ఏప్రియల్ 4 న రాజమహేంద్రవరంలో
# అమరావతి చిత్రకళా వీధి ప్రదర్శన..

**కమిషన్ చైర్ పర్సన్ తేజస్వి పొడపాటి**

**దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు 500 కి పైగా ప్రముఖ కళాకారులు నమోదు..**

**రాష్ట్రంలో మన సంస్కృతి కి, కళలకి పునర్జన్మ..**

**ఏప్రిల్ 4 వ.తేదీ ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ప్రదర్శన..**

**లాలా చెరువు రోడ్డులో ప్రదర్శనల కు ఏర్పాట్లు..**




**రాజమహేంద్రవరం, మార్చ్ 27 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** ఆంధ్రపదేశ్ రాష్ట్రంలో కళలకి కాలచి అయిన రాజమహేంద్రవరం నగరంలోని లాలా చెరువు రహదారి మార్గంలో "అమరావతి చిత్రకళా వీధి ప్రదర్శన" భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత మరియు సంస్కృతి (క్రియేటివిటీ అండ్ కల్చర్) కమిషన్ చైర్ పర్సన్ తేజస్వి పొడపాటి తెలిపారు. గురువారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో "అమరావతి చిత్రకళా వీధి ప్రదర్శన" గొడప్రతిని కల్చరల్ డైరెక్టర్ ఎమ్. మల్లిఖార్జున రావు తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ పి. తేజస్వి మాట్లాడుతూ, ఆంధ్రపదేశ్ రాష్ట్రంలో కళలకి తిరిగి పూర్వ వైభవం తీసుకుని రావడం లో ప్రముఖ కళాకారుల ప్రదర్శనలు పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర పర్యటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముందు సృజనాత్మకత మరియు సంస్కృతి కమీషన్ చైర్ పర్సన్ గా బాధ్యతలు స్వీకరించిన తరువాత ఈ ప్రతిపాదనలు వివరించడం జరిగిందన్నారు. దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాలలో ప్రదర్శిస్తున్న వివిధ కళా ప్రదర్శనలను అధ్యానం చేసినట్లు తెలిపారు. గత రెండు దశాబ్దాల కర్ణాటక రాష్ట్రంలో చిత్ర కళా ప్రదర్శనలకు దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి వచ్చినట్లు చెప్పారు. అదే విధంగా రాష్ట్రంలో కూడా వివిధ సాంస్కృతిక కళా రీతులలో కూడిన వివిధ ప్రదర్శనల మెలి కలియకతో ప్రదర్శనా నిర్వహించనున్నట్లు తెలిపారు.
ఏప్రియల్ 4 వ తేదీ శుక్రవారం లాలా చెరువు రహదారి మార్గంలో " అమరావతి చిత్ర కళా వీధి ప్రదర్శన" ను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికీ 500 కి పైగా పేర్లు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం నిర్వహణా ద్వారా వొచ్చే నిధులతో రాజమండ్రీ లోని దామెర్ల రామారావు ఆర్ట్ గ్యాలరీ ని అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.ప్రతి ఏడాది ఈ వీధి ప్రదర్శన కొనసాగిస్తామని చెప్పారు. కల్చరల్ డైరెక్టర్ ఎమ్ మల్లిఖార్జున రావు మాట్లాడుతూ, ఈ ప్రదర్శనలో భాగస్వామ్యం కావాలని ఆకాంక్షించే వారు www. amaravatiartfestival.com ద్వారా వారి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

# కొల్లేరును 5 నుండి 3వ కాంటూరుకు కుదించాలి..

**కొల్లేరు ప్రజలకు ప్రభుత్వాలు ఇచ్చిన హామీని అమలు చేయాలి..**

**సిపిఎం కొల్లేరు ప్రజా చైతన్య యాత్రలో నాయకులు డిమాండ్..**




**ఏలూరు,మార్చి 27 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** కొల్లేరు ప్రజల సమస్యలపై సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కొల్లేరు గ్రామాల్లో గురువారం ప్రజా చైతన్య యాత్రను నిర్వహించారు. ఏలూరు రూరల్ మండలంలోని పైడి చింతపాడు, పత్తి కోళ్లలంక, గుడివాకలంక, కోటేశ్వర దుర్గాపురం తదితరు గ్రామాల్లో సిపిఎం నాయకులు పర్యటించారు. కొల్లేరు ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.లింగరాజు, కె.శ్రీనివాస్, పి. రామకృష్ణ తదితరులు మాట్లాడారు.కొల్లేరును 5 నుండి 3వ కాంటూరుకు కుదిస్తామన్న పాలకుల మాటలు నీటి మూటలుగా మిగిలిపోయాయని చెప్పారు. కొల్లేరులో 46 బెడ్ గ్రామాలు, 74 బెల్ట్ గ్రామాలలో మూడు లక్షల మంది మత్స్యకారులు, దళితులు ఉన్నారన్నారు. 2006లో ఆపరేషన్ కొల్లేరు పేరుతో ఐదో కాంటూరు లోపల ఉన్న వేలాది ఎకరాలను చెరువులన్నింటినీ ధ్వంసం చేసి లక్షలాదిమంది కొల్లేరు ప్రజల జీవనాన్ని నాశనం చేశారన్నారు. 5వ కాంటూరు పరిధిలో 77,138 ఎకరాల చెరువులు ధ్వంసం పేరుతో 86వేల ఎకరాలకు పైగా చెరువులు ధ్వంసం చేశారన్నారు.7500 ఎకరాల సొసైటీ చెరువులు,13వేల ఎకరాలలో జిరాయితీ భూముల చెరువులను ధ్వంసం చేశారన్నారు. దీంతో కొల్లేరు ప్రజల పరిస్థితి గట్టునపడ్డ చేపల్లా మిగిలిందని ఆందోళన వ్యక్తం చేశారు. కొల్లేరులోని వేలాదిమంది ప్రజలు పొట్ట నింపుకునేందుకు సుదూర ప్రాంతాలకు వలసలు వెళ్లారని,వెళుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 120 జీవో ఆధారంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పర్యావరణాన్ని పరిరక్షిస్తామనే పేరుతో కొల్లేరును ధ్వంసం చేశారన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయలేదని, ఉపాధి కల్పన లేదన్నారు. ఈ పరిస్థితులలో 15వేల ఎకరాలలో గట్లు వేసుకుని కొన్ని చెరువులను కొల్లేరు ప్రజలు సాగు చేసుకుంటున్నారు. కొల్లేరు ప్రజల ఉపాధిని నష్టం కలిగించే విధంగా కొంతమంది పర్యావరణం పేరుతో సుప్రీంకోర్టుకు వెళ్ళగా కొల్లేరు ప్రజల సాగులో ఉన్న 15వేల ఎకరాలు చెరువులు ధ్వంసం వేయాలని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వగా అధికారులు గట్లు ధ్వంసం చేశారన్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు కేసులో ఇంప్లీడ్ కాకపోవడం వలన సుప్రీంకోర్టు ఏకపక్షంగా తీర్పు ఇవ్వడం జరిగిందన్నారు. కొల్లేరును 5 నుండి 3వ కాంటూరుకు కుదించాలని, ఇందుకు అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని,కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు.కొల్లేరు ప్రజలకు జీవనోపాధి కల్పించాలని,146 సొసైటీలు పునరుద్ధరణ చేయాలని,13 వేల ఎకరాలు జిరాయితీ భూమి హక్కుదార్లకు అప్పగించాలని కోరారు.
సుప్రీంకోర్టు గ్రీన్ ట్రిబ్యునల్ కేసులో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఇంప్లీడ్ పిటిషన్ వేయాలన్నారు. కొల్లేరు లో ఉన్న వేలాది ఎకరాలు ప్రభుత్వ భూములు పేదలకు పంచాలని కోరారు. కొల్లేరు గ్రామాలకు రోడ్లు, విద్యుత్, ప్రజలకు త్రాగునీరు వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు.
కార్యక్రమంలో సీపీఎం నాయకులు కట్టా భాస్కరరావు, కె. లెనిన్ వివిధ గ్రామాల కొల్లేరు ప్రజలు పాల్గొన్నారు.

## ట్యాంకర్లతో నీటి సరఫరా



**పొందూరు , ప్రజా జ్యోతి న్యూస్ :** వేసవి తాకిడిని దృష్టిలో పెట్టుకొని పొందూరు మండల కేంద్రంలో పంచాయతీ ఈ. ఓ కింతలి మోహన్ బాబు ఆధ్వర్యంలో టాంకర్లతో మంచినీటి సరఫరా కార్యక్రమాన్ని చేపట్టారు. సాయిబాబు కాలనీ , కుమ్మరి కాలనీ లలో ప్రజలు త్రాగునీటి సమస్యను ఎదుర్కోవడం తో నీటి సరఫరా చేపట్టడం జరిగిందని మోహన్ బాబు తెలిపారు. ఉష్ణోగ్రతలు పెరిగి , నీటి లభ్యత తక్కువయ్యే వేసవి లో ప్రజలు ఎవరైనా త్రాగునీటి సమస్యలను ఎదుర్కొంటే తమకు తెలియజేయాలని కోరారు

## 29న బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల పరిశీలన

**దరఖాస్తుదారులు సర్టిఫికెట్ పరిశీలనకు హాజరు కావాలి**

**ఎంపిడిఓ మన్మధ రావు**



**పొందూరు , ప్రజా జ్యోతి న్యూస్ :** బీసీ కార్పొరేషన్ రుణాల కొరకు పొందూరు మండలానికి సంబంధించి వివిధ గ్రామపంచాయతీల నుండి 706 అప్లికేషన్లు ఆన్లైన్ ద్వారా దరఖాస్తుదారులు నమోదు చేసుకున్నారని ఎంపిడిఓ మన్మధ రావు తెలిపారు. ఈ మేరకు రుణాలను మంజూరు చేసే ప్రక్రియ లో భాగంగా దరఖాస్తు దారుల సర్టిఫికెట్ల పరిశీలన , వేలిడేషన్ కార్యక్రమాన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారి, బ్యాంకు మేనేజర్ల ఆధ్వర్యంలోఈ నెల 29న శనివారం నాడు పొందూరు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులందరూ ఈ కార్యక్రమానికి హాజరు కావాలని పిలుపునిచ్చారు.

## డి.ఆర్.మోహన రావుకు సబ్ ఇన్స్పెక్టర్ పదోన్నతి..
## సత్కరించిన జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా..



**అనకాపల్లి, మార్చి 27 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** అనకాపల్లి జిల్లాలో కీలక బాధ్యతలు నిర్వహిస్తూ విశేష సేవలందించిన డి.ఆర్.మోహన రావు కు సబ్ ఇన్స్పెక్టర్ గా పదోన్నతి లభించింది. రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టి ప్రమోషన్ మంజూరు చేయగా, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తన కార్యాలయంలో మోహన్ రావు ను ప్రత్యేకంగా సత్కరించారు.ఉమ్మడి విశాఖపట్నం జిల్లా మరియు అనకాపల్లి జిల్లా పరిధిలో వివిధ హోదాల్లో అనుభవం సంపాదించి, నిబద్ధతతో విధులు నిర్వహించిన మోహన రావు ను జిల్లా ఎస్పీ అభినందిస్తూ, భవిష్యత్తులో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.
కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.దేవ ప్రసాద్, కంట్రోల్ రూమ్ ఇన్స్పెక్టర్ రమేష్, ఎస్సై వెంకన్న తదితర పోలీసు అధికారులు, సహోద్యోగులు పాల్గొని మోహన రావు కు శుభాకాంక్షలు తెలిపారు.

## కూటమి ప్రభుత్వంలో
## కళలు, కళాకారులకు పెద్దపీట..

**రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్..**

**కనుమరుగైన కళలను, చేయూతకు నోచుకోని కళాకారులకు అండ..**

**నాటక రంగానికి పునరుజ్జీవం తెస్తామన్న మంత్రి..**



**రాజమహేంద్రవరం, మార్చి 27 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** కూటమి ప్రభుత్వంలో కళలకు, కళాకారులకు ఆదరణ కల్పించి పెద్దపీట వేస్తామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. గురువారం ప్రపంచ నాటక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి కందుల దుర్గేష్ గత ప్రభుత్వంలో కనుమరుగైన కళలను, చేయూతకు నోచుకోని కళాకారులకు అండగా నిలిచి నాటక రంగానికి పునరుజ్జీవం తెస్తామన్నారు. కళలు, కళాకారులకు తగిన ప్రోత్సాహం అందించి అవార్డులతో సత్కరిస్తామన్నారు. నాటకం నిత్యనూతనం, సజీవం, అద్భుత దృశ్యకావ్యమని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ అభివర్ణించారు.మనిషిని మనిషిగా చూపించేది నాటకమని సంక్షోభం నుండి ప్రశాంతతవైపు, ఆవేదన నుండి ఆనందం వైపు, విలాపం నుండి ఉల్లాసం వైపు, అంధకారం నుండి ప్రకాశం వైపు నడిపించేది నాటకమని వివరించారు. చతుర్విధాభినయాలు నాటక ప్రదర్శనకు పట్టుగొమ్మలు అన్నారు. ఆ విశిష్టతను ప్రపంచానికి చాటి చెప్పడమే ప్రపంచ రంగస్థల దినోత్సవ ఉద్దేశమన్నారు. రంగస్థలంపై హావభావాలతో, సంభాషణా చాతుర్యంతో, పాత్రోచితమైన వేషధారణతో, నవరసాలకు ప్రతినిధులై ప్రేక్షక మనోఫలకంపై చిత్రించేవే నాటకంలోని పాత్రలు అని మంత్రి అన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఇటీవల తాను ప్రదర్శించిన బాలచంద్రుడి ఏకాపాత్రాభినయ పాత్రను గుర్తుచేసుకున్నారు.కళ ఒక సాధనం, జనచైతన్యానికి అదొక ఆయుధమని లెనిన్ వ్యాఖ్యలను గుర్తుచేశారు. భూత, భవిష్యత్, వర్తమానాలకు వారధిగా నిలిచే ఏకైక కళారూపం నాటకమని అలాంటి కళలను ప్రదర్శించే ప్రతిభ గల కళాకారులకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ తోడ్పాటు అందిస్తుందని మంత్రి దుర్గేష్ అన్నారు.

## ఎమ్మెల్యే సత్యప్రభ రాజాగారి సారథ్యంలో

# నియోజకవర్గరోడ్లకు మహర్దశ ...

**ప్రత్తిపాడు ప్రజా జ్యోతి రిపోర్టర్ వీరబాబు** ఈరోజు ప్రత్తిపాడులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు పాత్రికేయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు అమరాది వెంకటరావు, కార్యదర్శి జంకల పకీరు మాట్లాడుతూ ఎమ్మెల్యే శ్రీమతి వరుపుల సత్య ప్రభ రాజా గారు నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్నారని అన్నారు. నియోజకవర్గంలో చాలా రోడ్లు గత కొన్ని సంవత్సరాల నుంచి అభివృద్ధికి నోచుకోక అధ్వాన్నంగా తయారయ్యాయని, కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఎమ్మెల్యే సత్య ప్రభ రాజా గారి చొరవతో రోడ్లకు మహర్దశ కలిగిందని అన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా బీటీ రోడ్లు, సీసీ రోడ్లకు 15.83 కోట్లు మంజూరు చేయడం జరిగింది. అందులో 1.33 కోట్లు ప్రత్తిపాడు మండలానికి మంజూరు చేయించిన ఎమ్మెల్యే సత్య ప్రభ రాజా గారికి, గౌరవ ముఖ్యమంత్రి వర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి, ఉప ముఖ్యమంత్రి వర్యులు శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ గారికి ప్రత్తిపాడు మండల ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో కాకినాడ పార్లమెంటరీ పార్టీ ఉపాధ్యక్షులు కొమ్ముల కన్నబాబు గారు, క్లస్టర్ ఇన్చార్జి పల్లా గోపి గారు, మాజీ ఎంపీపీ సత్యంశెట్టి సీతబాబు గారు, దాకారపు కృష్ణ గారు, సర్పంచ్ మంతెన శ్రీను గారు, సర్పంచ్ వనపర్తి నాగేశ్వరరావు గారు, లొండ లోవరాజు గారు, రామిశెట్టి మునసబు గారు, సుంకర సోమరాజు గారు, మదినే దొరబాబు గారు, రీసు సత్తిబాబు గారు, రావూరి తాతాజీ గారు, ముత్యాల రాంబాబు గారు, కుండల అప్పారావు గారు తదితరులు పాల్గొన్నారు. రోడ్లకు మహర్దశ... ఈరోజు ప్రత్తిపాడులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు



పాత్రికేయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు అమరాది వెంకటరావు, కార్యదర్శి జంకల పకీరు మాట్లాడుతూ ఎమ్మెల్యే శ్రీమతి వరుపుల సత్య ప్రభ రాజా నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్నారని అన్నారు. నియోజకవర్గంలో చాలా రోడ్లు గత కొన్ని సంవత్సరాల నుంచి అభివృద్ధికి నోచుకోక అధ్వాన్నంగా తయారయ్యాయని, కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఎమ్మెల్యే సత్య ప్రభ రాజా చొరవతో రోడ్లకు మహర్దశ కలిగిందని అన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా బీటీ రోడ్లు, సీసీ రోడ్లకు 15.83 కోట్లు మంజూరు చేయడం జరిగింది. అందులో 1.33 కోట్లు ప్రత్తిపాడు మండలానికి మంజూరు చేయించిన ఎమ్మెల్యే సత్య ప్రభ రాజా , గౌరవ ముఖ్యమంత్రి వర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి వర్యులు శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రత్తిపాడు మండల ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో కాకినాడ పార్లమెంటరీ పార్టీ ఉపాధ్యక్షులు కొమ్ముల కన్నబాబు , క్లస్టర్ ఇన్చార్జి పల్లా గోపి , మాజీ ఎంపీపీ సత్యంశెట్టి సీతబాబు , దాకారపు కృష్ణ , సర్పంచ్ మంతెన శ్రీను సర్పంచ్ వనపర్తి నాగేశ్వరరావు , లొండ లోవరాజు , రామిశెట్టి మునసబు సుంకర సోమరాజు , మదినే దొరబాబు , రీసు సత్తిబాబు , రావూరి తాతాజీ , ముత్యాల రాంబాబు కుండల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# మతసామరస్యానికి ప్రతీక ముస్లిం మతం..





**జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి..**

**బాపట్ల, మార్చి 27 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** మతసామరస్యానికి ప్రతీక ముస్లిం మతం అని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి పేర్కొన్నారు. రంజాన్ పండగను పురస్కరించుకొని గురువారం సాయంత్రం స్థానిక కాపు కళ్యాణ మండపం లో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుగా ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం మతంలో ప్రపంచంలో అందరూ ఒప్పుకునేది సహృద భావమని అన్నారు. అందులో ఎలాంటి వర్గాలు గాని, కులాలు గాని, బేధాలుగాని,తారతమ్యాలు గాని,వ్యత్యాసాలు గాని లేకుండా అందరూ ఒకచోట గుమికూడి ప్రార్థన చేసుకునే సోదర భావంతో ఉంటుందని ఆయన అన్నారు. ముస్లింలు హిందువులతో కలిసిపోయి అన్నదమ్ములుగా జీవిస్తున్నారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ లో విభిన్న మతాలు ఉన్నా కలిసిమెలిసి జీవిస్తున్నారని అన్నారు. క్రీస్తు శకం 1750 మొదలుకొని 2025 వ సంవత్సరం వరకు సుమారు 1250 సంవత్సరాలు కలిసి మెలిసి ఉన్నామన్నారు. మనలను ఎవరు విడదీయలేరని ఆయన అన్నారు. మహమ్మద్ ప్రవక్త ముస్లిం మతాన్ని ప్రబోధించారని అన్నారు. ఈ మతం చాలా వేగంగా ప్రపంచాన్ని చుట్టేసిందన్నారు. ఈ మతంలో ఉండే పవిత్రత అటువంటిది అని ఆయన అన్నారు. అన్ని మతాలవారు ఎప్పుడు కలిసి మలిచి సోదరుభావంతో మెలగాలని ఆయన అన్నారు.ముస్లింలకు అతి పవిత్రమైన మాసం రంజాన్ మాసం అని ఆయన అన్నారు. నెలవంక చూసినప్పటి నుండి ప్రారంభం అయ్యే ఈ మాసంలో ముస్లిం సోదరులు కఠోరమైన ఉపవాస దీక్ష చేపడతారని అన్నారు. సంవత్సరం అంతటా ఏ దానాలు చేయకపోయినా ఉపవాసాలు ఉండకపోయినా రంజాన్ నెలలో మాత్రం ముస్లిం సోదరులు తప్పకుండా ఉపవాసాలు చేస్తారని అన్నారు. రంజాన్ మాసం ప్రారంభమైన నాటి నుండి ముగిసే వరకు ముస్లింలు పగలు నిష్టగా ఉపవాస దీక్షలు పాటిస్తారని అన్నారు. తెల్లవారుజామున భోజనం చేసిన తర్వాత ఆరోజు అంతా ఉపవాసం ఉండే భక్తులు సాయంత్రం సూర్యాస్తమయం తర్వాత దీక్షను విరమిస్తారని అన్నారు. తెల్లవారుజామున ఆహారం తీసుకోవడానికి "సహార్ " అని సాయంత్రం ఉపవాస దీక్ష విరమణ తో తీసుకుని ఆహారాన్ని" ఇస్తార్ " అని అంటారన్నారు. ఈ ఉపవాస దీక్ష లక్ష్యం మనిషిలో దైవభీతి, దేవుని పట్ల నమ్మకం అని అన్నారు. కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి షేక్ రోషన్ జమీర్ భాష, బాపట్ల రెవెన్యూ డివిజన్ అధికారి గ్లోరియా, బాపట్ల తాసిల్దార్ సలీమా తదితరులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 1 ముఖ్యమంత్రి పర్యటన..

**జిల్లా కలెక్టర్ వెంకట మురళి..**

**పెన్షన్ల పంపిణీ కార్యక్రమం లో పాల్గొనున్న ముఖ్యమంత్రి..**

**కొత్త గొల్లపాలెం లో ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ..**

**సీఎం పర్యటనకు వేగంగా ఏర్పాట్లు**

**అధికారులకు దిశనిర్దేశం చేసిన కలెక్టర్..**





**బాపట్ల, మార్చి 27 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఏప్రిల్ ఒకటో తేదీన నిర్వహించనున్న పేదల సేవలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమం కు అవసరమైన పనులు వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జె.మురళి అధికారులను ఆదేశించారు. ఏప్రిల్ 1వ తేదీన ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో గురువారం చిన్నగంజాం మండలం కొత్త గొల్లపాలెం గ్రామాన్ని జిల్లా కలెక్టర్ వెంకట మురళి, జిల్లా ఎస్.పి తుషార్ డూడి సందర్శించారు. కొత్త గొల్లపాలెం గ్రామంలో ముఖ్యమంత్రి దిగటానికి అనుకూలం హెలిప్యాడ్ ఏర్పాటు చేయవలసిందిగా రోడ్లు భవనాల శాఖ అధికారులను ఆదేశించారు. 2వేల మంది ప్రజలు హాజరయ్యే విధంగా కూర్చోవడానికి అనుకూలంగా సభా ప్రాంగణ ఏర్పాటు చేయవలసిందిగా అధికారులకు సూచించారు. ప్రజా వేదిక వద్ద జీరో పావర్టీ గురించి రెండు స్టాల్స్ ని ఏర్పాటు చేయవలసిందిగా డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన సుమారుగా 4 గంటల పాటు కొత్త గొల్లపాలెం గ్రామంలో జరుగుతుందని ఆయన చెప్పారు. ముఖ్యమంత్రి హెలిప్యాడ్ దిగిన అనంతరం ప్రజా ప్రతినిధులను కలుసుకుంటారని అన్నారు. అనంతరం పెన్షన్లు పంపిణీ చేయడానికి లబ్ధిదారుల గృహాలకు ముఖ్యమంత్రి వెళతారని ఆయన చెప్పారు. అనంతరం స్థానికంగా ఉన్న రామాలయం దేవాలయానికి వెళతారని ఆయన చెప్పారు. ప్రజా వేదికకు వెళతా రని ముఖ్య మంత్రితో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు హాజరు అవుతారని ఆయన అన్నారు. ప్రజా వేదిక కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్న తర్వాత తిరిగి హెలిప్యాడ్ కు వెళతారని ఆయన చెప్పారు. ముఖ్యమంత్రి పర్యటనకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అధికారులకు కేటాయించి విధులను నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా ఎస్.పి తుషార్ డూడి, జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్ ,డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి , డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## మన ఊరి బడిని కాపాడుకుందాం.



**పోదూరు మార్చి 27 ప్రజాజ్యోతి న్యూస్ :** గురువారం గుమ్ములూరు పంచాయితీ పరిధిలో గల ప్రభుత్వ ఉపాధ్యాయులు చినపేట, పెదవా గ్రామాలలో ఇంటింటి ప్రచారం చేసి ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న వసతులు తెలియచేయటమే కాక తమ పిల్లలకు నాణ్యమైన విద్య అందిస్తామని హామీ ఇచ్చి పిల్లలను బడిలో చేర్పమని కోరారు. కాగా ఉపాధ్యాయుల మాట విని తల్లితండ్రులు విద్యార్థులను జాయిన్ చేయుటకు సమ్మతి తెలియచేసినారు. గ్రామ పాఠశాలలు మనకు పట్టుకొమ్మ అని మనం వాటిని సమరక్షించుకోవాలని గ్రామ పెద్దలు తెలియచేశారు. గత రెండు సంవత్సరాలలో లక్షలాది పిల్లలు ప్రభుత్వ పాఠశాలలు వీడి ప్రైవేటు పాఠశాలలకు వెళ్లడం జరిగిందని ఇది ఆందోళనకరమైన విషయం అని, ఈ విధంగా జరిగితే ప్రభుత్వ పాఠశాల మనుగడ రాబోయే రోజులలో ప్రశ్నర్థకంగా మారుతుంది అని, ఆ విధంగా జరిగితే పేద బడుగు బలహీన వర్గాలకు విద్య అందని ద్రాక్ష అవుతుందని యూటీయఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఎంపీ . రాజశేఖర్ తెలియచేశారు. ఈ కార్యక్రమంలో గుమ్ములూరు ఉపాధ్యాయులు డి . క్షేమమూర్తి, ఎం . నాగేశ్వరావు, డి . మాధవి, కె . రమాదేవి, ఎంపీ . రావు,.యస్కు మారరాజా, వి .రజని, ఎం . శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఫడ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ వేస్ట్‌పై మున్సిపల్ కార్మికులకు అవగాహన సదస్సు



**బద్వేల్ మార్చి 27 (ప్రజా జ్యోతి న్యూస్)** స్థానిక పట్టణంలోని పాత మున్సిపల్ ఆఫీసులో మున్సిపల్ కార్మికులకు శానిటేషన్ సెక్రెటరీల కు, ఈ వేస్ట్ పై అవగాహన సదస్సును ఫడ్స్ సంస్థ డైరెక్టర్ పివి రమణయ్య సుబ్రహ్మణ్యం చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ విశ్వనాథం గారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సదస్సుకు సానిటరీ ఇన్స్పెక్టర్ జి రమణ హాజరై,అవగాహన కల్పించారు. ఈ వేస్ట్ అనగా సెల్ ఫోన్స్, వాషింగ్ మిషన్స్, కంప్యూటర్లు,టీవీలు, ఎలక్ట్రికల్ పరికరాలు, సిడిలు రిఫ్రిజిరేటర్స్, ఏసీలు, ఎయిర్ కూలర్లు వల్ల పర్యావరణానికి మానవుడికి చాలా హాని కలిగిస్తున్నాయని ప్లాస్టిక్ కన్నా ఈ వేస్ట్ పగలగొట్టి భూమిలో పడేయడంవల్ల గాలి కాలుష్యం భూమి కాలుష్యం జల వనరులు కాలుష్యం, అయినందువలన పిల్లలకి, పెద్దలకి రకరకాల జబ్బులు క్యాన్సర్లు, కిడ్నీ, లు చెడిపోవడం, థైరాయిడ్స్, పుట్టే పిల్లలు వికలాంగులుగా పుట్టటం, మొదలు జబ్బులు వస్తున్నాయని వారు తెలిపారు. అలాగే సానిటరీ ఇన్స్పెక్టర్ జి రమణ గారు మాట్లాడుతూ ప్లాస్టిక్ కన్నా ఈ వేస్ట్ వల్లపర్యావరణానికి, మానవజాతికి ప్రమాదకరమని, అందువల్ల ప్రతి ఒక్కరూ వాటిని ఎక్కడంటే అక్కడ పడేయ్యకుండా ఒక చోట చేర్చి రీసైకిలింగ్ కంపెనీలకు పంపాలని కోరారు. యూనియన్ నాయకులు నాగేంద్రబాబు, హరి,మాట్లాడుతూ, పర్యావరణం కొరకు పారిశుద్ధ కార్మికులు, ఎక్కువ పని చేస్తున్నారని ఈ వేస్ట్ వల్ల మన దేశం చాలా ప్రమాదకరమైన స్థితిలో ఉందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ డి. కృష్ణయ్య, మున్సిపల్ కార్మికులు, శానిటేషన్ సెక్రటరీలు పాల్గొన్నారు.

## సాదక్ హాస్పిటల్ వారి సేవలు అభినందనీయం



**బద్వేల్ మార్చి 27 (ప్రజా జ్యోతి న్యూస్)** స్థానిక పట్టణంలోని సిద్దవటం రోడ్ లో ఉన్న సాధక్ హాస్పిటల్ డాక్టర్ హుస్సేన్ %వి.ణ% మరియు వారి శ్రీమతి షేక్ జరీనా బేగం చిన్నపిల్లల వైద్య నిపుణురాలు వారిరువురికి ఈరోజు ఉదయం 11 గంటలకు బద్వేల్ పట్టణం లోని పలు ప్రజాసంఘాలవారు అభినందనలు తెలుపుతూ సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంజాన్ మాసంలో బద్వేల్ పట్టణ ప్రజలకు అవసరాలను గుర్తుపెట్టుకుని కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరికి వైద్యం అందాలనే ఉద్దేశంతో ఉచితంగా వైద్య సేవలు అందించినందుకు వారిని శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు నానబాల వెంకటేశ్వర్లు. రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం కార్యదర్శి బద్వేల్ గురుమూర్తి. బద్వెన కళా పీఠం వ్యవస్థాపకులు గంగసాని సాంబశివారెడ్డి. బద్వేల్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్ ఏ సత్తార్ .షేక్ అన్వర్ భాష, ఆడిటర్ అల్లా బకాష్, రసూల్. ఖాజాగౌస్. టెలిఫోన్ అధికారి బాలయ్య. ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సత్యప్రభ సారథ్యంలో నియోజకవర్గ రోడ్లకు మహర్దశ-వెన్నా శివ...

**శంఖవరం ప్రజా జ్యోతి ప్రతినిధి** నియోజకవర్గంలో గుంతలు లేని రోడ్లులే ఎమ్మెల్యే సత్యప్రభ చేయమని రాష్ట్ర టిఎన్టియుసి ఉపాధ్యక్షుడు వెన్నా శివ, తెలుగు యువత అధ్యక్షుడు కీర్తి సుభాష్ అన్నారు.కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం,శంఖవరం మండలం సీతంపేట గ్రామంలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు బద్ది రామారావు,టిఎన్టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు వెన్నా శివ,తెలుగు యువత అధ్యక్షుడు కీర్తి సుభాష్ మాట్లాడుతూ ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారన్నారు.నియోజకవర్గంలో చాలా రోడ్లు గత కొన్ని సంవత్సరాల నుండి అభివృద్ధికి నోచుకోక అధ్వాన్నంగా తయారయ్యాయని, కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఎమ్మెల్యే సత్యప్రభ రాజా చొరవతో రోడ్లకు మహర్దశ కలిగిందని అన్నారు.

# ఎస్ఎల్బీసీ ప్రమాదానికి మల్లెల తీర్థమే కారణమా



**మహబూబ్ నగర్ :** టన్నెల్ లో ఇరుక్కుపోయిన వారి ఆచూకీ తెలుసుకోవడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నెలరోజులుగా అనేక ప్రయత్నాలు చేస్తోంది. వివిధ రాష్ట్రాల సేవలను వినియోగించుకుంది. కేంద్ర బలగాలను కూడా రంగంలోకి దింపింది. అయినప్పటికీ ఇప్పటివరకు కేవలం రెండు మృతదేహాలను మాత్రమే వెలికి తీయగలిగింది. కన్వేయర్ బెల్ట్ కు 50 మీటర్ల దూరంలో ఉన్న ఓ మృతదేహాన్ని మంగళవారం గుర్తించారు. అయితే అతనికి సంబంధించి ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.. కన్వేయర్ బెల్ట్ కు 50 మీటర్ల దూరంలో దుర్వాసన వస్తున్న నేపథ్యంలో రెస్క్యూ బృందాలు తవకాలు జరిపాయి. డి 1, డి 2 చోట కాకుండా.. ఇతర ప్రాంతాల్లో తవ్వకాలు జరపగా మృతదేహం ఆనవాళ్లు లభించాయి. గ్యాస్ కట్టర్ల సహాయంతో కన్వేయర్ బెల్ట్ శిధిలాలను తొలగించారు. మృతదేహాన్ని బయటకి వెలికి తీశారు. ఘటన జరిగిన నెలరోజుల అనంతరం రెండో మృతదేహం లభించడం విశేషం. అయితే చనిపోయిన వ్యక్తి ఎవరనేది తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాగర్ కర్నూల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. టన్నెల్ కూలిపోయిన సంఘటన గత నెల 22న జరిగింది. అందులో 8 మంది చిక్కుకున్నారు. వారిని కాపాడేందుకు తెలంగాణ ప్రభుత్వం ఆర్మీ, ఎన్ డి ఆర్ ఎఫ్, ఎస్ టి ఆర్ ఎఫ్, సింగరేణి, ర్యాట్ హోల్ మైనర్స్, కేరళ కెడావర్ డాగ్ స్క్వాడ్ సేవలను వినియోగించుకుంది. ఇక సరిగ్గా 15 రోజుల క్రితం గురుప్రీత్ సింగ్ అనే కార్మికుడి మృత దేహం లభ్యమైంది. అప్పటినుంచి తవ్వకాలు చేపడుతున్నప్పటికీ మొన్నటి వరకు ఎటువంటి పురోగతి లభించలేదు. ఇక సోమవారం లో రెస్క్యూ ఆపరేషన్ పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులు, మంత్రులతో సమీక్ష నిర్వహించిన సంగతి తెలిసిందే. ఆ సమీక్షలో టన్నెల్ పైకప్పు బలహీనంగా ఉందని.. అది ఏ క్షణమైనా కూలిపోతుందని ముఖ్యమంత్రి దృష్టికి అధికారులు,మంత్రులు తీసుకెళ్లారు. ప్రమాదానికి కారణం శ్రీశైలం ప్రాజెక్టు కాదని.. మల్లెలతీర్థం జలపాతమే కారణమని నీటి రంగ నిపుణులు అంచనా వేస్తున్నారు. మల్లెల తీర్థం జలపాతం నీరు ఊటనీరుగా మారి.. సొరంగం పై కప్పు కూలడానికి కారణమైందని చెబుతున్నారు. దేవాదుల ప్రాజెక్టును చలివాగుండం చేసిన విషయం తెలిసిందే. అలాగే మల్లెల తీర్థం కూడా కూలడానికి కారణమైందని తెలుస్తోంది. నిమిషానికి 3,000 లీటర్ల ఊట వస్తోందని.. ఇక్కడి నుంచి వచ్చే ఊట శ్రీశైలం ప్రాజెక్టు కాదని.. మొదటిదాకా శ్రీశైలం ప్రాజెక్టు వల్లే ఊట వస్తోందని వాదనలు ఉండేవని.. తమ పరిశీలనలో మల్లెల తీర్థం వల్లే ఊట వస్తోందని తేలిందని సాగునీటి రంగ నిపుణులు చెబుతున్నారు.

# ముగ్గురు పిల్లలు ఉన్నా పోటీకి అర్హత



**వరంగల్ :** తెలంగాణ పల్లెల్లో స్థానిక సంస్థల ఎన్నికల హడావుడి మెదలైంది. గ్రామాల్లో ఏ నలుగురు ఓ చూట గూమి కూడినా ఎన్నికల గురించే చర్చించుకుంటున్నారు. సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీగా పోటీ చేసేందుకు పలువురు ఆశావాహులు సిద్ధమయ్యారు. నోటిఫికేషన్ ఎప్పుడెప్పుడు వస్తుందా..? అని వారు ఎదురు చూస్తున్నారు. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రచారం కూడా మె?దలుపెట్టారు. కొన్ని గ్రామాల్లో అయితే ప్రత్యేక మేనిఫెస్టోలు, సర్పంచ్ పదవి వేలం పాటలు కూడా నిర్వహిస్తున్నారు. సర్పంచ్, ఎంపీటీసీగా పోటీ చేయాలనుకుంటున్న వారు పల్లెల్లోనే మకాం వేసి ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. గ్రామాల్లో మంచి, చెడులతో సంబంధం లేకుండా ప్రతి కార్యక్రమంలో పాల్గొని ప్రజలతో మమేకమవుతున్నారు. అయితే ప్రస్తుతం ముగ్గురు పిల్లు ఉన్నవారు స్థానిక సంస్థల్లో పోటీ చేయటానికి అవకాశం లేదు. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం.. 1995 తర్వాత ముగ్గురు పిల్లలు ఉంటే స్థానిక సంస్థల్లో పోటీ చేసేందుకు అనర్హులు. ఈ నిబంధన చాలా మంది ఆశావాహుల ఆశలపై నీళ్లు చల్లుతోంది. సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీగా పోటీ చేయాలనుకుంటున్న నాయకుల కు ఇబ్బందిగా మారుతోంది. ఈ నేపథ్యంలో ముగ్గురు పిల్లలు ఉన్నా.. పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం కల్పించడంపై తెలంగాణ ప్రభుత్వం చర్చలు జరుపుతోంది. గ్రామపంచాయతీలను మున్సిపాలిటీలుగా అప్‌గ్రేడ్ చేసేందు కు సైతం ప్రతిపాదనలు పరిశీలిస్తున్నారు. ఈ మేరకు పంచా యతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క అసెంబ్లీలో కీలక ప్రకటన చేశారు.ముగ్గురు పిల్లలు ఉన్నవారికి పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశంపై ప్రభుత్వం ఆలోచన చేస్తోందని చెప్పారు. ఈ నిబంధనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని బుధవారం అసెంబ్లీలో వెల్లడించారు. శాసనమండలిలో మున్సిపాలిటీ, పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లును ఆమోదించారు. గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలుగా మార్చేందుకు కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఈ సందర్భంగా మంత్రి సీతక్క వెల్లడించారు. పట్టణ ప్రణాళిక కోసమే గ్రామాలను విలీనం చేస్తున్నామని చెప్పారు. ప్రజల అభిప్రాయం మేరకు కలెక్టర్లు పంపించిన ప్రతిపాదనల ఆధారంగా గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలుగా మారుస్తున్నామని సీతక్క వెల్లడించారు. పట్టణ ప్రాంతాల్లో విలీనమైన గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం గురించి కూడా ఆమె మాట్లాడారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి బదులుగా వేరే పథకం అమలు చేస్తామని చెప్పారు. దీనిపై ప్రభుత్వం ఆలోచిస్తోందని అన్నారు.కాగా, తెలంగాణలో మె?త్తం 540 మండలాల్లోని 12,966 గ్రామాల్లో సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికలు జరగాల్సి ఉంది. 1,14,620 వార్డులకు తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికలను నిర్వహించనుంది. అందుకు సంబంధించిన జాబితాను పంచాయతీరాజ్ శాఖ ఇప్పటికే ఎస్ఈసీకి సమర్పించింది. గతేడాది ఫిబ్రవరిలో సర్పంచ్‌ల పదవీ కాలం, జులైలో ఎంపీటీసీల పదవీకాలం ముగియగా.. ప్రస్తుతం గ్రామాల్లో ప్రత్యేకాధికారులు పాలనను సాగిస్తున్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఖరారు తర్వాత నోటిఫికేషన్ రిలీజ్ అయ్యే ఛాన్సుంది.

# కరీంనగర్‌లో క్షుద్రపూజల కలకలం



**వరంగల్ :** మంత్రాలకు చింతకాయలు రాలవు అని కొందరు అంటారు కదా.. ఎందుకు రాలవో చూస్తామంటున్నారు కొందరు మాయగాళ్లు. ప్రజలను నమ్మించి, మాటల్తో మాయ చేసి ఓం భీమ్ భుష్ అని మంత్రాలు మాత్రం మారడం లేదు. ప్రస్తుతం అంతరిక్షంలో రాకెట్లు దూసుకెళుతున్నాయి. అరచేతిలోనే ప్రపంచాన్ని చూడగలుగుతున్నారు. సాంకేతిక కొత్త పుంతలు తొక్కుతున్నాయి. కానీ ఇలాంటి మూఢ నమ్మకాలు రాజ్యం ఏలుతున్నాయి. చేతబడి, క్షుద్రపూజల పేరుతో జనాలను భయ భ్రాంతులకు గురిచేస్తున్నారు. తాజాగా జనగామ జిల్లాలో క్షుద్ర పూజలు కలకలం రేపాయి. ఏకంగా యువతి లోదుస్తులు క్షుద్ర పూజలలో కనిపించడంతో ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.పాలకుర్తి గ్రామ శివారు దర్ధపల్లి వాగులో గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్ర పూజలు చేశారు. కోడిని బలిచ్చి, పసుపు, కుంకుమ నిమ్మకాయలతో పూజలు చేసినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. క్షుద్రపూజలు చేసిన స్థలంలో యువతి లోదుస్తులు లభించాయి. యువతికి చేతబడి చేసినట్లుగా స్థానికులు అనుమానిస్తున్నారు.అయితే అర్ధరాత్రి సమయంలో మంత్రాల శబ్దాలు విని కొందరు రైతులు.. ఘటనా స్థలానికి చేరుకున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు. అక్కడ రైతులను చూసి ముగ్గురు వ్యక్తులు పారిపోయినట్లు వారు తెలిపారు. వెంటనే గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించడంతో.. ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. దీని వెనుక ఎవరున్నారు. ఆ ముగ్గులో ఉన్న దుస్తులు ఎవరివి అన్న కోణంలో పరిశీలిస్తున్నారు. ఎవరైనా యువకులు కావాలనే వశీకరణం పేరుతో ఇలాంటి చర్యలకు పాల్పడవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారుఎవరు చేశారో ఎందుకు చేశారో తెలీదు. కానీ రోడ్లపై ఇలా భయంకరమైన పద్ధతిలో పూజలు చేయడం గ్రామాల్లో సంచలనంగా మారింది. స్త్రీ ఆకారంలో ముగ్గ వేయడం.. అందులో ఓ యువతి లో దుస్తులు ఉండటం చూసి స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ సైకో పూజలు చేస్తుంది ఎవరు? చేయిస్తుంది ఎవరు పట్టుకుని జైల్లో వేస్తే.. వీళ్ల పవర్ ఏంటో తెలుస్తుందని ప్రజలు పోలీసులను కోరుతున్నారు.మంత్రాల శబ్ధం వస్తున్న వైపు నెమ్మదిగా.. అడుగుల శబ్దం రాకుండా జాగ్రత్తగా వెళ్తున్నారు. ముందుకు వెళ్తున్నా కొద్దీ మంత్రాలు మరింత గట్టిగా వినిపిస్తున్నాయి. స్టెతస్కోప్ అవసరం లేకుండానే.. వాళ్ల గుండె చప్పుడు వాళ్లకే వినిపించేంతగా భయం పెరుగుతోంది. అయినా సరే.. వెనక్కి వెళ్లకుండా ఈ మంత్రాల సంగతేంటో తెలుసుకోవాలని నిర్ణయించుకుని ముందుకే సాగారు. కాస్త దూరం వెళ్లిన తర్వాత ఓ పొలం దగ్గర.. ముగ్గురు వ్యక్తులు కూర్చుకుని కనిపించారు. వాళ్లు అక్కడ ఏం చేస్తున్నారో తెలుసుకునేం దుకు కాస్త వేగంగా అడుగులు వేసేసరికి.. ఆ అలజడి విన్న ముగ్గురు రైతులను చూశారు. ఇంకేముంది.. అన్నీ అక్కడే వదిలేసి మెరుపు వేగంతో అక్కడి నుంచి పారిపోయారు. వాళ్లను పట్టుకునేందుకు రైతులు కూడా ప్రయత్నించారు కానీ.. ఫలితం లేకపోయిందిఅప్పటివరకు ఆ ముగ్గురు కూర్చు న్న దగ్గరి సన్నివేశం చూసి.. రైతులకు గుండెలు కడుపులోకి జారిపోయాయి. అక్కడ ఆ ముగ్గురు చేసింది.. మీరనుకున్న ట్టుగానే క్షుద్రపూజే. అచ్చంగా పొలిమేర సినిమాలో చేసినట్టు గానే.. పసుపు, కుంకుమ, గులాల్‌తో ముగ్గేసి.. అందులో నిమ్మకాయలు పెట్టి, కోడిని కూడా బలిచ్చారు. అవన్నీ చూసి రైతులు భయపడగా.. అక్కడున్న మరో ఐటమ్ చూసి ఆశ్చర్యం కలిగింది. అదే.. అమ్మాయి లోదుస్తులు. అక్కడ క్షుద్రపూజ చేస్తున్నారు అందులో అమ్మాయికి చెందిన లోదుస్తు లు ఉన్నాయంటే.. వాళ్లు ఎవరో యువతి మీద ఈ బ్లాక్ మ్యాజిక్ ప్రయోగిస్తున్నారని రైతులకు అర్థమైంది.గుండెలు గులాబ్ జాములయ్యే ఈ ఘటన.. జనగామ జిల్లాలోని పాలకుర్తి గ్రామ శివారు దర్ధపల్లి వాగులో చోటుచేసుకుంది. ఈ క్షుద్ర పూజల విషయం గ్రామంలో తెలియటంతో.. గ్రామస్తులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. అసలు ఆ క్షుద్రపూజలు చేసిన ముగ్గురు వ్యక్తులు ఎవరూ..? వాళ్లు ఏ అమ్మాయి మీద బ్లాక్ మ్యాజిక్ చేశారన్నది.. ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.ప్రపంచమంతా విజ్ఞానంతో అంతరిక్షంలోకి వెళు తుంటే.. మన వాళ్లు మాత్రం ఇప్పటికీ పసుపు, కుంకుము, నిమ్మకాయలు, నల్లకోడి, వెంట్రుకలు అంటూ క్షుద్రపూజలు, బ్లాక్ మ్యాజిక్ అంటూ ఇంకా అర్ధరాత్రులు భయపెట్టే విన్యాసాలు చేస్తూనే ఉన్నారు. వాటిని చూస్తూ జనాలు భయపడుతూనే ఉన్నారు. అందులోనూ.. ఈ తాజా ఘటనలో ఓ అమ్మాయికి చెందిన లోదుస్తులతో క్షుద్రపూజలు చేస్తున్నా రంటే.. ఎంతకు దిగజారిపోయారన్నది అర్థం చేసుకోవచ్చు ముగ్గులు, నిమ్మకాయలు వేసి క్షుద్ర పూజలు చేయడం ఇటీవల ఎక్కడ బడితే అక్కడ దర్శనమిస్తున్నాయి. ఇదంతా ఓ పెద్ద మూఢ నమ్మకం అని వివరించనా.. కొంత మంది మాత్రం మూర్ఖంగా వ్యవహరిస్తూ.. ఇలాంటి పూజలు నిర్వహి స్తున్నారు. గుప్త నిధుల కోసం, ప్రత్యర్థులను నాశనం చేయ డం కోసం క్షుద్రపూజలకు పాల్పడుతున్నారు కొందరు మూర్ఖులు.

## పెండింగ్ కేసులపై సమీక్ష సమావేశం నిర్వహించిన పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ



**సిద్దిపేట :** గజ్వేల్ డివిజన్ పోలీస్ అధికారులతో కమిషనర్ కార్యాలయంలో పెండింగ్ ఉన్న కేసులపై సమీక్ష సమావేశం నిర్వహించి 2023, 2024, 2025 అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులలో గ్రేవ్, నాను గ్రేవ్ కేసుల గురించి ఏసిపి. సీఐలను, ఎస్ఐలను పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధఅడిగి తెలుసుకున్నారు.ఎస్ఓపి ప్రకారం కేసుల పరిశోధన ఉండాలి.కేసులలో పరిశోధన పారదర్శకంగా ఉండాలి.ఫిర్యాదుదారుల మర్యాదకు భంగం కలిగించవద్దు,మహిళల రక్షణకు పెద్దపీట వేయాలి.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.ఎస్ఓపి ప్రకారం కేసుల పరిశోధన ఉండాలి,కేసులలో పరిశోధన పారదర్శకంగా ఉండాలి, ఫిర్యాదుదారుల మర్యాదకు భంగం కలిగించవద్దు, మహిళల రక్షణకు పెద్దపీట వేయాలి, ఫోక్సో క్రైమ్ అగ్నెస్ట్ ఉమెన్ కేసులలో నిందితులను వెంటనే అరెస్టు చేసి 60 రోజుల లోపు కేసు పరిశోధన పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలి, సిసిటిఎన్ఎస్ లో కేసులకు సంబంధించిన డేటా ప్రతిరోజు ఎంట్రీ చేయాలి.రోడ్డు ప్రమాదాల నివారణ గురించి స్పీడ్ లేజర్ గన్ తో కేసులు నమోదు చేయాలి, దొంగతనాల కేసులలో అరెస్టు చేసిన నిందితులపై సస్పెక్ట్ షీట్స్ ఓపెన్ చేయాలి,నేను సైతం ద్వారా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలకు జియో టాకింగ్ పూర్తి చేయాలి,క్రికెట్ బెట్టింగ్స్ పై ప్రత్యేకమైన నిఘా ఏర్పాటు చేయాలి.గంజాయి ఇతర మత్తు పదార్థాలను ఉక్కు పాదంతో అణిచివేయాలి.గంజాయి ఇతర మత్తు పదార్థాలను ఉక్కు పాదంతో అణిచివేయాలి.స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ముందస్తు ప్రణాళికలు తయారు చేసుకోవాలి,నేను సైతం సీసీ కెమెరాలను జియో టాకింగ్ చేయాలి,దొంగతనాల నివారణ గురించి ప్రత్యేక చర్యలు చేపట్టాలి, రాత్రి సమయాలలో బ్లూ కోల్ట్స్, పెట్రో కార్ అధికారులు సిబ్బంది నిరంతరంగా విధులు నిర్వహించాలి.డయల్ 100 కాల్ రాగానే వెంటనే రెస్పాండ్ అయి స్వార్థమైనంత త్వరగా సంఘటన స్థలానికి వెళ్లి సమస్యలు పరిష్కరించాలని సూచించారు.డయల్ 100 కాల్స్ పై అలసత్వం వహించవద్దు.సిఈఐఆర్ పోర్టల్ లో ఫోన్లు పోయినట్టు నమోదైన ఫిర్యాదులలో వెంటనే ఫోన్లు రికవరీ చేయాలని సూచించారు.పెండింగ్ ఉన్న దరఖాస్తులను విచారణ చేసి త్వరగా డిస్పోజల్ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో గజ్వేల్ ఏసిపి పురుషోత్తం రెడ్డి, ఇన్స్పెక్టర్లు సీఐలు సైదా, ముత్యం రాజు, లతీఫ్, మహేందర్ రెడ్డి, సిసిఆర్బి ఇన్స్పెక్టర్ రామకృష్ణ, ఐటీ సెల్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ గౌడ్, గజ్వేల్ డివిజన్ ఎస్ఐలు ఏఓ యాదమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగబద్ధమైన బాధ్యతలను విస్మరించిన మాజీ సిఎం కేసీఆర్

**మండిపడ్డ బిజెపి తెలంగాణ రాష్ట్ర ప్రధాన అధికార ప్రతినిధి, మీడియా ఇంచార్జ్ ఎన్.వి.సుభాష్**




**హైదరాబాద్ :** బీఆర్ఎస్ అధినేత, గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావడం లేదని, రాజ్యాంగబద్ధమైన బాధ్యతలను విస్మరించి, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం సరికాదని తెలంగాణ రాష్ట్ర ప్రధాన అధికార ప్రతినిధి ఑ మీడియా ఇంచార్జ్ ఎన్.వి. సుభాష్ మండిపడ్డారు. కె. చంద్రశేఖర్ రావు (కేసీఆర్) దశాబ్ద కాలం అధికారంలో ఉన్నప్పటికీ, అధికారాన్ని కోల్పోయిన తర్వాత శాసనసభ సమావేశాలకు హాజరయ్యే బాధ్యతను పూర్తిగా విస్మరించారని ఆయన ఆరోపించారు. ప్రజల గొంతుకగా ఉండాల్సిన నాయకులు, ప్రజా సమస్యలను చర్చించాల్సిన అసెంబ్లీలో గైర్హాజరు కావడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. అదే విధంగా, హైదరాబాద్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి 100 రోజులుగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) సమావేశాలకు హాజరు కాలేదు, ఇది పరిపాలనా వైఫల్యానికి, ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని అన్నారు. తమ విధులను నిర్వర్తించకుండా జీతాలు, ప్రభుత్వ సదుపాయాలను ఆస్వాదించడం నైతికంగా సరైనదేనా?" అని ఆయన ప్రశ్నించారు."మేయర్ గైర్హాజరు ఎందుకు? తమ వైఫల్యాల గురించి ఎవరైనా ప్రశ్నిస్తారని భయపడుతున్నారా? లేక కార్పొరేటర్ల విమర్శలను ఎదుర్కొనే ధైర్యం లేదా? అని ఎన్.వి. సుభాష్ నిలదీశారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కొందరు మాజీ ముఖ్యమంత్రులు కూడా అధికారం కోల్పోయిన తర్వాత శాసనసభ సమావేశాలకు హాజరుకాలేదని చరిత్ర చెబుతోంది. కానీ, అదే తీరును కేసీఆర్ కొనసాగించడం సమంజసం కాదని భారతీయ జనతా పార్టీ స్పష్టం చేసింది. ప్రజా ధనాన్ని రక్షించాలంటూ బీఆర్ఎస్ నాయకులు పెద్ద పెద్ద ఉపన్యాసాలు ఇస్తారు. కానీ, ఆ మాటలను ఆచరణలో చూపించాలంటూ ఎన్.వి. సుభాష్ వ్యాఖ్యానించారు.తమ బాధ్యతలను విస్మరించి, ప్రజాధనాన్ని దుర్వినియోగపరుస్తున్న గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్, హైదరాబాద్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తక్షణమే తమ జీతాలు తిరిగి ఇవ్వడంతో పాటు ఇతర ప్రభుత్వ సదుపాయాలను వదులుకోవాలి.. లేకుంటే తమ పదవులకు రాజీనామా చేయాలని ఎన్.వి. సుభాష్ డిమాండ్ చేశారు.

## భద్రాచలం కొత్త డిజైన్స్ రెడీ...

**ఖమ్మం :** భద్రాచలం ఆలయ నూతన డిజైన్లు విడుదల అయ్యాయి. ఈ డిజైన్లు ఆకట్టుకునేలా ఉన్నాయని భక్తులు అంటున్నారు. భద్రాచలం దేవస్థానం అభివృద్ధికి గత బీఆర్ఎస్ సర్కార్ మాస్టర్ ప్లాన్ రూపొందించింది. ఆనంద్‌సాయి కొన్ని డిజైన్లను రూపొందించారు. ఆలయ అభివృద్ధిపై ఈ కొత్త డిజైన్లను ప్రభుత్వం విడుదల చేసింది.మాడ వీధుల విస్తరణ, ఇతర పనులకు ప్రభుత్వం రూ.60 కోట్లను మంజూరు చేసింది. మాడ వీధుల విస్తరణలో భాగంగా ఇళ్లు, భూములను కోల్పోతున్న వారిని రెవెన్యూ, దేవస్థానం అధికారులు గుర్తించగా.. 45 మందికి రూ.34 కోట్లు పరిహారం అందించాల్సి ఉంది.సీతారాముల కల్యాణోత్సవ ఆహ్వాన పత్రికను అధికారులు హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా భూసేకరణ, సర్వే వివరాల గురించి సీఎం రేవంత్ ఆరా తీశారు. నష్టపరిహారం విడుదల కావాల్సి ఉందని మంత్రి తుమ్మల చెప్పారు. ఇటీవల భద్రాచలం పర్యటనకు వచ్చిన మంత్రి పొంగులేటి సైతం.. రెండు, మూడు రోజుల్లో భూ నిర్వాసితుల పరిహారం అందుతుందని ప్రకటించారు. మంగళవారం రూ.34 కోట్లు విడుదల చేయగా.. ఏళ్ల తరబడి స్థానికులు, భక్తులు ఎదురుచూస్తున్న భద్రగిరి అభివృద్ధికి తొలి అడుగు పడినట్లయింది. ఈ మేరకు

## ఈ చిట్కాలను పాటిస్తే మీ కళ్లకు ధోకా ఉండదు.. కంటి చూపు మెరుగు పడుతుంది..!



మనం ఆరోగ్యంగా ఉండాలంటే అన్ని రకాల పోషకాలు కలిగిన ఆహారాలను తీసుకోవాలి. అప్పుడే ఎలాంటి పోషకాహార లోపం రాకుండా ఉంటుంది. అన్ని అవయవాలు సక్రమంగా పనిచేస్తాయి. కానీ నేటి డిజిటల్ యుగంలో చాలా మంది కంటి చూపు సమస్య బారిన పడుతున్నారు. చిన్న వయస్సులో ఉన్నవారు కూడా కళ్లద్దాలను వాడుతున్నారు. పోషకాహార లోపం వల్లే ఈ సమస్య వస్తుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. కనుక కంటి చూపును మెరుగు పరిచే పోషకాహారాలను తినాల్సి ఉంటుంది. వాటిల్లో బ్రొకలి మొదటి స్థానంలో ఉంటుందని చెప్పవచ్చు. అలాగే కాలిఫ్లవర్, జామ పండ్లు, ఉసిరికాయలు, క్యారెట్లు వంటి ఆహారాల్లోనూ పోషకాలు అధికంగా ఉంటాయి. ఈ ఆహారాల్లో విటమిన్లు ఎ, సి, కెరోటిన్, లుటీన్ అనే పోషకాలు ఉంటాయి. ఇవి కంటి చూపును మెరుగు పరుస్తాయి. డిజిటల్ తెరలను చూడడంతోపాటు రోజంతా బయట ఎండలో తిరిగే వారి కళ్లు త్వరగా పొడిబారి పోతుంటాయి. దీంతో కళ్లు ఎరుపెక్కి దురదలు వస్తాయి. కళ్లు మంటలుగా కూడా ఉంటాయి. అలాంటి వారు కళ్లతో వస్తువులను సరిగ్గా చూసేందుకు కూడా కొన్ని సార్లు ఇబ్బంది పడుతుంటారు. అయితే ఈ సమస్యలు ఉన్నవారు నీళ్లను అధికంగా తాగాలి. రోజుకు కనీసం 6 నుంచి 8 గ్లాసుల నీళ్లను తాగితే శరీరంలోని ద్రవాలు సమతుల్యంలో ఉంటాయి. దీంతో కళ్లు పొడిబారకుండా చూసుకోవచ్చు. ఇక చాలా మంది నిత్యం ఏసీల్లో గడుపుతుంటారు. ఆఫీసుల్లో పనిచేస్తుంటారు కనుక ఏసీల్లో ఉంటారు. దీంతో అక్కడి వాతావరణం పొడిగా మారుతుంది. దీని వల్ల కూడా కళ్లు పొడిబారుతాయి. కనుక ఏసీల్లో ఎక్కువగా గడిపే వారు ఆ సమయాన్ని కాస్త తగ్గించుకుంటే మంచిది. లేదంటే దీర్ఘకాలికంగా కంటి చూపు విషయంలో సమస్యలు వచ్చే అవకాశాలు ఉంటాయి.

**ఏసీల్లో ఉండేవారు..**

అయితే ఏసీల్లో కచ్చితంగా ఉండాల్సిందే అనుకునే వారు రూమ్‌లో హ్యుమిడిఫైర్‌ను పెట్టుకోవాలి. ఇది వాతావరణంలో తేమను అలాగే ఉంచుతుంది. దీంతో కళ్లపై ప్రభావం పడదు. కళ్లు పొడిబారకుండా ఉంటాయి. ఇక కొందరు కళ్లు దురదగా ఉంటే తరచూ నలుపుతుంటారు. దీని వల్ల కళ్లపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఇలాంటి సమస్య ఉన్నవారు తమకు సమీపంలో ఉన్న కళ్ల డాక్టర్‌ను సంప్రదించాలి. దీంతో వారు కళ్ల డ్రాప్స్ ఇస్తారు. వాటిని వాడితే ఈ సమస్య నుంచి బయట పడవచ్చు. అంతేకానీ కళ్లను నలపకూడదు. అలాగే దుమ్ము, ధూళి వాతావరణంలో ఉండే వారు, ద్విచక్ర వాహనాలపై ఎక్కువగా తిరిగే వారు కచ్చితంగా కళ్లకు రక్షణగా గ్లాసెస్‌ను ధరించాలి. వాహనాలపై వెళితే హెల్మెట్ ధరించాలి. దీని వల్ల కళ్లు కూడా సురక్షితంగా ఉంటాయి.

**20- 20-20 రూల్ పాటించాలి..**

మీరు రోజూ కంప్యూటర్లు, ఫోన్లను ఎక్కువగా వాడేవారు అయితే వాటి వాడకాన్ని వీలైనంత వరకు తగ్గించాలి. ఇలా చేస్తే కళ్లపై పడే అధిక భారం, ఒత్తిడి తగ్గుతాయి. కళ్లు రిలాక్స్ అవుతాయి. అలాగే కంప్యూటర్లపై ఎక్కువగా పనిచేసేవారు అదే పనిగా తెరను చూడకూడదు. 20 నిమిషాలకు ఒకసారి 20 సెకన్ల పాటు 20 అడుగుల దూరంలో ఉన్న ఏదైనా వస్తువును చూడాలి. ఇలా 20-20-20 రూల్‌ను పాటించాలి. దీంతో కళ్లు సురక్షితంగా ఉంటాయి. కంటి చూపు సమస్యలు రావు. ఇలా పలు సూచనలను పాటించడం వల్ల మీ కళ్లు ఎల్లప్పుడూ ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే కంటి చూపు సమస్యలు తలెత్తవు.

## శనగలు, బెల్లం కలిపి తింటే శరీరంలో ఏం జరుగుతుందంటే



శనగలు బెల్లం.. కలిపి తింటే ఏమౌతుందో తెలియకుండానే మనం తరచూ తింటూనే ఉంటాం.. కానీ, ఇలాంటి ఫుడ్ కాంబినేషన్‌లో అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు దాగివున్నాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. వేయించిన శనగలు, బెల్లం కలిపి తినటం వల్ల శరీరానికి కావాల్సిన పోషక విలువ ఎన్ని ఉన్నాయో తెలిస్తే నిజంగా ఆశ్చర్యపోతారు. ప్రతి ఇంట్లోనూ బెల్లం, శనగలు తప్పనిసరిగా ఉండే ఆహార పదార్థాలు. బెల్లం, శనగలను కలిపినపుడు అది విటమిన్లు, ఖనిజాలతో నిండిన మంచి పౌష్టికాహారం అవుతుంది. వేయించిన శనగల్లో ప్రోటీన్స్ పుష్కలంగా ఉంటాయి. బెల్లం యాంటీ యాక్సిడెంట్లతో నిండి ఉంటుంది. బెల్లంలో జింక్, సెలీనియంలు ఎక్కువగా ఉంటాయి. వేయించిన శనగలు విటమిన్ బి6, విటమిన్ సి, ఫోలేట్, నియాసిన్, థియామిన్, రిబోఫ్లేవిన్, మాంగనీస్, ఐరన్ ఇలా ఎన్నో విటమిన్స్ ఉంటాయి. రక్తహీనత లేదా కడుపు సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారిని శనగలు, బెల్లం కలిపి తినాలని నిపుణులు చెబుతున్నారు. పప్పులో ఫైబర్ పుష్కలంగా ఉన్నప్పటికీ, ఇందులో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. రెండింటినీ కలిపి తినడం మంచిది. ఇది శరీరంలోని ప్రతి బలహీనతను తొలగిస్తుంది. జీవక్రియను మెరుగుపరుస్తుంది. బెల్లం, వేయించిన శనగలు రెండూ జింక్‌తో నిండి ఉంటాయి, ఇది శరీరంలో 300 ఎంజైమ్‌లను యాక్టివేట్ చేస్తుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుంది. శ్వాస సంబంధిత సమస్యలతో బాధపడేవారికి ఈ రెండు కలిపి తింటే మంచిది. వారు పడుకునే ముందు రాత్రి కొంచెం వేపిన శనగలు, బెల్లంలను పాలతో కలిపి తీసుకోవాలి. ఇది మీ ఊపిరితిత్తులను శుభ్రం చేయడానికి మరియు కాలుష్య సంబంధిత వ్యాధుల నుండి త్వరగా కోలుకోవడానికి సహాయపడుతుంది. బెల్లంలోని ఐరన్, శనగల్లోని ప్రోటీన్, రుతుస్రావం సమయంలో స్త్రీ రక్తం కోల్పోడానికి, తమను తాము తిరిగి శక్తివంతం చేసుకోవడానికి ఈ పోషకాలు రెండూ ముఖ్యమైనవి. దీనిలో ఉన్న పొటాషియం వాళ్ళ స్ట్రోక్, గుండెపోటు వంటి కార్డియాక్ సిస్టమ్ కు సంబంధించిన సమస్యలు రాకుండా సాయపడుతుంది. బరువు తగ్గాలనుకునే వారికి ఈ ఫుడ్ బెస్ట్ ఆప్షన్. బెల్లం,శనగలు కలిపి తినడం వల్ల మీ జీవక్రియను పెంచుతుంది. ఉబకాయంతో బాధపడేవారిలో బరువు తగ్గడానికి సాయపడుతుంది.

## నిద్రలో గురక పెడుతున్నారా..? ఈ చిట్కాలతో చెక్ పెట్టేయండి!



గురక చాలా సాధారణమైన సమస్య. ఇది బాధితున్నే కాకుండా ఇతరుల్ని కూడా ఇబ్బంది పెట్టే సమస్య. నిద్రలో గాలి పీల్చుకొంటున్నప్పుడు కొండనాలుకతో పాటు అంగిటిలోని మెత్తని భాగం కూడా అధిక ప్రకంపనలకు లోనైనప్పుడు గురక వస్తుంది. కొందరిలో ఇవి గాలి మార్గాలను పూర్తిగా లేదా అసంపూర్తిగా మూసివేసి నిద్రలేమికి కారణం అవుతుంది. గురకను చాలామంది పట్టించుకోరు. చూసేందుకు సాధారణంగా కనిపించే సమస్యే అయినా.. పక్కనున్న వారిని తీవ్రంగా ఇబ్బందులకు గురి చేస్తుంది. దాంతో వారంతా నిద్రపోయేందుకు ఇబ్బందిపడుతుంటారు. కానీ, వాస్తవానికి గురక అనేది తీవ్రమైన వైద్య సమస్య. ఇది అబ్‌స్ట్రక్టివ్ స్లీప్ అప్నియాకు సంకేతమని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. చాలా సందర్భాల్లో ఈ సమస్య అకాల మరణాలకు దారి తీస్తుంది. అమెరికన్ అకాడమీ ఆఫ్ స్లీప్ మెడిసిన్ ప్రకారం.. అబ్‌స్ట్రక్టివ్ స్లీప్ అప్నియా హైబీపీ, గుండెజబ్బులు, స్ట్రోక్, టైప్-2 డయాబెటిస్, డిప్రెషన్‌తో పాటు ముందస్తు మరణాలకు దారి తీస్తుంది. %ఔవఎవీణ% ప్రకారం.. ఎవరైనా పగటిపూట అధికంగా నిద్రపోయినా.. తరుచుగా లేదంటే.. భారీగా గురకపెడుతున్నట్లుగా గుర్తిస్తే.. వైద్య సహాయం అవసరం. ఎందుకంటే ఈ దశ గురక మిమ్మల్ని ప్రాణాంతక వ్యాధుల ప్రమాదంలో పడేస్తుంది. గురకను నివారించేందుకు పలు చిట్కాలున్నాయి. వీటితో సమస్యను నివారించుకోవచ్చు. వెనుకకు తిరిగి పడుకోవడం వల్ల నాలుక, గొంతులోని ఇతర కణజాలాల ద్వారా వాయుమార్గం అడ్డుకుంటుంది. కాబట్టి, పక్కకి తిరిగి పడుకోవడానికి ప్రయత్నించండి. ఇది శ్వాస ప్రక్రియను సులభతరం చేస్తుంది. ఫలితంగా గురక తగ్గుతుంది. రాత్రి పడుకునే ముందు భారీ భోజనం తినడం.. మద్యం సేవించడం వల్ల గొంతు కండరాలు సడలించబడతాయి. ఇది కూడా గురకకు కారణమవుతుంది. కాబట్టి నిద్రపోవడానికి కనీసం 3 గంటల ముందు భోజనం పూర్తి చేసుకోవడం మంచిది. ఇక మద్యానికి దూరంగా ఉండడం ఇంకా బెటర్. ఇక ధూమపానం గొంతు, శ్వాసనాళంలో వాపునకు కారణమవుతుంది. దాంతో గురకకు కారణమవుతుంది. అలాంటి పరిస్థితిలో.. ధూమపానం మానేయడం వల్ల గురక సమస్య తగ్గడమే కాకుండా మీ ఆరోగ్యానికి కూడా చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. అధిక బరువు ఉన్నవారు కూడా గురక పెట్టే అవకాశం ఉంది. అలాంటి పరిస్థితిలో బరువు తగ్గడం వల్ల వాయుమార్గాలపై కొవ్వు ఒత్తిడి తగ్గుతుంది. శ్వాస తీసుకోవడం సులభం అవుతుంది.

## ప్రోటీన్ లోపంవల్ల తలెత్తే 6 అనారోగ్య సమస్యలు?




శరీరంలో సరైన మొత్తంలో ప్రోటీన్ చాలా అవసరం. అయితే, చాలా మంది ఆహారం ద్వారా తమ శరీరానికి కావాల్సినంత రోజువారీ ప్రోటీన్ ను పొందలేకపోతున్నారు. దీని కారణంగా, శరీరంలో అనేక రకాల సమస్యలు సంభవిస్తాయి. ఆరోగ్యకరమైన కండరాలు, కణాల కోసం ప్రోటీన్ ఎంతగానో ఉపయోగపడుతుంది. దీని లోపం వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు వస్తాయనేది ఇప్పుడు తెలుసుకుందాం..

ఆరోగ్యంగా ఉండటానికి, ప్రతిరోజూ సరైన మొత్తంలో ప్రోటీన్ తీసుకోవడం చాలా ముఖ్యం.

**ప్రోటీన్ లోపం వల్ల కండరాలు బలహీనపడతాయి..**

అనేక జంతు, మొక్కల ఆధారిత ఉత్పత్తులు ప్రోటీన్ అద్భుతమైన వనరులు.

ప్రోటీన్ మన శరీరానికి అవసరమైన పోషకం, ఇది కండరాలు, ఎముకలు, చర్మం, జుట్టు, కణాల నిర్మాణంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఇది ఎంజైములు, హార్మోన్లు ఇతర శరీర విధులకు కూడా ఎంతో అవసరం. ప్రోటీన్ లోపం వల్ల శరీరంలో అనేక సమస్యలు వస్తాయి. అందువల్ల, ప్రతిరోజూ మీ ఆహారంలో సరైన మొత్తంలో ప్రోటీన్‌ను చేర్చుకోవాలి. తగినంత ప్రోటీన్ పొందలేక పోతే ప్రోటీన్ లోపం ఏర్పడుతుంది. తద్వారా పలురకాల అనారోగ్య సమస్యలను కలిగిస్తుంది.

**కండరాల బలహీనత, నొప్పి..**

కండరాలను నిర్మించడానికి, మరమ్మత్తు చేయడానికి ప్రోటీన్ చాలా అవసరం. దీని లోపం వల్ల కండరాలు బలహీనంగా మారతాయి, ఇది శారీరక అలసట, నొప్పి వంటి సమస్యలను కలిగిస్తుంది. తరచుగా అనారోగ్యానికి

**గురికావడం**

రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి ప్రోటీన్ సహాయపడుతుంది. దాని లోపం కారణంగా, శరీరంలో వ్యాధులతో పోరాడే సామర్థ్యం బలహీనపడుతుంది, దీని కారణంగా మళ్లీ మళ్లీ అనారోగ్యానికి గురవ్వాల్సివస్తుంది.

**జుట్టు రాలడం,చర్మ సమస్యలు..**

ప్రోటీన్ లోపం వల్ల జుట్టు రాలడం, పొడిబారడం, బలహీనమైన గోర్లు సర్వసాధారణం. చర్మంపై దద్దుర్లు, వాపు , గాయం మానడంలో ఆలస్యం కూడా దాని లక్షణాలు కావచ్చు.


## బిజినెస్

## కేవైసీ నిబంధనలు.. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు ఆర్బీఐ భారీ ఫైన్




దేశంలో అతిపెద్ద ప్రైవేట్ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా షాక్ ఇచ్చింది. నిబంధనలు పాటించని కారణంగా భారీ ఫైన్ వేసింది. ఈ మేరకు ఆర్బీఐ అధికారిక ప్రకటన విడుదల చేసింది. కేవైసీకి సంబంధించి 2016లో ఆర్బీఐ జారీ చేసిన మార్గదర్శకాలను పాటించని కారణంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుకు రూ.75 లక్షల జరిమానా విధించినట్లు ప్రకటనలో వెల్లడించింది. 2023 మార్చి 31న బ్యాంకులో నిర్వహించిన పరిశీలనలో లోపాలను గుర్తించినట్లు పేర్కొంది. కస్టమర్లను రిస్క్‌ల వారీగా విభజించకపోవడం, యునిక్ కస్టమర్ కోడ్ జారీ చేయాల్సిన చోట ఒకే ఐడెంటిఫికేషన్ కోడ్‌ను పలువురికి కేటాయించడం వంటి లోపాలను తాము గుర్తించినట్లు ఆర్బీఐ తెలిపింది.

## సరికొత్త రాయల్ ఎన్‌ఫీల్డ్ క్లాసిక్ 650 ఇదే ధర ఎంతో తెలుసా?



రాయల్ ఎన్‌ఫీల్డ్ కంపెనీ ఎట్టకేలకు తన క్లాసిక్ 650 బైకును లాంచ్ చేసింది. దీని ధరలు రూ.3.37 లక్షల నుంచి రూ.3.50 లక్షల (ఎక్స్ షోరూమ్) మధ్య ఉన్నాయి. ఈ బైక్ కోసం బుకింగ్స్ ప్రారంభమయ్యాయి. డెలివరీలు 2025 ఏప్రిల్ నుంచి మొదలవుతాయి. మొత్తం నాలుగు రంగులలో లభించే.. కొత్త రాయల్ ఎన్‌ఫీల్డ్ క్లాసిక్ 650 బైక్ 648 సీసీ ఇంజిన్ ద్వారా 47 హార్స్ పవర్, 52.3 న్యూటన్ మీటర్ టార్క్ అందిస్తుంది. చూడటానికి స్టాండర్డ్ మోడల్ కంటే భిన్నంగా ఉండే ఈ బైక్.. కొంత షాట్‌గన్ బైకును తలపిస్తుంది. ఫ్యూయెల్ ట్యాంక్ కెపాసిటీ 14.7 లీటర్లు. ఈ బైక్ బరువు 243 కేజీలు. కొత్త రాయల్ ఎన్‌ఫీల్డ్ క్లాసిక్ 650 బైక్.. సాధారణ 350 సీసీ బైకులోని ఫీచర్స్ కాకుండా, ట్రిప్పర్ నావిగేషన్ పాడ్‌తో పాటు డిజి-అనలాగ్ డిస్‌ప్లే పొందుతుంది. %ఖుదీ% ఛార్జర్ కూడా లభిస్తుంది. స్లిప్ అండ్ అసిస్ట్ క్లచ్ ఫీచర్ క్లాసిక్ 650లో ఉంటుంది. అంతే కాకుండా 2025 క్లాసిక్ 650 బైక్ 19/18 ఇంచెస్ ట్యూబ్డ్ వైర్-స్పోక్ వీల్స్ పొందుతుంది.ఖ


# హురున్ గ్లోబల్ రిచ్ లిస్ట్ టాప్-10లో అంబానీకి దక్కని చోటు

2025 ఎ హురున్ గ్లోబల్ రిచ్ లిస్ట్-2025 టాప్-10 సంపన్నుల జాబితాలో ప్రముఖ పారిశ్రామికవేత్త ముఖేశ్ అబానీ స్థానం కోల్పోయారు. గత సంవత్సరంతో పోలిస్తే పెరిగిన అప్పుల కారణంగా అంబానీ సంపద రూ.లక్ష కోట్లు తగ్గింది. దాంతో ఆయన టాప్-10 నిష్క్రమించగా.. ఆసియాలో అత్యంత సంపన్నుడిగా తన స్థానాన్ని ఆయన నిలబెట్టుకున్నారు. ఈ జాబితాలో టెస్లా సీఈవో ఎలాన్ మస్క్ అత్యంత సంపన్నుడిగా కొనసాగుతున్నారు. ఆయన మొత్తం సంపద ఊహించని విధంగా 82శాతం పెరిగి.. 420 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ఇక 266 బిలియన్ డాలర్ల సంపదతో అమెజాన్ అధిపతి జెఫ్ బెజోస్ రెండోస్థానంలో ఉన్నారు. 242 బిలియన్ డాలర్లతో మెటా సీఈవో జుకర్‌బర్గ్ మూడో స్థానంలో ఉన్నారు. మరో వైపు రూ.3.5లక్షల కోట్ల సంపదతో హెచ్‌సీఎల్‌కు చెందిన రోష్ని నాడార్.. టాప్-10 సంపన్న మహిళల జాబితాలో చోటు దక్కించుకున్నారు. ఆమె తండ్రి శివ్ నాడార్ ఇటీవల హెచ్‌ఎస్‌ఎల్ 47శాతం వాటాను ఆమె పేరిట బదిలీ చేయడంతో ఐదో స్థానానికి చేరుకున్నారు. టాప్-10 జాబితాలో చోటు కోల్పోయిన ముఖేశ్ అంబానీ.. ఆసియాలో సంపన్నుడిగా కొనసాగుతున్నారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ ఇంధన, రిటైల్ వ్యాపారాలతో ఇబ్బందిపడుతున్నది. నష్టాల నేపథ్యంలో రిలయన్స్ గ్రూప్ చైర్మన్ సంపద తగ్గింది. అలాగే, హురున్ జాబితాలో భారత్‌లో అంబానీ కుటుంబం తొలి స్థానంలో నిలిచింది. సంపద 13 శాతం తగ్గినా.. రూ.8.6 లక్షల కోట్లుగా ఉన్నది. ఆ తర్వాత గౌతమ్ అదానీ కుటుంబం రెండో స్థానంలో నిలిచింది. గత సంవత్సరంలో అదానీ నిరకర విలువ దాదాపుగా రూ.లక్ష కోట్లు పెరిగింది. ప్రస్తుతం అదానీ కుటుంబం ఆస్తులు రూ.8.4లక్షల కోట్లు. రోష్ని నాడార్ కుటుంబం (రూ.3.5లక్షల కోట్లు), సన్ ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీస్‌కు చెంది దిలీప్ సంఘ్వీ కుటుంబం రూ.2.5 లక్షల కోట్లుగా ఉన్నది. ఆయన సంపద 21శాతం పెరగడంతో ఈ జాబితాలో ఐదోస్థానంలో నిలిచారు. అజీమ్ ప్రేమ్‌జీ కుటుంబం (రూ.2.2 లక్షల కోట్లు), కుమార మంగళం బిర్లా కుటుంబం (రూ.2.0లక్షల కోట్లు) ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నారు. సైరస్ పూనావాలా కుటుంబం (రూ.2లక్షల కోట్లు), నీరజ్ బజాజ్ ఫ్యామిలీ (రూ.1.6 లక్షల కోట్లు), రవి జైపురియా కుటుంబం (రూ.1.4 లక్షల కోట్లు) , రాధా కిషన్ దమానీ కుటుంబం (రూ.1.4లక్షల కోట్లు)తో టాప్-10లో చోటు దక్కించుకున్నారు. గత సంవత్సరంలో పోలిస్తే బిలియనీర్ల సంఖ్య పెరిగి 284కు చేరింది. గతంలో బిలియనీర్ల జాబితాలో ఉన్న 27 మంది సంపద కోల్పోయినా.. మొత్తం సంపన్నుల సంఖ్య పెరగడం విశేషం. వీరి వద్ద మొత్తం ఉన్న సంపద రూ.98లక్షల కోట్లు. 90 మంది బిలియనీర్లతో ముంబయి అగ్రస్థానంలో కొనసాతున్నది. 'బిలియనీర్స్ క్యాపిటల్ ఆఫ్ ఆసియా' టైటిల్‌ని ముంబయి కోల్పోగా.. చైనాలో షాంఘై నగరం దక్కించుకున్నది.



# మూడో కంటికి చిక్కని 'సిగ్నల్'

వాట్సాప్ మాదిరిగానే.. అమెరికాలో 'సిగ్నల్' అనే మెసేజింగ్ యాప్‌ను చాటింగ్ చేయడానికి ఉపయోగిస్తారు. తాజాగా ఈ యాప్ నుంచే యెమెన్ వైమానిక దాడులకు సంబంధించిన ప్రణాళికలు బయటకు పొక్కాయి. ఈ నేపథ్యంలో ఈ యాప్ కోసం ఆరా తీసేవాళ్లు పెరిగిపోయారు. ఇంతకీ ఈ యాప్ ఏమిటి?, దీనిని ఎవరు ప్రారంభించారు?.. అమెరికా అధ్యక్ష భవనం సిబ్బంది ఈ యాప్‌ను వినియోగించడానికి ఏమైనా ప్రత్యేకత ఉందా?.. వివరాల్లోకి వెళ్తే.. సిగ్నల్ అనేది మెసేజింగ్ యాప్. దీనిని 'మోక్సీ మార్లిన్‌స్పైక్' రూపొందించారు. సిగ్నల్ యాప్ ద్వారా టెక్ట్స్ మెసేజస్, ఫోటోలు, రికార్డ్స్ వంటివి షేర్ చేసుకోవచ్చు. వాట్సాప్ తరహాలోనే మెసేజ్ పంపిన వారు, రిసీవ్ సీగేసుకున్న వారు మాత్రమే సందేశాలను చూడగలరు. ఒక నిర్ణీత సమయం తరువాత సమాచారం కనిపించకుండా చేసే ఆప్షన్ కూడా ఇందులో ఉంది. మూడో మనిషి చూడటానికి అవకాశం లేదు. అయితే.. సిగ్నల్‌కు వాట్సాప్ కంటే అత్యంత సురక్షితమైనదనే ప్రచారం ఉంది. సురక్షితమైన యాప్ కావడంవల్లే అమెరికాలోని ఫెడరల్ అధికారులు, వైట్‌హౌజ్ సిబ్బంది దీనిని ఉపయోగిస్తుంటారు. సిగ్నల్ మెసేజింగ్ యాప్‌ను ప్రపంచవ్యాప్తంగా.. ఏడు కోట్లమంది ఉపయోగిస్తున్నట్లు(ఇప్పటిదాకా డౌన్‌లోడ్లు) గణాంకాలు చెబుతున్నాయి. దీనిని ఎక్కువ మంది ఉపయోగించడానికి ప్రధాన కారణం.. ఇది సాధారణ వాట్సాప్, మెటా మెసెంజర్ కంటే కూడా సురక్షితమైనది కావడమనే ముద్రపడిపోవడం.




### లీక్ ఇలా..

యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదారులపై.. దాడికి సంబంధించిన వ్యూహాలను రహస్యంగా 'సిగ్నల్' యాప్ గ్రూప్‌చాట్‌లో చర్చిస్తూ 'జెఫ్రీ గోల్డ్‌బర్గ్' అనే సీనియర్ పాత్రికేయుడిని ఆ గ్రూప్‌లో చేర్చుకున్నారు. ఆ తరువాత కీలక సమాచారం లీక్ అయ్యి రచ్చ రాజేసింది.

# వరల్డ్ కప్ విజేతలకు రికార్డు ప్రైజ్‌మనీ.. 1,000 కోట్లు ఇవ్వనున్న ఫిఫా!




అంతర్జాతీయ ఫుట్‌బాల్ సమాఖ్య(ఫిఫా) కీలక నిర్ణయం తీసుకుంది. త్వరలో జరుగబోయే క్లబ్ వరల్డ్ కప్ టోర్నమెంట్‌ను దృష్టిలో పెట్టుకొని రికార్డు ప్రైజ్‌మనీ ప్రకటించింది. టైటిల్ పోరులో గెలుపొందిన జట్టుకు 125 మిలియన్ డాలర్లు(రూ.1000 కోట్లకు పైగా) నగదు బహుమతి ఇవ్వనున్నట్టు తెలిపింది ఫిఫా. ఈ విషయాన్ని గురువారం అధ్యక్షుడు గియన్ని ఇన్‌ఫాంటినో అధికారికంగా వెల్లడించాడు. ఫిఫా వరల్డ్ కప్ విన్నర్‌కు ఇచ్చే మొత్తంతో పోల్చితే ఇది దాదాపు 10 రెట్లు అధికం కావడం విశేషం. ఈ మెగా ఈవెంట్ ద్వారా వచ్చే రూ.84వేల కోట్ల ఆదాయాన్నిపాల్గొనే అన్ని జట్లకు పంపిణీ చేస్తామని ఇన్‌ఫాంటినో తెలిపాడు. అంతేకాదు ఇకపై ప్రతి నాలుగేళ్లకు ఓసారి క్లబ్ వరల్డ్ కప్ నిర్వహిస్తామని వెల్లడించాడు. 'అమెరికా వేదికగా జూన్‌లో క్లబ్ వరల్డ్ కప్ జరుగనుంది. ఈ నేపథ్యంలో అన్ని ఫుట్‌బాల్ క్లబ్స్‌కు ఆర్థికంగా చేయూతనిచ్చేలా కీలక నిర్ణయం తీసుకున్నాం. ఈ టోర్నీ సందర్భంగా ప్రకటనలు, ఫండింగ్ రూపంలో సమకూరే ఆదాయాన్ని పోటీ పడిన 32 క్లబ్స్‌కు సమంగా పంచుతాం. అంతేకాదు విజేతలకు రికార్డు స్థాయిలో 125 మిలియన్ డాలర్లు అంటే.. రూ.1000 కోట్లకు పైగా నగదు బహుమతి అందజేయనున్నాం' అని గియనీ ఇన్‌ఫాంటినో ఓ ప్రకటనలో వివరించాడు. లియోనల్ మెస్సీ, కిలియన్ ఎంబాపే, క్రిస్టియానో రొనాల్డో వంటి స్టార్ ఆటగాళ్లు తమ క్లబ్స్ తరపున ఈ టోర్నీలో పాల్గొననున్నారు.

### 11 నగరాల్లో

ఈ ఏడాది జూన్ 15న ఫిఫా క్లబ్ వరల్డ్ కప్ ప్రారంభం కానుంది. అమెరికాలోని 11 నగరాల్లోని స్టేడియాల్లో మ్యాచ్‌లు అభిమానులను అలరించనున్నాయి. నెలరోజుల పాటు జరిగే ఈ మెగా టోర్నీ ఫైనల్ మ్యాచ్ జూలై 15న జరుగనుంది. ఫిఫా వరల్డ్ కప్ మాదిరిగానే ఇకపై ప్రతి నాలుగేళ్లకు ఓసారి క్లబ్ వరల్డ్ కప్ నిర్వహించేందుకు ఫిఫా సన్నాహకాలు చేస్తోంది. అంతేకాదు ఈ టోర్నీలో మరిన్ని దేశాల క్లబ్స్‌ను భాగస్వామ్యం చేయాలని ఫిఫా భావిస్తోంది. జాతి వివక్షకు తావు లేకుండా అన్ని వర్గాల క్రీడాకారులను క్లబ్స్ వరల్డ్ కప్‌లో ఆడేలా చూడడమే తమ ఉద్దేశమని ఫిఫా అధ్యక్షుడు తెలిపాడు.

## గంభీర్‌కు షాక్.. టీమిండియా సహాయ సిబ్బందిపై వేటు..!



ఇండియన్ ప్రీమియర్ లీగ్ 18వ సీజన్ ముగియగానే ఇంగ్లండ్ పర్యటనలో ఐదు టెస్టుల సిరీస్ ఆడనుంది టీమిండియా. ఈ నేపథ్యంలో భారత క్రికెట్ బోర్డు కీలక నిర్ణయం తీసుకోనుంది. టీమిండియా సహాయక సిబ్బందిని కుదించాలనే ఆలోచనలో ఉన్నట్టు సమాచారం. హెడ్‌కోచ్ గౌతం గంభీర్‌తో పాటు అసిస్టెంట్ కోచ్ అభిషేక్ నాయర్, ఫీల్డింగ్ కోచ్ టి. దిలీప్ కుమార్‌లను తొలగించేందుకు మొగ్గు చూపుతోందని బీసీసీఐ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం భారత జట్టుకు హెడ్‌కోచ్ గౌతం గంభీర్.. అతడికి సహాయకంగా అభిషేక్ నాయర్, ఫీల్డింగ్ నైపుణ్యాలు పెంపొందించేందుకు టి. దిలీప్ కుమార్.. బౌలింగ్ కోచ్‌గా మొర్నీ మోర్కెల్ సేవలందిస్తున్నారు. అయితే.. టీమిండియాకు కోచింగ్ సిబ్బందిలో ఇంతమంది అవసరం లేదని బీసీసీఐ భావిస్తోంది. దాంతో, ఒకరిద్దరిని తప్పించేందుకు సన్నాహకా లు చేస్తుంది. ఇదే విషయమై చర్చించేందుకు కోచ్ గంభీర్, చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌తో బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా సమావేశం కానున్నారు. ఈ మీటింగ్ అనంతరం సిబ్బంది కోతపై నిర్ణయం వెలువడనుందనే వార్తలు వినిపిస్తున్నాయి.

## స్పోర్ట్స్

## 300 సాధ్యమే.. లక్నో బ్యాటింగ్ ఆర్డర్ కూడా ప్రమాదకరమైందే




ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025లో తమ ఆరంభ మ్యాచ్‌లోనే సన్‌రైజర్స్ హైదరాబాద్ అదరగొట్టింది. విధ్వంసకర బ్యాటింగ్‌కు మారుపేరుగా మారిన ఈ జట్టు.. రాజస్తాన్ రాయల్స్‌పై 286 పరుగుల స్కోరు నమోదు చేసింది. ఇక తదుపరి మ్యాచ్‌లో భాగంగా గురువారం లక్నో సూపర్ జెయింట్స్‌తో రైజర్స్ తలపడనుంది. ఈ నేపథ్యంలో సొంతమైదానం ఉప్పల్ చెలరేగి ఆడే సన్‌రైజర్స్.. 300 పరుగుల మార్కును అందుకుంటుందా? అనే చర్చ జరుగుతోంది. ఈ విషయంపై సన్‌రైజర్స్ ఫాస్ట్ బౌలింగ్ కోచ్ జేమ్స్ ఫ్రాంక్లిన్ స్పందించాడు.

### 300 సాధ్యమే..

"ఇలా జరగదని.. నేను ఎన్నటికీ చెప్పను. ఈ సీజన్‌లో ఇప్పటికే రెండు మ్యాచ్‌లలో 230, 240 స్కోర్లు దాటాయి. కాబట్టి తాజా ఎడిషన్‌లో 300 పరుగుల మార్కు దాటినా ఆశ్చర్యపోనక్కర్లేదు. మా జట్టు ఈ స్కోరుకు దగ్గరగా వచ్చింది. కాబట్టి.. 300 స్కోరు అనే మాటను కొట్టిపారేయలేం" అని రైజర్స్- లక్నో మ్యాచ్‌కు ముందు ఫ్రాంక్లిన్ తన అభిప్రాయాన్ని వెల్లడించాడు.

### లక్నో బ్యాటింగ్ ఆర్డర్ కూడా ప్రమాదకరమైందే


అదే విధంగా లక్నో సూపర్ జెయింట్స్ బ్యాటింగ్ ఆర్డర్ గురించి ప్రస్తావన రాగా... "ఎల్ఎస్‌జీ బ్యాటింగ్ విభాగం ప్రమాదకరమైనది. ఆ జట్టులో టాపార్డర్ బ్యాటర్లు అద్భుతమైన ఆటగాళ్లు. వారిని ఎదుర్కోవాలంటే మూస తరహా వ్యూహాలు సరిపడవు. మేము కాస్త సృజనాత్మకంగా ఆలోచించాల్సి ఉంటుంది. వారి బ్యాటర్లను కట్టడి చేయడానికి మా బౌలింగ్ విభాగం బాగానే కష్టపడాల్సి ఉంటుంది" అని జేమ్స్ ఫ్రాంక్లిన్ చెప్పుకొచ్చాడు. కాగా కెప్టెన్ ప్యాట్ కమిన్స్‌తో పాటు టీమిండియా స్టార్ మహ్మద్ షమీ, హర్షల్ పటేల్, సిమ్రన్‌జిత్ సింగ్‌లతో సన్‌రైజర్స్ పేస్ దళం పటిష్టంగా ఉంది. మరోవైపు లక్నో జట్టులో ఐడెన్ మార్క్రమ్, మిచెల్ మార్ష్, నికోలస్ పూరన్, కెప్టెన్ రిషభ్ పంత్, డేవిడ్ మిల్లర్ రూపంలో పవర్ హిట్టర్లు ఉన్నారు. ఇక ఐపీఎల్ తాజా ఎడిషన్‌లో తమ తొలి మ్యాచ్‌లో సన్‌రైజర్స్ గెలుపొందగా.. లక్నో మాత్రం పరాజయాన్ని చవిచూసింది. విశాఖపట్నంలో ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్‌లో ఆఖరి ఓవర్ వరకు ఉత్కంఠగా సాగిన పోరులో ఒక్క వికెట్ తేడాతో పరాజయం పాలైంది.

ఐపీఎల్-2025లో సన్‌రైజర్స్ జట్టు

ట్రవిస్ హెడ్, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, నితీశ్ కుమార్ రెడ్డి, హెన్రిచ్ క్లాసెన్, అనికేత్ వర్మ, అభినవ్ మనోహర్, ప్యాట్ కమిన్స్ (కెప్టెన్), సిమర్‌జీత్ సింగ్, హర్షల్ పటేల్, మహ్మద్ షమీ, సచిన్ బేబి, జయదేవ్ ఉనాద్కట్, జీషన్ అన్సారీ, ఆడం జంపా, వియాన్ ముల్డర్, రాహుల్ చహర్, కమిందు మెండిస్, అథర్వ టైడే, ఈషన్ మలింగ



# యాక్షన్ థ్రిల్లర్‌గా మమ్ముట్టి 'బజూక' ట్రైలర్



మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి చాలా రోజుల తర్వాత మళ్లీ కొత్త సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఆయన ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'బజూక' ఈ సినిమాకు డీనో డెన్నిస్ దర్శకత్వం వహిస్తుండగా.. థియేటర్ ఆఫ్ డ్రీమ్స్, వై నాట్ స్టూడియోస్ బ్యానర్‌లపై డేవిన్ కురియకోస్, జిను వి అబ్రహం, విక్రమ్ మెహ్రా, సిద్ధార్థ్ ఆనంద్ కుమార్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. గౌతమ్ వాసుదేవ్ మీనన్ ఇందులో కీలక పాత్రల్లో నటిస్తున్నాడు. యాక్షన్ థ్రిల్లర్‌గా రాబోతున్న ఈ చిత్రం ఏప్రిల్ 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ట్రైలర్‌ను చూస్తే ఇది సీరియల్ కిల్లర్‌ను ఛేధించే కథాంశంతో రాబోతున్నట్లు తెలుస్తుంది. ట్రైలర్‌లో మమ్ముట్టి స్టైలిష్ లుక్‌లో, తీవ్రమైన యాక్షన్ సన్నివేశాలతో కనిపించారు.



# వ్యాపారవేత్త కూతురితో ప్రభాస్ పెళ్లి?

టాలీవుడ్ యంగ్ రెబల్ స్టార్ పెళ్లి గురించి ఎప్పటి నుంచో చర్చ నడుస్తోంది. ఇప్పటికే ప్రభాస్ పెళ్లి గురించి చాలాసార్లు వార్తలొచ్చాయి. కానీ అవన్నీ కేవలం రూమర్స్‌గానే మిగిలిపోయాయి. కొన్ని నెలల గ్యాప్ తర్వాత మళ్లీ ప్రభాస్ పెళ్లి గురించి మొదలైంది. త్వరలోనే ఆయన ఓ ఇంటివాడు కాబోతున్నారని నెట్టింట తెగ వైరలవుతోంది. అంతేకాదు రెబల్ స్టార్ పెద్దమ్మ శ్యామలా దేవి అప్పుడే పెళ్లి పనులతో బిజీగా ఉన్నారని టాక్ వినిపిస్తోంది. దీంతో ప్రభాస్ అన్న పెళ్లి కోసం ఎంతోమంది ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అయితే మరోసారి ప్రభాస్ పెళ్లి వార్తల నేపథ్యంలో తాజాగా ఆయన టీమ్ స్పందించింది. ప్రభాస్ మ్యారేజ్ గురించి వస్తున్న వార్తలన్నీ అవాస్తవాలేనని కొట్టి పారేశారు. ఓ బిజినెస్‌మెన్ కుమార్తెను పెళ్లి చేసుకోబోతున్నారంటూ వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు. ఈ వార్తలపై ఆయన టీమ్‌ను సంప్రదించగా.. ఎలాంటి ఊహాగానాలు నమ్మవద్దని రెబల్ స్టార్ అభిమానులకు సూచించారు. గతంలో ప్రభాస్ పెళ్లి గురించిన వచ్చిన రూమర్స్ అందరి దృష్టిని ఆకర్షించాయి. అతను తన బాహుబలి నటి అనుష్క శెట్టితో రిలేషన్‌షిప్‌లో ఉన్నాడని చాలాసార్లు రూమర్స్ వినిపించాయి. ఆ తర్వాత ఈ వార్తలను నటీనటులిద్దరూ ఖండించారు. తాము మంచి స్నేహితులమని క్లారిటీ ఇచ్చారు. ఇక సినిమాల విషయానికొస్తే ప్రభాస్ ప్రస్తుతం దర్శకుడు మారుతీ దర్శకత్వంలో ది రాజా సాబ్ సినిమా చేస్తున్నాడు. ఈ సినిమా ఏప్రిల్ 10న థియేటర్లలో విడుదల కావాల్సి ఉండగా.. వాయిదా పడింది. ఆ తర్వాత దర్శకుడు హను రాఘవపూడి డైరెక్షన్‌లో ఫౌజీ, సందీప్ రెడ్డి వంగాతో స్పిరిట్, నాగ్ అశ్విన్ దర్శకత్వంలో కల్కి – 2, ప్రశాంత్ నీల్‌తో సలార్ 2: శౌర్యంగ పర్వం సినిమాలను చేయనున్నారు.ఖ



# లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ వార్నింగ్స్‌పై 'సల్మాన్ ఖాన్' రియాక్షన్

తనకు వస్తున్న హత్య బెదిరింపుల గురించి బాలీవుడ్ సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్ స్పందించారు. తను నటించిన కొత్త సినిమా సికిందర్ ప్రమోషన్స్‌లో భాగంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కొంత కాలంగా లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి చంపేస్తామని సల్మాన్‌కు బెదిరింపులు వస్తున్న విషయం తెలిసిందే. ఆయన ఇంటి ముందు వారు కాల్పులు కూడా జరిపారు. ఏదోరోజు ఆయనపై తప్పకుండా పగ తీర్చుకుంటామని వారు గట్టిగానే హెచ్చరించారు. అయితే, తాజాగా ఈ బెదిరింపులపై సల్మాన్ స్పందించారు. సినిమా షూటింగ్స్ వల్ల ఎప్పుడూ కూడా సల్మాన్ చాలా ప్రయాణాలు చేస్తుంటారు. ఈ క్రమంలో ఆయనకు ప్రభుత్వం కూడా గట్టిగానే భద్రత కల్పించింది. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ హెచ్చరికలపై ఆయన ఇలా స్పందించారు. 'నేను ఎక్కువగా దేవుడిని నమ్ముతాను. నా జీవితం ఆయన చేతుల్లోనే ఉంది. ఆయుష్షు ఎంత వరకు ఆ దేవుడు ఇచ్చాడో అంత వరకు మాత్రమే జీవిస్తాను. ఇదంతా దేవుడి ఇష్టం. గట్టి భద్రత కల్పించారు. ఒక్కోసారి ఇది కూడా పెను సవాలుగా అనిపిస్తుంది. ఏదేమైనా ఆందోళనగా ఉన్నప్పటికీ మన చేతిలో ఏమీ ఉండదు.' అని ఆయన అన్నారు. సల్మాన్ ఖాన్ ప్రధాన పాత్రలో సికిందర్ చిత్రాన్ని దర్శకుడు ఏఆర్ మురుగదాస్ తెరకెక్కించారు. రష్మిక మందన్న హీరోయిన్‌గా నటించింది. రంజాన్, ఉగాది సందర్భంగా మార్చి 30న థియేటర్స్‌లోకి రానుంది. 2023లో విడుదలైన 'టైగర్ 3' తర్వాత సల్మాన్ నటించిన సినిమా ఇదే కావడంతో ఆయన ఫ్యాన్స్ సికిందర్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి బెదిరింపులు వస్తోన్న తరుణంలో సికిందర్ పబ్లిక్ ఈవెంట్స్‌లలో ఆయన పాల్గొనడం లేదు.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com